www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 262

పెళ్లికాని జంటలకు రూం ఇవ్వం!

2

హోటళ్లలో గది కావాలంటే పెళ్లయినట్లు ధ్రువీకరణ పత్రాలు చూపాల్సిందే



ఓయో సంస్థ కీలక నిర్ణయం

తొలుత మేరఠ్‌లో అమలు

ఆ తర్వాత దేశవ్యాప్తంగా..



ఆల్కహాల్‌తో కేన్సర్ ముప్పు!

మద్యం ఉత్పత్తులపై హెచ్చరికలు ఉండాలి

కొన్ని రకాల వంట నూనెలతోనూ ప్రమాదం

అమెరికా సర్జన్ జనరల్ వివేక్ మూర్తి

సోమవారం | 6-1-2025 | పేజీలు: 12

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి రా. 6.24 తదుపరి అష్టమి; నక్షత్రం: ఉత్తరాభాద్ర రా. 7.06 తదుపరి రేవతి; వర్జ్యం: శేషం ఉ. 6.56, తె. 6.28 మొదలు; దుర్ముహూర్తం: మ. 12.43-1.27, మ. 2.55-3.39; అమృతఘడియలు: మ. 2.32-4.04; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.50; సూర్యాస్తమయం: 5.51

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





హైందవ శంఖారావం సభలో ప్రతిజ్ఞ చేయిస్తున్న చినజీయర్ స్వామీజీ. సభలో శంఖం పూరించిన మహిళ (ఇన్‌సెట్)

ఆలయాల రక్షణకు దీక్ష!

పార్టీలు, ప్రభుత్వాల కబంధ హస్తాల నుంచి విముక్తి కల్పించాలి

హైందవ శంఖారావం తీర్మానం

బెజవాడ సమీపంలో వీహెచ్‌పీ భారీ బహిరంగ సభ

తరలివచ్చిన స్వామీజీలు, సాధు సంతులు

మన ధర్మానికి దేవాలయాలే మూలస్తంభాలు

స్వయంప్రతిపత్తి కావాలి.. అన్యమత ఉద్యోగులను తొలగించాలి

హిందూ ధర్మం పాటించే వారినే ట్రస్టు బోర్డుల్లో నియమించాలి

గతంలో విదేశీయుల నుంచి గుళ్లను కాపాడుకున్నాం

స్వాతంత్ర్యం వచ్చాక మాత్రం రక్షించుకోలేకపోతున్నాం

సనాతన ధర్మ రక్షణకు హిందువులు నడుం బిగించాలని పిలుపు

12 అంశాలతో డిక్లరేషన్

దైవనివాసాలైన ఆలయాలు దేదీప్యమానంగా దేశమంతా వెలుగొందాలంటే అయోధ్య రామ మందిరం తరహాలో ప్రభుత్వాల పెత్తనం లేకుండా హిందువులే భక్తి శ్రద్ధలతో నిర్వహించుకునే వాతావరణం రావాలి.

\- 'అయోధ్య' కోశాధికారి గోవిందదేవ్ గిరిజీ మహరాజ్

అమరావతి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మానికి మూలస్తంభమైన దేవాలయాలను రక్షించుకోవడమే హిందువులకు దీక్ష కావాలని 'హైందవ శంఖారావం' సభ పిలుపిచ్చింది. దేవాలయాలకు పూర్తి స్వయంప్రతిపత్తి కల్పిస్తూ వెంటనే చట్ట సవరణ చేయాలని.. ఆలయాలకు రక్షణ కల్పించాలని.. వాటిలో అన్యమత ఉద్యోగులను తక్షణమే తొలగించాలని తీర్మానించింది. సనాతన ధర్మ పరిరక్షణ, పూర్వ వైభవ పునరుద్ధరణ పేరుతో ఆదివారం విజయవాడ

మిగతా 11వ పేజీలో...



టీడీపీ నేతల కారుపై దాడి చేస్తున్న కిశోర్ (ఫైల్)

టీడీపీ నేతలపై దాడి చేసిన తురకా కిశోర్ అరెస్టు

వైసీపీ ప్రభుత్వ హయాంలో యథేచ్ఛగా అరాచకాలు

మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లికి ప్రధాన అనుచరుడు

కూటమి ప్రభుత్వం ఏర్పడగానే అజ్ఞాతంలోకి

ఎట్టకేలకు హైదరాబాద్‌లో అదుపులోకి

మాచర్లటౌన్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రధాన అనుచరుడు, మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్ తురకా కిశోర్‌ను పోలీసులు ఎట్టకేలకు పట్టుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆయనను అరెస్టు చేశారు. కిశోర్ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అనేక అరాచకాలకు పాల్పడి పలు కేసులలో నిందితుడిగా ఉన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం

మిగతా 12వ పేజీలో...

సర్కారీ కొలువుల జాతర!

2,686 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం కసరత్తు

పాతవి, కొత్తవి అన్నీ కలిపి ఈ ఏడాది భర్తీ

1,016 పోస్టులకు కొత్తగా 19 నోటిఫికేషన్లు

ఇప్పటికే జారీ చేసిన వాటిలో 1,670 పోస్టులు

వీటిలో కీలకమైన 150 గ్రూప్-1 ఉద్యోగాలు

12న జాబ్ క్యాలెండర్ విడుదల చేసే అవకాశం

వర్సిటీలు, ఆర్జీయూకేటీల్లో 3 వేలకు పైగా ఖాళీలు

వాటినీ ఈ ఏడాదే భర్తీ చేయనున్న ప్రభుత్వం



రాష్ట్రంలో సర్కారీ కొలువుల జాతరకు రంగం సిద్ధమైంది. భారీ సంఖ్యలో పోస్టులు భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఏపీపీఎస్సీ విడుదల చేసిన నోటిఫికేషన్ల భర్తీ ప్రక్రియను పూర్తిచేయడంతో పాటు కొత్త నోటిఫికేషన్లు కూడా ఇచ్చే దిశగా కసరత్తు చేస్తోంది. దీనికి సంబంధించి ఈ నెల 12న జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసే అవకాశం ఉంది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో వందల సంఖ్యలో ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం సిద్ధమైంది. కీలకమైన 150 గ్రూప్-1 పోస్టులతో పాటు వివిధ శాఖల్లో 866 ఖాళీలను ఈ ఏడాదిలో భర్తీ చేయనుంది. దీనికోసం కొత్తగా 19 నోటిఫికేషన్లు ఇవ్వడానికి ఏపీపీఎస్సీ సన్నాహాలు చేస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికల సంవత్సరంలో హడావుడిగా నోటిఫికేషన్లు జారీచేసినా వాటి భర్తీ ప్రక్రియను మాత్రం పూర్తిచేయలేకపోయింది. నిరుద్యోగ యువత ఎంతో ఆశగా ఎదురుచూసే గ్రూప్-2 పోస్టుల భర్తీకి ఒకే ఒక్క నోటిఫికేషన్ ఇచ్చినా, దాన్నీ పూర్తిచేయలేదు. అదేవిధంగా ఇతర శాఖల్లోనూ అనేక నోటిఫికేషన్ల భర్తీ ప్రక్రియ వివిధ దశల్లో నిలిచిపోయింది. దీంతో కొత్త నోటిఫికేషన్లు

మిగతా 11వ పేజీలో...



ఇక ప్రతి ఇల్లూ విద్యుత్కేంద్రమే!

కుప్పంలో ప్రయోగాత్మకంగా 'సూర్యఘర్'

నేడు ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

సౌర విద్యుదుత్పత్తి విప్లవానికి శ్రీకారం

తర్వాత రాష్ట్రమంతటా విస్తరణ

గృహ వినియోగదారులకు ఎంతో మేలు

అమరావతి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఇక రాష్ట్రంలో ప్రతి ఇల్లూ సౌర విద్యుత్కేంద్రంగా మారనుంది. సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో సోమవారం ప్రధాన మంత్రి సూర్యఘర్ కార్యక్రమాన్ని ఆయనే

మిగతా 12వ పేజీలో...

కలిసి ప్రపంచంతో పోటీ పడాలి

ఏపీ, తెలంగాణ మధ్య సమస్యలుంటే చర్చించుకుందాం

దేశంలోనే అగ్రగామిగా నిలుస్తున్న తెలుగు సినిమా

సైబరాబాద్‌తో ఐటీని అభివృద్ధి చేసిన చంద్రబాబు

దానిని మరింత ముందుకు తీసుకెళ్లిన వైఎస్: రేవంత్

ప్రపంచ తెలుగు సమాఖ్య ముగింపు సభలకు హాజరు



2

గంజాయిపై యుద్ధం!

కూటమి సర్కారు ప్రత్యేక చర్యలు

మన్యంలో మారుతున్న పరిస్థితులు

డ్రోన్ల సాయంతో గాలింపు చర్యలు

కొండల్లోని తోటలు ధ్వంసం

ఎక్కడికక్కడ వాహనాల తనిఖీ

మరోవైపు అవగాహన కార్యక్రమాలు

పటిష్ఠంగా నిఘా వ్యవస్థ ఏర్పాటు

అల్లూరి జిల్లాలో సాగుకు చెక్

ఒడిశా సరిహద్దులో పెరిగిన సాగు

ఏపీ మీదుగానే రవాణా

దీనిపై యంత్రాంగం ప్రత్యేక దృష్టి



శీలావతి రకం ఎండు గంజాయి

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

గంజాయి సాగు, రవాణాను పూర్తిగా నిర్మూలించడానికి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. జగన్ ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా గంజాయి సాగు చేసిన మన్యంలో ఇప్పుడు పరిస్థితులు మారుతున్నాయి. గంజాయి సాగు విస్తీర్ణం

మిగతా 11వ పేజీలో...

విశాఖ జైల్లో గంజాయి మొక్క

జైలు సందర్శనలో గుర్తించిన హోం మంత్రి వంగలపూడి అనిత

వైసీపీ ప్రభుత్వ తప్పిదాల వల్లే జైల్లో వరుస ఘటనలని విమర్శ



2

ఒక్కరోజు వేతనం.. 48 కోట్లు!

ప్రపంచంలోనే అత్యధిక జీతం పొందుతున్న వ్యక్తిగా క్వాంటమ్‌స్కేప్ సీఈవో జగదీప్ సింగ్ రికార్డు

ఆయన వార్షిక ఆదాయం రూ.17,500 కోట్లు

ఈవీ బ్యాటరీల తయారీలో అగ్రగామిగా క్వాంటమ్‌స్కేప్



2

పానీపూరీ పవర్!

ఏడాదిలో రూ.40 లక్షల డిజిటల్ లావాదేవీలు

దాంతో పానీపూరీ వ్యాపారికి జీఎస్టీ నోటీసులు

తమిళనాట ఘటన.. సోషల్ మీడియాలో వైరల్

రూ.40 లక్షల పరిమితి దాటితే జీఎస్టీ వర్తింపు

రాష్ట్రంలో హెచ్‌ఎంపీవీ వైరస్ లేదు

కరోనాకు పాటించిన జాగ్రత్తలు చాలు

లక్షణాలు కనిపిస్తే క్వారంటైన్ కావాలి

వైరస్‌తో దగ్గు, తుమ్ములు, గొంతు నొప్పి

ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ పద్మావతి వెల్లడి

2

స్థానిక నామినేటెడ్ పదవుల్లో 30-40% మనకే రావాలి!

అలా కేటాయింపులు జరిగేలా చూడండి

ప్రతి ఎమ్మెల్యేనూ ఐదుగురు సీనియర్లు కలవాలి

జనసేన నేతలకు అగ్రనాయకత్వం సూచన

11

వ్యతిరేకతను అధిగమిస్తేనే విజయాలు

- నేను సంపాయించింది పవన్, రామ్‌చరణ్‌నే
- 'ఆప్తా గ్లోబల్ బిజినెస్' సదస్సులో చిరంజీవి
- ఏపీలో సరికొత్త పర్యాటక విధానం తెచ్చాం: మంత్రి దుర్గేశ్

హైదరాబాద్ సిటీ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): తాను సంపాయించుకున్నది తన తమ్ముడు పవన్ కల్యాణ్, కుమారుడు రామ్‌చరణ్‌లనేనని అగ్ర నటుడు చిరంజీవి తెలిపారు. వ్యతిరేకతను అధిగమిస్తేనే విజయం దక్కుతుందని యువ పారిశ్రామిక వేత్తలకు ఆయన సూచించారు. గత మూడు రోజులుగా 'కనెక్ట్, కొలాబరేట్, క్రియేట్' ఇతివృత్తంతో హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో జరుగుతున్న అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్(ఆప్తా) పెట్టుబడిదారుల ప్రపంచ వ్యాపార సదస్సు(క్యాటలిస్ట్ గ్లోబల్ బిజినెస్ కాన్ఫరెన్స్) ముగింపు సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. ఎక్కడో అమెరికా నుంచి వచ్చి ఇక్కడ కార్యక్రమం చేయడానికి దమ్ము కావాలని, అందరి అనుమానాలను పటాపంచలు చేస్తూ ఆప్తా నిర్వాహకులు కార్యక్రమం నిర్వహించిన తీరు అభినందనీయమన్నారు. ఆప్తా సభ్యుల లక్ష్యం నెరవేరాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తన పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తన చిన్నతనంలో క్రీడాకారుడు కావాలనే లక్ష్యం పెట్టుకున్నానని తెలిపారు. "చదువుకునే సమయంలోనే కాలేజీలో అనుకోకుండా 'రాజీనామా' అనే డ్రామా చేశాను. అది బెస్ట్ యాక్టర్ అవార్డు తెచ్చింది. ఆ తరువాత నటనపై ఆసక్తి కలిగి ఫిలిం ఇనిస్టిట్యూట్‌లో చేరా. ఫొటోలు తీసుకుని ఏ ఆఫీస్‌కూ వెళ్లలేదు. ఫిలిం ఇనిస్టిట్యూట్ నుంచే నాకు అవకాశాలు వచ్చాయి" అని వివరించారు.

సద్వినియోగం చేసుకోండి: కందుల దుర్గేశ్

ఏపీలో వినూత్న పర్యాటక విధానాన్ని తెచ్చామని.. దీనిని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ సూచించారు. 'ఆప్తా' సదస్సు చివరిరోజు 'అన్‌లాకింగ్ గ్రోత్ అండ్ కల్చరల్ హెరిటేజ్ త్రూ టూరిజం అండ్ హాస్పిటాలిటీ' అనే అంశంపై చర్చలో మంత్రి దుర్గేశ్ మాట్లాడారు. రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం తీసుకువచ్చిన విధానాలు, అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు. ఏపీలో పర్యాటక పరంగా అపార అవకాశాలున్నాయని చెప్పారు. తీర ప్రాంతంలో బీచ్, రిసార్ట్ టూరిజంతో పాటు టెంపుల్, ఎకో, ఎడ్వెంచర్, సాహిత్య టూరిజం ఇలా ఎన్నో అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అయితే మంత్రి పలు విధానాలు గురించి వివరిస్తుండగా, కార్యక్రమ నిర్వాహకులు ప్రసంగాన్ని త్వరగా ముగించాలని కోరడంతో చిన్నబుచ్చుకున్నారు. తనకు ముందుగానే కార్యక్రమ పూర్వాపరాలు చెప్పి ఉంటే త్వరగా ముగించేవాడినన్నారు. అనంతరం వేదిక దిగి వెళ్లిపోయారు. నిర్వాహకులు ఆయనకు సర్ది చెప్పడానికి ప్రయత్నించినా, ఆయన ప్రాంగణం నుంచి వడివడిగా వెళ్లిపోయారు. లక్ష్మీనారాయణ కూడా మంత్రితో వ్యవహరించిన తీరు పట్ల అసహనం వ్యక్తం చేశారు.

ఒక్క రోజు వేతనం.. 48 కోట్లు!

- ప్రపంచంలోనే అత్యధిక జీతం పొందుతున్న వ్యక్తిగా క్వాంటమ్‌స్కేప్ సీఈవో జగదీప్ సింగ్ రికార్డు
- ఈవీ బ్యాటరీల తయారీలో అగ్రగామిగా క్వాంటమ్‌స్కేప్

న్యూఢిల్లీ, జనవరి 5: రూ.48 కోట్లు. ఇది ఒక కంపెనీ నెలవారీ టర్నోవర్ కాదు. ఒక వ్యక్తి ఒక్క రోజులో సంపాదించే మొత్తం. ఆయన పేరు జగదీప్ సింగ్. విద్యుత్తు వాహనాల్లో వినియోగించే బ్యాటరీల తయారీ రంగంలో ఉన్న క్వాంటమ్‌స్కేప్ సీఈవో ఇతను. ప్రపంచంలోనే అత్యధిక వేతనం పొందుతున్న వ్యక్తిగా జగదీప్‌సింగ్ రికార్డు సృష్టించారు. ఆయన వేతనం రోజుకు 48 కోట్ల రూపాయలు. ఏడాదికి రూ.17,500 కోట్లు. ఇది చాలా పెద్దసంస్థల వార్షిక ఆదాయం కంటే అధికం. 2010లో అమెరికాలో జగదీప్ సింగ్ స్థాపించిన క్వాంటమ్‌స్కేప్... ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీల తయారీలో అగ్రగామిగా ఉంది. భారత సంతతికి చెందిన ఆయన స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీలో బీటెక్, బర్కిలీలోని కాలిఫోర్నియా యూనివర్సిటీలో ఎంబీఏ చదివారు. బ్యాటరీ టెక్నాలజీలో తనదైన ముద్ర వేసిన జగదీప్ సింగ్.. ప్రపంచం దృష్టి ఆకర్షిస్తున్నారని పారిశ్రామిక దిగ్గజాలు ప్రశంసిస్తున్నారు. కళ్లు చెదిరే ఆయన వేతన ప్యాకేజీ వివరాలు వెల్లడి కావడంతో రాత్రికి రాత్రే ఆయన ఇంటర్నెట్‌లో సంచలనంగా మారారు.

అబూజ్‌మడ్‌లో నలుగురు నక్సల్స్ హతం

చర్ల, జనవరి 5(ఆంధ్రజ్యోతి): అబూజ్‌మడ్ మరోమారు నెత్తురోడింది. భద్రతాబలగాలు-మావోయిస్టులకు మధ్య శనివారం అర్ధరాత్రి నుంచి జరిగిన ఎదురుకాల్పుల్లో.. ఇద్దరు మహిళలు సహా నలుగురు నక్సల్స్, డీఆర్జీకి చెందిన ఓ హెడ్‌కానిస్టేబుల్ మృతిచెందారు. ఆదివారం ఉదయం జరిపిన గాలింపులో..నలుగురు నక్సల్స్ మృతదేహాలు లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్రంలో హెచ్ఎంపీవీ వైరస్ లేదు

- ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ పద్మావతి వెల్లడి

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): చైనాలో గుర్తించిన కొత్తరకం వైరస్ హెచ్ఎంపీవీకి సంబంధించిన కేసులు రాష్ట్రంలో ఎక్కడా నమోదు కాలేదని ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి తెలిపారు. ఈ వైరస్ గురించి భయాందోళనలు అవసరం లేదన్నారు. 'న్యూమో విరిలే' కుటుంబానికి చెందిన కొత్త రకం వైరస్ కరోనా తరహాలోనే ఒకరి నుంచి మరొకరికి సంక్రమిస్తుందని చెప్పారు. చిన్నపిల్లలు, వృద్ధులు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిపై ఈ వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నారు. వైరస్ సోకినవారి దగ్గు, తుమ్ముల వల్ల వెలువడే తుంపర్ల ద్వారా వ్యాపిస్తుందని తెలిపారు. వైరస్ వ్యాప్తిని నిరోధించడానికి కరోనా సమయంలో తీసుకున్న జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రస్తుతం వైరస్ వ్యాప్తి తక్కువ స్థాయిలోనే ఉందని, మన దేశంలో, రాష్ట్రంలో ఎక్కడా కేసులు నమోదు కాలేదని పేర్కొన్నారు.

అభిమానాన్ని బలహీనతగా చూస్తారా?: సీపీఐ

కొత్తగా విడుదల కాబోయే సినిమాలకు టికెట్ రేట్లు పెంచుకునేందుకు, బెనిఫిట్ షోలకు అనుమతివ్వడాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఖండించారు. డిమాండ్ అండ్ సప్లై ఆధారంగా రేట్లు పెంచుతున్నామని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను తప్పుబడుతూ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజల అభిమానాన్ని బలహీనతగా చూస్తారా? అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం తరహాలో ఏపీలో కూడా టికెట్ ధరల పెంపు, బెనిఫిట్ షోలకు అనుమతులను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

రబీకి పెరిగిన ఎరువుల కేటాయింపు

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రబీ పంటల సాగుకు అవసరమైన ఎరువుల కోటాను కేంద్రం పెంచింది. ఈ సీజన్‌లో 21.31 లక్షల టన్నుల ఎరువులు అవసరం కాగా, కేంద్రం ఈసారి 22.30లక్షల టన్నులు కేటాయించింది. జనవరిలో 2.29 లక్షల టన్నుల యూరియా అవసరమైతే 2.32లక్షల టన్నులు విడుదల చేసింది. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు చొరవతో కేంద్రం రాష్ట్రానికి ఎరువుల కోటా పెంచింది.

ఏపీ రెరా పెండింగ్ దరఖాస్తులపై నేడు స్పెషల్ డ్రైవ్

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఏపీ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(ఏపీ రెరా)లో పెండింగ్ దరఖాస్తుల క్లియరెన్స్ కోసం సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి ఏపీ రెరా కార్యాలయంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి అధికారులతో పాటు మంత్రి నారాయణ స్వయంగా హాజరుకానున్నారు. విజయవాడ పాలిక్లినిక్ రోడ్డులోని ఆఫీసులో జరిగే ఈ గ్రీవెన్స్‌కు దరఖాస్తుదారులు హాజరయ్యేలా అధికారులు ఇప్పటికే సమాచారం పంపారు.

17న మంత్రివర్గ సమావేశం

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఈ నెలలో రెండోసారి మంత్రివర్గ సమావేశం 17న జరగనుంది. ఈ మేరకు సీఎస్ కె.విజయానంద్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. కొత్త ఏడాదిలో 2న తొలిసారి మంత్రివర్గ సమావేశం జరిగిన విషయం తెలిసిందే. రెండోసారి క్యాబినెట్ భేటీ 17న ఉదయం 11 గంటలకు సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో జరగనుంది. స్పెషల్ సీఎస్‌లు, ప్రిన్సిపల్ సెక్రటరీలు 16వ తేదీ నాటికి ఆయా శాఖల ప్రతిపాదనలు పంపించాలని సీఎస్ ఆదేశించారు.

పానీ పూరీ పవర్!

- ఏడాదిలో రూ.40 లక్షలకు పైగా డిజిటల్ లావాదేవీలు నమోదు చేసిన ఓ పానీపూరీ వ్యాపారి
- జీఎస్టీ నోటీసుల జారీ.. తమిళనాడులో ఘటన

న్యూఢిల్లీ, జనవరి 5: పానీ పూరీ.. మన దేశంలో ప్రసిద్ధమైన ఒక స్ట్రీట్ ఫుడ్! సాయంత్రం అయిందంటే చాలు చిన్న పట్టణాల నుంచి నగరాల వరకూ వీధుల్లో, రోడ్ల పక్కన పానీ పూరీ విక్రయించే బండ్ల ముందు చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు బారులు తీరుతుంటారు. లొట్టలు వేసుకుంటూ.. పానీ పూరీలను లాగించేస్తారు. ఈ వ్యాపారంలో అధిక సంఖ్యలోనే లావాదేవీలు ఉంటాయి. అది ఎంతలా అంటే.. తమిళనాడుకు చెందిన ఒక పానీపూరీ వ్యాపారికి జీఎస్టీ విభాగం నుంచి నోటీసులు వచ్చేంత! 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఫోన్‌పే, రేజర్‌పేల ద్వారా రూ.40 లక్షలకు పైగా నగదు చెల్లింపులు జరిగాయని.. సదరు వ్యాపారి జీఎస్టీ కింద నమోదు చేసుకోలేదని నోటీసులు జారీచేసింది. ఇది కాస్తా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై నెటిజన్లు మీమ్స్, జోక్స్ పేలుస్తున్నారు. ఉద్యోగాలు చేసే వారి కంటే పానీపూరీ వ్యాపారం ఆదాయమే బెటర్ అని కామెంట్లు పెడుతున్నారు. ఎగుమతి అవకాశాలు, విదేశీ సహకారం కూడా అవసరం అవుతాయేమోనని హాస్యాస్పదంగా స్పందిస్తున్నారు. పానీ పూరీ అమ్మకందారులు వ్యాపార దిగ్గజాలుగా మారే అవకాశం ఉందంటూ మరికొందరు పోస్టులు చేస్తున్నారు. ఇక, డిజిటల్ పేమెంట్లను అధికంగా స్వీకరిస్తున్న నేపథ్యంలో.. ఇది వీధి వ్యాపారులను కూడా నెమ్మదిగా పన్ను వ్యవస్థ పరిధిలోకి తెచ్చేలా చేస్తోంది. ఇది భారత అసంఘటిత వ్యాపార రంగం భవిష్యత్తుపై పలు ప్రశ్నలు లేవనెత్తుతోంది.

లోకం తీరు



పెళ్లికాని జంటలకు రూం ఇవ్వం!

- గది కావాలంటే పెళ్లయినట్లు ఐడీ చూపాల్సిందే..ఓయో సంస్థ నిర్ణయం

న్యూఢిల్లీ, జనవరి 5: ప్రముఖ హోటల్ గదుల బుకింగ్ సంస్థ ఓయో కీలక నిర్ణయం తీసుకుంది. హోటళ్లలో దిగేవారికి కొత్త చెక్-ఇన్ విధానాన్ని తీసుకొచ్చింది. ఇకపై అవివాహిత జంటలకు హోటళ్లలో గది ఇవ్వరు! ఈ మేరకు ఈ ఏడాది అమల్లోకి వచ్చేలా కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. ఇందులో భాగంగా ఇక మీదట పెళ్లికాని జంటలు గదిని బుక్ చేసుకునేందుకు వీలుండదు. ఈ నిబంధనలు తొలుత మేరఠ్ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ విషయాన్ని కంపెనీ ఆదివారం వెల్లడించింది. ఓయో సవరించిన విధానం ప్రకారం.. ఇకపై ఆన్‌లైన్‌లో లేదా ఆఫ్‌లైన్‌లో రూమ్ బుక్ చేసుకునేటప్పుడు జంటలు పెళ్లి ధ్రువపత్రాలు/రుజువును సమర్పించాల్సి ఉంటుంది. అంటే కచ్చితంగా వివాహాన్ని నిర్ధారించే గుర్తింపు పత్రాలను చూపించాల్సి ఉంటుంది. ఏదైనా సందర్భంలో ఇలాంటి బుకింగ్‌లను తిరస్కరించే విచక్షణాధికారాన్ని ఓయో తన భాగస్వామి హోటళ్లకు అందించింది. మేరఠ్‌లోని తన భాగస్వామ్య హోటళ్లలో తక్షణమే దీన్ని అమల్లోకి తీసుకురానుంది. క్షేత్ర స్థాయి అభిప్రాయాలు, సూచనల (ఫీడ్‌బ్యాక్) ఆధారంగా కంపెనీ దీన్ని మరిన్ని నగరాలకు విస్తరించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. తాము సురక్షితమైన, బాధ్యతాయుతమైన ఆతిథ్య విధానాలను అమలు చేసేందుకు కట్టుబడి ఉన్నామని ఓయో ఉత్తర భారత రీజియన్ అధిపతి పవాస్ శర్మ చెప్పారు. అందులో భాగంగానే తాజాగా కొత్త చెక్-ఇన్ విధానాన్ని తీసుకొచ్చినట్లు వెల్లడించారు.

ఏపీ, తెలంగాణ కలిసి ప్రపంచంతో పోటీ పడాలి

- సమస్యలుంటే చర్చించుకుని పరిష్కరించుకుందాం
- సైబరాబాద్‌తో ఐటీని అభివృద్ధి చేసిన చంద్రబాబు
- దానిని మరింత ముందుకు తీసుకెళ్లిన వైఎస్ఆర్: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి
- ప్రపంచ తెలుగు సమాఖ్య ముగింపు సభలకు హాజరు


మహాసభల వేదికపై టీ సీఎం రేవంత్ రెడ్డి తదితరులు

హైదరాబాద్ సిటీ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు పోటీ అని చాలా మంది అంటుంటారని, కానీ.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కలిసి ప్రపంచ దేశాలతో పోటీపడేలా అభివృద్ధి చెందాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. ఆ దిశగా ఆలోచనా విధానంలో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఇరు రాష్ట్రాల మధ్య ఏమైనా సమస్యలున్నా.. చర్చించుకుని పరిష్కరించుకుందామని అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో జరిగిన ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభల ముగింపు ఉత్సవానికి సీఎం రేవంత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత నార్నే విజయలక్ష్మి సంపాదకత్వంలో వెలువడిన "తెలుగుదనం- తెలుగు ధనం" పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రముఖ సినీనటులు జయప్రద, జయసుధ, మురళీమోహన్, సాయికుమార్, నిర్మాత అశ్వినీదత్ తదితరులను సత్కరించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. దివంగత నేత నందమూరి తారకరామారావు చేతులమీదుగా 30 ఏళ్ల కిందట ప్రారంభమైన ఈ సంస్థ 12వ ద్వైవార్షికోత్సవంలో పాల్గొనడం తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. "దేశంలోనే అత్యధిక మంది మాట్లాడే భాషల్లో తెలుగు రెండో స్థానంలో ఉంది. ప్రపంచ వ్యాప్తంగా తెలుగువారి జనాభా 18 కోట్ల మంది పైచిలుకు అని ఒక అంచనా. అయినా జాతీయ రాజకీయాలపై తెలుగువాళ్లం ప్రభావం చూపలేకపోతున్నాం" అని రేవంత్ అన్నారు. ఐటీ, ఫార్మా రంగాల్లో తెలుగువారు ఎందరో అత్యున్నత స్థాయిల్లో రాణిస్తున్నారని సీఎం రేవంత్ తెలిపారు. దేశంలో 35 శాతం ఔషధాలు (బల్క్ డ్రగ్స్) హైదరాబాద్‌లోని తెలుగువారి కంపెనీల నుంచి ఉత్పత్తి అవుతున్నాయని చెప్పడానికి సంతోషిస్తున్నానన్నారు. ఆనాడు ప్రధాని రాజీవ్‌గాంధీ ఈ దేశానికి కంప్యూటర్‌ను పరిచయం చేసి, సాంకేతిక రంగంలో దూసుకెళ్లగలిగేందుకు అవసరమైన పునాదులు నిర్మించారని చెప్పారు. దానిని అప్పటి ఉమ్మడి ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు అందిపుచ్చుకుని సైబరాబాద్ నిర్మాణంతో అత్యంత ఆధునిక, సాంకేతిక అభివృద్ధిలో ప్రపంచంతోనే పోటీపడే విధంగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. ఆ తర్వాత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి దానిని మరింత ముందుకు తీసుకెళ్లారని, ఫలితంగా నేడు తెలంగాణకు 65 శాతం ఆదాయం హైదరాబాద్ నుంచే వస్తోందని వెల్లడించారు. తెలుగు సినిమా రంగం నేడు దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని, హాలీవుడ్‌తో సైతం పోటీపడుతున్న సందర్భాలు చూస్తున్నామని సీఎం రేవంత్ ప్రశంసించారు. ప్రభుత్వ ఆదేశాలను వీలైనంత వరకు తెలుగులో వెలువరించేందుకు ప్రయత్నిస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. అంతకుముందు ప్రపంచ తెలుగు సమాఖ్య ప్రధాన కార్యదర్శి నార్నే విజయలక్ష్మి మాట్లాడుతూ.. ఈ కాలానికి తగినట్టుగా పెద్ద బాలశిక్షను సవరించి, ప్రాథమిక స్థాయి విద్యాబోధనలో భాగం చేయాలని సీఎంను కోరగా.. తప్పకుండా ఈ విషయాన్ని విద్యా కమిషన్ దృష్టికి తీసుకెళ్లి ఆచరణీయమైన సలహాలను తీసుకొని అమలు చేస్తామని రేవంత్ తెలిపారు.

దేశ రాజకీయాల్లో నన్ను వెలిగించింది తెలుగే!

- ఇంగ్లిషు నేర్చుకుందాం.. కానీ వ్యామోహం వద్దు: వెంకయ్యనాయుడు



అలంకారాల్లో ఒదిగి పోయే విలక్షణమైన భాష తెలుగు. వేల మాటల్లో చెప్పగలిగే భావాన్ని సైతం ఒక్క మాటలో భావయుక్తంగా చెప్పే వెసులుబాటు మన భాష సొంతం' అని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. తెలుగులో ఆలోచించడం వల్లే ఇతర భాషల్లోనూ అంతే సాధికారతతో ప్రజలను ఆకట్టుకునేలా మాట్లాడగలమని, తనను దేశ రాజకీయాల్లో వెలిగించింది తెలుగేనని భావోద్వేగంతో చెప్పారు. ఇంగ్లిషు నేర్చుకుందాం కానీ దానిపై వ్యామోహాన్ని వీడుదామని పిలుపునిచ్చారు. 'మాతృభాష రాకపోతే శ్వాస ఆగిపోయినట్లే. మాతృభాష మరిస్తే మాతృబంధం వీడినట్లే. కనుక తల్లిదండ్రులు తప్పనిసరిగా పిల్లలకు మాతృభాష మాధుర్యాన్ని గోరుముద్దల్లా అందించాల'ని కోరారు.

ఢిల్లీ రోడ్లను ప్రియాంక బుగ్గల్లా మారుస్తా

- బీజేపీ నేత బిధూరి వివాదాస్పద వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీపై బీజేపీ నేత, మాజీ ఎంపీ రమేష్ బిధూరి అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన కల్కాజీ నుంచి బీజేపీ అభ్యర్థిగా సీఎం అతిషిపై పోటీ చేస్తున్నారు. ఓ ప్రచార సభలో మాట్లాడుతూ.. "గతంలో ఆర్జేడీ నేత లాలూ ప్రసాద్ యాదవ్ బిహార్ రోడ్లను హేమమాలిని బుగ్గల్లాగా చేస్తానంటూ అబద్ధం చెప్పారు. నేను మాత్రం ఓక్లా, సంగం విహార్‌లో రోడ్లను అభివృద్ధి చేసినట్లే కల్కాజీ రోడ్లను కూడా ప్రియాంక బుగ్గల మాదిరి నిర్మిస్తాన"ని అన్నారు. ఈ వ్యాఖ్యలను కాంగ్రెస్, ఆప్ ఖండించాయి. బిధూరిపై పార్టీ తరపున పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఆల్కా లాంబా చెప్పారు. తన వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు రావడంతో... ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్టు బిధూరి ఎక్స్ వేదికగా ప్రకటించారు.

8 నుంచి ప్రపంచ తెలుగు మహాసభలు

- జీజీయూ చాన్స్‌లర్ చైతన్య రాజు

రాజానగరం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ప్రాంగణంలో ఈ నెల 8 నుంచి చైతన్య విద్యా సంస్థల ఆధ్వర్యంలో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించనున్నట్లు జీజీయూ చాన్స్‌లర్ కేవీవీ సత్యనారాయణరాజు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఇక్కడి వర్సిటీలో ఆవిష్కరించారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటిచెప్పాలనే సంకల్పంతో రెండు రోజులు సభలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకోసం వర్సిటీ ప్రాంగణంలో నన్నయ, రాజరాజ నరేంద్ర, వీరేశలింగం పేరిట వేదికలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ మహాసభలకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ, తెలుగు రాష్ట్రాలకు చెందిన గవర్నర్లు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, న్యాయకోవిదులు, భాషా పండితులు, సినీ నటులు, రచయితలు హాజరవుతారని చెప్పారు.

కుంభమేళాకు 13 వేల రైళ్లు

40 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా.. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు నిర్వహణ

- ప్రయాగరాజ్‌లో 18 వేల మంది ఆర్‌పీఎఫ్ సిబ్బంది మోహరింపు
- మేళాకు బాంబు బెదిరింపు
- బిహార్‌లో ఒకరి అరెస్టు

ప్రయాగరాజ్, జనవరి 5: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో ఈ నెల 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు జరుగనున్న జరుగనున్న మహా కుంభమేళాకు దేశవిదేశాల నుంచి 40 కోట్ల మంది వరకు వస్తారని అంచనా వేస్తున్నారు. యాత్రికులు, భక్తులను చేరవేసేందుకు రైల్వే శాఖ పెద్దఎత్తున ఏర్పాట్లు చేసింది. 50 రోజుల పాటు 13 వేల రైళ్లు నడపాలని నిర్ణయించింది. వీటిలో పది వేలు రెగ్యులర్ సర్వీసులు కాగా.. మూడు వేలు ప్రత్యేక రైళ్లు. మేళా జరగడానికి 2-3 రోజుల ముందు.. ఆ తర్వాత 2-3 రోజుల వరకు రైళ్లు నడుస్తాయి. అలాగే పవిత్ర పుణ్యక్షేత్రాలను కలుపుతూ 560 రింగ్ రైళ్లు నడుపనుంది. ప్రయాగరాజ్-అయోధ్య-వారాణసీ-ప్రయాగ్‌రాజ్, ప్రయాగరాజ్-సంగమ్ ప్రయాగ్-జాన్‌పూర్-ప్రయాగ్-ప్రయాగరాజ్, గోవింద్‌పురి-ప్రయాగరాజ్-చిత్రకూట్-గోవింద్‌పురి, ఝాన్సీ-గోవింద్‌పురి-ప్రయాగరాజ్-మాణిక్‌పూర్-చిత్రకూట్-ఝాన్సీ మార్గాల్లో వీటిని నడుపుతారు. ప్రయాగరాజ్ ప్రాంతంలోని మొత్తం 9 రైల్వే స్టేషన్లలో 560 టికెట్ కౌంటర్లను కూడా రైల్వే ఏర్పాటుచేస్తోంది. భక్తులు లక్షలాదిగా తరలిరానున్న నేపథ్యంలో రైల్వే రక్షణ దళం (ఆర్‌పీఎఫ్), రాష్ట్ర రైల్వే పోలీసుకు చెందిన 18 వేల మందికిపైగా సిబ్బందిని మోహరిస్తున్నట్లు ఉత్తర మధ్య రైల్వే జీఎం ఉపేంద్ర వెల్లడించారు. ప్రయాణికులకు వైద్య సేవలు అందించడానికి ఆక్సిజన్ సిలిండర్లు, కాన్సంట్రేటర్లు, ఈసీజీ యంత్రాలతో ప్రయాగరాజ్ జంక్షన్‌లో అబ్జర్వేషన్ రూంను ఏర్పాటు చేశామన్నారు.


ప్రయాగ్‌రాజ్‌లో త్రివేణి సంగమం వద్ద భక్తులు

ఉగ్ర బెదిరింపు..

మహాకుంభమేళాకు ఆదివారం బాంబు బెదిరింపు వచ్చింది. ఉగ్ర దాడిచేస్తానని, వెయ్యి మందిని చంపుతానని సోషల్ మీడియాలో పోస్టుచేసిన ఆయుష్‌కుమార్ జైస్వాల్‌ను మహాకుంభ్ పోలీసులు అరెస్టు చేశారు. ఇతడు విద్యార్థి. బిహార్‌లోని షాదీజంగ్ వాసి. ఇన్‌స్టాగ్రాంలో నాసిర్ పఠాన్ అనే నకిలీ పేరుతో ఈ బెదిరింపు పోస్టు పెట్టి నేపాల్ పారిపోయాడు. తన పక్కింటిలోని నాసిర్ పఠాన్‌ను ఇరికించేందుకే ఆయుష్ ఆ పేరుతో పోస్టు పెట్టినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

మేళా జరిగేది వక్ఫ్ భూమిలో!

తమ వక్ఫ్ భూమిలో మహాకుంభమేళా జరగబోతోందని అఖిల భారత ముస్లిం జమాత్ అధ్యక్షుడు మౌలానా షహబుద్దీన్ రజ్వీ బరేల్వీ తెలిపారు. వక్ఫ్ భూమిలో ఇంతటి ఉత్సవం నిర్వహించేందుకు అనుమతించి ముస్లింలు తమ విశాల హృదయాన్ని చాటుకున్నారని.. హిందువులు కూడా ఇచ్చిపుచ్చుకునే రీతిలో ఈ కార్యక్రమానికి తమను అనుమతించాలని అన్నారు. ఆయన వ్యాఖ్యలపై హిందూ మహాసభ మండిపడింది. పాకిస్థాన్ ప్రేరిత మౌలానాను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేసింది. మహాకుంభ్‌ను ఆటంకపరచడానికి ఆయన ఈ వ్యాఖ్యలు చేస్తున్నారంది.

అణువిపత్తును ఎదుర్కొనేందుకు శిక్షణ

మహా కుంభమేళా సందర్భంగా రసాయన, అణు విపత్తులు చోటుచేసుకుంటే ఎదుర్కోవడానికి యూపీ ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. సిబ్బందిని అందుకు సన్నద్ధం చేసేందుకు గత శుక్రవారం ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చింది. యూపీ విపత్తు నిర్వహణ అథారిటీ (యూపీఎస్‌డీఎంఏ), కేంద్రప్రభుత్వం, అణుశక్తి విభాగం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని అథారిటీ ఉపాధ్యక్షుడు లెఫ్టినెంట్ జనరల్ యోగేంద్ర డిమ్రీ ప్రారంభించారు. సంబంధిత సాధనాల ప్రదర్శనతో పాటు విపత్తు నిర్వహణలో కొత్త సాంకేతికతలు, రసాయన ప్రమాదాలపై సత్వర స్పందన, సురక్షిత సహాయ కార్యక్రమాలు, వైద్యసాయం మొదలైనవాటిపై వివిధ శాఖలకు చెందిన సుమారు 400 మందికి శిక్షణ ఇచ్చారు.

ఆల్కహాల్‌తో క్యాన్సర్ ముప్పు!



మద్యం ఉత్పత్తులపై హెచ్చరికలు ఉండాలి.. అమెరికా సర్జన్ జనరల్ సూచన

వాషింగ్టన్, జనవరి 5: 'మద్యం సేవించడం ఆరోగ్యానికి హానికరం' అనేది అందరికీ తెలిసిన విషయమే.! కానీ.. మద్యం తాగితే క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని అమెరికా సర్జన్ జనరల్ మరోసారి హెచ్చరించింది. మద్యం బాటిళ్లపై హెచ్చరికలతో కూడిన లేబుళ్లు వేసి ప్రజలకు అవగాహన కల్పించాలని యూఎస్ సర్జన్ జనరల్ వివేక్ మూర్తి పిలుపునిచ్చారు. అంతేకాదు మనం నిత్యం వంటకాల్లో వాడే సన్‌ఫ్లవర్, ద్రాక్ష గింజల ఆయిల్ వంటి కొన్నిరకాల విత్తన నూనెల కారణంగా పెద్దపేగు కేన్సర్ రోగులు కూడా పెరుగుతున్నారని అమెరికాలోని మరో అధ్యయనం సూచించింది. అమెరికాలో ఆల్కహాల్ వల్ల ఏటా దాదాపు 1,00,000 మంది కేన్సర్ బారిన పడుతుండగా వారిలో 20 వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. సర్జన్ జనరల్ వివేక్ మూర్తి పేర్కొన్న మేరకు.. పొగాకు, ఊబకాయం తర్వాత కేన్సర్‌కు మూడో అతిపెద్ద కారణం ఆల్కహాల్. మద్యం సేవించడం వల్ల రొమ్ము, కాలేయం, పెద్దపేగు, అన్నవాహిక, గొంతు సహా ఏడు రకాల కేన్సర్లు వచ్చే ప్రమాదం ఉందని శాస్త్రీయ పరిశోధనల్లో నిర్ధారణ అయింది. ఈ నేపథ్యంలో క్యాన్సర్ ప్రమాదాన్ని సూచించేలా ఆల్కహాల్ ఉత్పత్తులపై నూతనంగా రూపొందించిన ఆరోగ్య హెచ్చరికలను తప్పనిసరి చేయాలని సర్జన్ జనరల్ అమెరికా కాంగ్రెస్‌ను కోరింది. పొగాకు వల్ల కేన్సర్ వస్తుందని 91% మంది అమెరికన్లు గుర్తిస్తుండగా.. 50% మంది మాత్రమే ఆల్కహాల్‌ను క్యాన్సర్ కారకంగా గుర్తిస్తున్నారు. కాబట్టి దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సర్జన్ జనరల్ కోరింది. దీన్ని ఆల్కహాల్ బేవరేజెస్ కంపెనీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కాగా, అంతర్జాతీయంగా ఐర్లాండ్, దక్షిణ కొరియా వంటి దేశాలు ఇప్పటికే ఆల్కహాల్ ఉత్పత్తులపై కేన్సర్ హెచ్చరికలను తప్పనిసరి చేశాయి.

వంట నూనెలతోనూ..

ఇళ్లలో, రెస్టారెంట్లలో వాడే సన్‌ఫ్లవర్ ఆయిల్, ద్రాక్ష గింజల నూనె, కనోలా, మొక్కజొన్న నూనెలతో కేన్సర్ వచ్చే ప్రమాదం ఉందని అమెరికా శాస్త్రవేత్తల తాజా అధ్యయనంలో వెల్లడైంది. పెద్ద పేగు క్యాన్సర్ ముఖ్యంగా యువకుల్లో ఈ తరహా కేన్సర్ పెరుగుదలకు ఈ వంట నూనెలే కారణమని తేలింది. అధ్యయనంలో భాగంగా 30 నుంచి 85 ఏళ్ల మధ్య వయసున్న 80 మంది పెద్దపేగు కేన్సర్ రోగుల కణితలను పరిశీలించి ఈ విషయాన్ని గుర్తించారు. వారి కణితుల్లో చాలాఎక్కువ స్థాయిలో బయోయాక్టివ్ లిపిడ్లు ఉన్నాయి. విత్తనాల నుంచి వచ్చే నూనెల వాడకం వల్ల.. బయోయాక్టివ్ లిపిడ్లు అధికంగా పెరుగుతున్నాయని పరిశోధకులు కనుగొన్నారు.

భార్య వేధింపులు భరించలేక గుజరాత్‌లో భర్త ఆత్మహత్య

రాజ్‌కోట్, జనవరి 5: భార్య వేధింపులు భరించలేక మరో భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. గతంలో బెంగళూరులో ఇలాంటి సంఘటన జరగగా, తాజాగా గుజరాత్‌లో చోటుచేసుకుంది. బోటాడ్ జిల్లా జమరాల గ్రామానికి చెందిన సురేష్ సతాదియా (39) గత నెల 30న తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రాణాలు తీసుకునే ముందు సెల్‌ఫోన్ ద్వారా అతడు తీసిన వీడియో వెలుగులోకి రావడంతో ఆయన తండ్రి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భార్య జయ తనను మానసికంగా హింసించిందని సురేశ్ ఆ వీడియోలో తెలిపాడు. "జీవితాంతం గుర్తుంచుకునేలా ఆమెకు గుణపాఠం చెప్పండి. ఆమె నాకు చెందదు. పిల్లలకు కూడా చెందదు. నన్ను మోసగించింది. ప్రాణాలు తీసుకునేలా చేసింది" అని సురేష్ చెప్పాడు. తనతో నిత్యం గొడవ పడి పుట్టింటికి వెళ్లిపోయేదని తెలిపాడు. సురేష్‌కు 17 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. 15, 10 ఏళ్ల వయసు ఉన్న ఇద్దరు కుమార్తెలు, 6, 4 ఏళ్ల వయసు ఉన్న ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, సురేశ్ భార్యను శనివారం అరెస్టు చేశామని డీఎస్పీ ఎస్.పి.అహిర్ తెలిపారు.



తిరుమల ఆలయం ముందు జస్టిస్ ప్రవీణ్‌కుమార్, జస్టిస్ సురేష్‌రెడ్డి

శ్రీవారి సేవలో జస్టిస్ సురేష్‌రెడ్డి

తిరుమల, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేష్‌రెడ్డి, మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో స్వామిని దర్శించుకున్న వారికి రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

శ్రీవారి అన్నప్రసాదం ట్రస్టుకు రూ.51 లక్షల విరాళం



టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి విరాళం చెక్ అందజేస్తున్న దాత

తిరుమల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి అన్నప్రసాదం ట్రస్టుకు ఆదివారం రూ.51 లక్షలు విరాళంగా అందాయి. గుంటూరుకు చెందిన కస్తూరి ఈ విరాళం చెక్‌ను తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేసి ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు వినియోగించాలని కోరారు.

వైకుంఠద్వార దర్శనం పేరిట రూ.2 లక్షల వసూలు

- ఇద్దరు దళారీలను అరెస్ట్ చేసిన తిరుమల పోలీసులు

తిరుమల, జనవరి 5(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తామని భక్తుల నుంచి రూ.2 లక్షలు వసూలు చేసిన ఇద్దరు దళారీలను తిరుమల టూటౌన్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. తిరుపతి జిల్లాకు వడమాలపేటకు చెందిన దినేష్, తిరుత్తణికి చెందిన దొరైబాబు భక్తులతో పరిచయాలు పెంచుకుని దర్శనాలు చేయిస్తామని నమ్మించి గత కొంతకాలంగా మోసం చేస్తున్నారు. ఇదే క్రమంలో హైదరాబాద్‌కు చెందిన ఓ భక్తుడికి, వారి కుటుంబానికి దర్శనం కల్పిస్తామని నమ్మించి రూ.2లక్షలు వసూలు చేశారు. బాధితులు తిరుమల టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తిరుమలలో రేపు వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

తిరుమల శ్రీవారి ఆలయంలో జనవరి 10 నుంచి 19వ తేదీ వరకు వైకుంఠ ఏకాదశి ద్వార దర్శనాలు జరుగనున్న క్రమంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది. ప్రత్యేక పూజలు, నైవేద్యం తర్వాత భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఈ కార్యక్రమం నేపథ్యంలో 7వ తేదీన టీటీడీ వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేసింది. ఈ క్రమంలో 6వ తేదీన ఎలాంటి సిఫారసు లేఖలు తీసుకోబోమని టీటీడీ స్పష్టం చేసింది.

ఐదేళ్ల చిన్నారిపై అత్యాచారం

గుడివాడ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గుడివాడలో ఐదేళ్ల బాలికపై ఓ వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆదివారం బాలిక తల్లిదండ్రులు బయటకు వెళ్లిన సమయంలో, గోనె సంచుల గోడౌన్‌లో ముఠా కార్మికుడిగా పనిచేస్తున్న యెండూరి జోజిబాబు చిన్నారిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు బాలిక జరిగిన విషయం చెప్పగా, వెంటనే టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. చిన్నారిని చికిత్స నిమిత్తం స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గుడివాడ ఇన్‌చార్జి డీఎస్పీ అబ్దుల్ సుభాన్ పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గనుల శాఖకు 'గండి'

- ఆదాయం మింగుతున్న కడప నేతలు
- మరో నేత రూ.35 కోట్ల ఎగవేత
- 20 వేల టన్నుల ఏ గ్రేడ్ బెరైటీస్‌కూ చెల్లింపులు చేయని వైనం
- ఎనిమిదేళ్లుగా అధికారుల చోద్యం
- కాగ్ ఆదేశించినా చర్యల్లేవు
- మొత్తం బకాయిలు రూ.600 కోట్లు
- ఒక్క కడప జిల్లా నేతలవే 280 కోట్లు
- దృష్టి సారించని కూటమి సర్కారు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వానికి వేలకోట్ల రూపాయల ఆదాయం తీసుకొచ్చే ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) కొందరు వైసీపీ నేతలకు పాడిఆవుగా మారింది. వైసీపీ అధినేత జగన్ అండతో ఎండీసీ నుంచి అందినకాడికి దండుకుంటున్నారు. ఇటు అప్పులు పెట్టడం, అటు బెరైటీస్‌ను తరలించుకుపోవడం.. ఇలా వారికి నచ్చినట్లుగా సంస్థను వాడుకుంటున్నారు. కడప జిల్లాకు చెందిన ఓ వైసీపీ నేత 2008 నుంచి ఎండీసీకి 50 కోట్లు అప్పు చెల్లించని విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. కడప జిల్లాకే చెందిన మరో వైసీపీ నేత ఎండీసీని అలాగే వాడుకొని పంగనామాలు పెట్టారు. నాటి గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డికి అత్యంత సన్నిహితుడైన ఈ నేత 35 కోట్ల రూపాయల మేర ఎండీసీకి అప్పు పెట్టారు. 2016 నుంచి నేటి వరకు రూపాయి కూడా చెల్లించలేదు. ఇది చాలదన్నట్లుగా 20 వేల టన్నుల ఏ గ్రేడ్ బెరైటీస్‌ను క్రెడిట్ పాలసీ కింద తీసుకెళ్లారు. దానికి సంబంధించి ఇప్పటి వరకు ఎండీసీకి చెల్లింపులు చేయలేదు. గత ఏడాది మార్చిలో కాగ్ ఈ అంశాన్ని పరిశీలించి ఆ నేతకు రెవెన్యూ రికవరీ(ఆర్ఆర్) నోటీసులు ఇవ్వాలని సిఫారసు చేసింది. అయితే గనుల శాఖ మంత్రి, ఓ అధికారికి సన్నిహితుడు కావడంతో నోటీసులు ఇచ్చేందుకు అధికారులు సాహసించలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చినా ఆ నేత హవానే సాగుతోంది. సదరు వైసీపీ నేతకు చెందిన బెరైటీస్ బెనిఫిసియేషన్ ప్లాంటుకు 2016-22 కాలంలో ఎండీసీ భారీగా ఏ గ్రేడ్ బెరైటీస్‌ను సరఫరా చేసింది. నిబంధనల ప్రకారం భారీగా అప్పు పెట్టిన కంపెనీకి బెరైటీస్‌ను సరఫరా చేయడానికి వీల్లేదు. ఎండీసీతో బెనిఫిసియేషన్ ఒప్పందం ఉన్నా ఈ నియమం వర్తిస్తుంది. 2016 వరకు సమయానుగుణంగా బకాయిలు తీర్చిన ఆ నేత కంపెనీ ఆ తర్వాత చేతులెత్తేసింది. రూ.35 కోట్ల మేర విలువైన బెరైటీస్‌ను ఎండీసీ నుంచి తీసుకుని, ఈ మొత్తం తిరిగి చెల్లించలేదు. ఒక ఏడాది బకాయి ఉంటేనే వడ్డీతో సహా అపరాధ రుసుము వసూలు చేస్తారు. అలాంటిది.. 2016 నుంచి 35 కోట్ల అప్పు, దానికి వడ్డీ, అపరాధ రుసుము కలిపితే చాలా మొత్తం అవుతుంది. అలాగే జగన్ ప్రభుత్వంలో ఎండీసీ నుంచి తరలించుకుపోయిన 25 వేల టన్నుల ఏ గ్రేడ్ బెరైటీస్‌కూ సదరు నేత కంపెనీ బిల్లులు చెల్లించాల్సి ఉంది. బకాయిల వసూళ్లకు నోటీసులు ఇవ్వకుండా తాత్సారం చేసినందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని గత ఏడాది మార్చిలో కాగ్ సిఫారసు చేసింది. అయితే జగన్ ప్రభుత్వ పెద్దల ఒత్తిళ్లతో ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఉంది. కొత్త ప్రాజెక్టుల నిర్వహణ కోసం 5 వేల కోట్ల అప్పులు తెచ్చేందుకు ఎండీసీ రంగం సిద్ధం చేస్తోంది. అయితే ఎండీసీకి రావాల్సిన మొండి బకాయిల వసూళ్లపై దృష్టి పెట్టకపోవడం చర్చనీయాంశంగా మారింది. వీటిపై దృష్టిసారిస్తే పాత పద్దుల కింద కనీసం 600 కోట్ల మేర వస్తాయని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇందులో ఒక్క కడప జిల్లాకు చెందిన వైసీపీ నేతలే ఏపీఎండీసీకి దాదాపు రూ.280 కోట్ల వరకూ బకాయిలు చెల్లించాల్సి ఉంది. బకాయిల వసూళ్లపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అధికార వర్గాలు కోరుతున్నాయి.

ఆలపాటికి టీచర్స్ గిల్డ్ మద్దతు

అమరావతి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతు ఇవ్వనున్నట్టు ఏపీ టీచర్స్ గిల్డ్ ప్రకటించింది. ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.సురేష్ కుమార్, షేక్ ఖయ్యూం బాషా ఆదివారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ నేతృత్వంలో ఆ సంఘం నేతలు ఇటీవల ఆలపాటిని కలిశారు. ఎయిడెడ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

ఆవేశంలో నోరుజారాను.. తప్పే!

- మాధవీలత గురించి అలా మాట్లాడాల్సింది కాదు
- కొందరు ఫ్లెక్సీగాళ్లు ఏమేమో మాట్లాడుతున్నారు: ప్రభాకర్ రెడ్డి



తాడిపత్రి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకురాలు, సినీ నటి మాధవీలత గురించి ఆవేశంలో అలా మాట్లాడానని, ఆమెను కించపరిచే ఉద్దేశం తనకు లేదని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి అన్నారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలోని జేసీ పార్కులో గత ఏడాది డిసెంబరు 31న నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలపై బీజేపీ నాయకురాలు సాధినేని యామినీశర్మ, సినీ నటి మాధవీ లత చేసిన కామెంట్లపై జేసీ ప్రభాకర్‌రెడ్డి తీవ్రంగా స్పందించిన విషయం తెలిసిందే. ఆయన అభ్యంతరకరమైన భాష వాడటంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో తాడిపత్రిలోని తన నివాసంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆ అంశంపై స్పందించారు. తన వయసు 72 ఏళ్లు అని, కొంత ఆవేశంలో మాట్లాడానే తప్ప ఆమెను కించపరచాలనే ఉద్దేశం తనకు లేదన్నారు. రాష్ట్రంలో టీడీపీ తరపున తన ఒక్క మున్సిపాలిటీనే గెలిపించిన ప్రజలకు ఎప్పుడూ రుణపడి ఉంటానని అన్నారు. కొంతమంది తనను పార్టీ మారమని సూచిస్తున్నారని, వారికి ఆ హక్కు లేదని అన్నారు. తన గురించి అలా మాట్లాడే నాయకులు ఫ్లెక్సీగాళ్లేనని అన్నారు. అభివృద్ధి అంటే వారికి తెలియదని, మొన్న జరిగిన ఎన్నికల వరకు కనీసం వారు ఎవరో కూడా ఎవరికీ తెలియదని అన్నారు. పదవి ఉన్నప్పుడే మాట్లాడుతారని, పదవి పోయిన తర్వాత వారిని పలకరించేవారు ఉండరని ఎద్దేవా చేశారు.

సంపద సృష్టికర్తలు ప్రధాని మోదీ, చంద్రబాబు

- కేంద్ర సహాయ మంత్రి సోమణ్ణ

పెనుకొండ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు సంపద సృష్టికర్తలని రైల్వేశాఖ సహాయ మంత్రి సోమణ్ణ పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో రూ.33.50 కోట్లతో నిర్మించిన రైల్వే ఫ్లైఓవర్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ అంటే అభివృద్ధికి మారుపేరన్నారు. చంద్రబాబు అంటే తనకు ఎంతో ఇష్టమని, ఆయన ప్రజాసంక్షేమం కోసం పాటు పడుతున్నారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తెలుగు రాష్ట్రాల్లో రైల్వేల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. ప్రస్తుతం ఫ్లైఓవర్ నిర్మాణంతో ఈ ప్రాంత ప్రజల చిరకాలవాంఛ నెరవేరిందన్నారు.

గేమ్ చేంజర్ వేడుకకు వెళ్లి వస్తుండగా ప్రమాదం

- ఇద్దరు యువకులు మృతి



మణికంఠ, చరణ్

రంగంపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో శనివారం జరిగిన గేమ్ చేంజర్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హాజరై తిరిగి వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. తూర్పుగోదావరి జిల్లా రంగంపేట పోలీసులు ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం కాకినాడ జిల్లా గైగోలుపాడుకు చెందిన ఆరవ మణికంఠ (23), తోకాడ చరణ్(22) బైక్‌పై శనివారం రాజమహేంద్రవరం రూరల్ మండలం వేమగిరిలో జరిగిన గేమ్ చేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు వచ్చారు. జనం ఎక్కువగా ఉండడంతో తిరిగి కాకినాడ బయలుదేరారు. రాత్రి 9.30 గంటలకు వడిశలేరులో ఎదురుగా వస్తున్న వ్యాన్ వీరి బైక్‌ను బలంగా ఢీకొట్టగా తీవ్రగాయాలపాలయ్యారు. దీంతో ఇద్దరినీ వారి స్నేహితులు 108 వాహనంలో పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మణికంఠ మృతిచెందాడని వైద్యులు తెలిపారు. కొనఊపిరితో ఉన్న చరణ్‌ను చికిత్స నిమిత్తం కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ రాత్రి 12.15 గంటలకు మృతిచెందాడు. మృతుల స్నేహితుడు శశిశ్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ టి.కృష్ణసాయి తెలిపారు.

భావోద్వేగాల్ని అనువదించటం ముఖ్యం

– దాసు కృష్ణమూర్తి



దాసుకృష్ణమూర్తి వాక్యానికి వృద్ధాప్యం లేదు. 98 ఏళ్ల వయసులోనూ ఆయన రాస్తూ, అనువాదాలు చేస్తున్నారంటే నమ్మలేం. ముఖ్యంగా తెలుగు కథ అనువాదానికి ఆయన ఎనలేని కృషి చేస్తున్నారు. ఇటీవల ఆయన కూతురు తామ్రపర్ణితో కలసి తెలుగు నుంచి ఇంగ్లీషులోకి అనువాదం చేసిన కథల పుస్తకాన్ని ప్రసిద్ధ పుస్తక ప్రచురణ సంస్థ అలేఫ్ బుక్ కంపెనీ 'ద గ్రేటెస్ట్ తెలుగు స్టోరీస్ ఎవర్ టోల్డ్' పేరుతో ప్రచురించింది. ఇందులో 21 మంది తెలుగు రచయితల కథలు ఉన్నాయి. అంతకుముందు 2010లో మరికొంతమంది తెలుగు కథకుల రచనలను '1947 సంతోషాబాద్ పాసెంజర్ అండ్ అదర్ స్టోరీస్' పేరుతో అనువాదం చేశారు (రూపా పబ్లికేషన్స్ ప్రచురణ). ప్రస్తుతం న్యూజెర్సీలో ఉంటున్న దాసు కృష్ణమూర్తి ఇంగ్లీషులో స్వతంత్ర రచనలూ చేశారు. కథలు రాసి 'ద సీసైడ్ బ్రైడ్ అండ్ అదర్ స్టోరీస్' (2019) పేరుతో ప్రచురించారు. అనువాదాలు అనేకం వస్తున్నప్పటికీ నాణ్యత ఉండటం లేదని ఇంగ్లీషులో వస్తున్న తెలుగు అనువాదాల్లో నాణ్యత పెంచడమే తన లక్ష్యమని చెబుతున్న దాసు కృష్ణమూర్తితో సంభాషణ.

ఇంటర్వ్యూ ■ **వేంపల్లె షరీఫ్**

ఈ వయసులోనూ అనువాద ప్రక్రియ మీద మీకెందుకు ఇంత పట్టుదల కలిగింది? మీ ప్రేరణ ఏమిటి?

నా కూతురు తామ్రపర్ణి అమెరికాలో ఉంటోంది. నేను, నా భార్య తరచూ ఇక్కడికి వచ్చేవాళ్లం. ఇక్కడున్న తెలుగువాళ్లకు తెలుగు సాహిత్యం, రచయితల గురించి పెద్దగా తెలియదని అర్థమైంది. అప్పుడే ఏదైనా చేయాలనుకున్నాం. నా భార్య చనిపోయాక పూర్తిగా ఒంటివాణ్ణి అయిపోయాను. అమెరికా లోనే కూతురు, అల్లుడి దగ్గర ఉండాల్సి వస్తోంది. ఇక నన్ను నేను ఎంగేజ్ చేసుకోవడానికి అనువాదాలు మొదలుపెట్టాను.


2006లో నేను, నా కుమార్తె తెలుగులో వస్తున్న కల్పనా సాహిత్యాన్ని ఇంగ్లీషులోకి అనువదించి ప్రచురించాలని గట్టిగా ప్రయత్నం మొదలుపెట్టాం. తెలుగులో ఉన్న అద్భుతమైన సాహిత్యం, రచయితల గురించి అమెరికాలో ఉన్న వారికి తెలియాలని 'లిటరరీ వాయిస్ ఆఫ్ ఇండియా' పేరుతో వెబ్‌సైట్‌ని ప్రారంభించాం. ఇందులో ముఖ్యంగా భారతదేశంలో ఉన్న విభిన్న సంస్కృతులకు, పెద్దగా వెలుగులోకి రాని జీవితాలకు ప్రాధాన్యత ఇచ్చి వారి సాహిత్యాన్నే ప్రచురించాం.

ఇక వయసు అంటారా– క్రియేటివిటీ అనేది మనసుకు సంబంధించింది. మనసుకు వయసు లేనట్టే సృజనకు కూడా లేదు. అనువాదాల మీద నాకున్న గాఢమైన ఇష్టమూ, నా కూతురూ అల్లుడి సహకారాలే నన్ను నడుపుతున్నాయి.

తెలుగు రచనలు ఇంగ్లీషు అనువాదానికి సులువుగా ఇమడవు అంటారు, ఎంత వరకు వాస్తవం?

కరెక్టు కాదు అనుకుంటాను. ఎందుకంటే కొన్నిసార్లు ఒకే భాషలో కూడా ఒకే సాంస్కృతిక పదాలు ఉండవు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాలే అందుకు కచ్చితమైన నిదర్శనాలు. అయితే భాషలు వేరైనా, సంస్కృతులు వేరైనా మనుషులకు అనుభవాలు ఎక్కడైనా ఇంచుమించు ఒకేలా ఉంటాయి. ఆ అనుభవాలే సాహిత్యంలో మనుషులను సహానుభూతి పొందేలా చేస్తాయి. అది గుర్తించినపుడు కథను, భావోద్వేగాన్ని ఒక భాష నుంచి మరో భాషలోకి తీసుకెళ్లడం సులువు అవుతుంది.

> **2006లో నేను, నా కుమార్తె తెలుగులో వస్తున్న కల్పనా సాహిత్యాన్ని ఇంగ్లీషులోకి అనువదించి ప్రచురించాలని గట్టిగా ప్రయత్నం మొదలుపెట్టాం. తెలుగులో ఉన్న అద్భుతమైన సాహిత్యం, రచయితల గురించి అమెరికాలో ఉన్నవారికి తెలియాలని 'లిటరరీ వాయిస్ ఆఫ్ ఇండియా' పేరుతో వెబ్‌సైట్‌ని ప్రారంభించాం.**



ఇన్నేళ్ల అనువాద కృషిలో మీరు గమనించిన అంశాలు?

భాషలు సంస్కృతులకు పుట్టిన పాపలు. ఇంగ్లీషులో 'mouse' (ఒక కంప్యూటర్ భాగం)ని తెలుగులోకి ఎలా అనువదించడం. అలాగే 'Foxtrot', ఇంకా 'Halloween' లాంటివన్నీ ఎలా అనువదించగలం. రెండు సాంస్కృతిక నేపథ్యాలు వేరుగా ఉన్నప్పుడు వాటి మధ్య ఆమోదయోగ్యమైన పదాన్ని నిర్మించడం సవాలుతో కూడుకున్న పనేకానీ అసాధ్యమైతే కాదు. ఇది నేను గమనించింది.

అనువాదంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారు?

ప్రధాన సమస్య ఏంటంటే మూలంలో ఉన్న భావాన్ని ఉన్నదున్నట్టు అనువాదం చేయడమా లేక కొంత మెరుగు పర్చడమా అన్నది. అయితే మెరుగుపరిచే ఉద్దేశ్యంతో ఎట్టి పరిస్థితిల్లోనూ మూల రచయిత అసలు ఉద్దేశ్యాన్ని చెడగొట్ట కూడదు కదా. అతని చూపుని, దృష్టి కోణాన్ని కూడా అనువాదంలో చెడకుండా చూసుకోవాలి. ఈ పరిమితులకు లోబడి వీలైనంతవరకు మూల భాషలోని అర్థానికి అనువాద భాషలో ఉన్న సరైన పదాలనే వాడటానికి ప్రయత్నిస్తాను.

అనువాదానికి ఎలాంటి రచనలు ఎంచుకుంటారు?

చాలావరకు బలమైన పాత్రలు, సంఘటనలు, సామాజిక అంశాలున్న కథలను ఎంచుకుంటాం. వేంపల్లె షరీఫ్ రాసిన 'పర్దా' (ది కర్టెన్) కథనే తీసుకుందాం. తన కొడుకు నిర్బంధ సామాజిక నిబంధనలను ధిక్కరించే ఒక వృద్ధ మహిళ కథ అది. అలాగే అద్దేపల్లి ప్రభు రాసిన 'అతడు మనిషి' (ఎన్ ఐడియల్ మేన్) కథలోనూ పైన చెప్పిన మూడు లక్షణాలు ఉన్నాయి.

మంచి అనువాదాలు పెరగాలంటే ఏం చేయాలి?

రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సాహిత్య అనువాదాలను ప్రోత్సహించాలి. ఉదాహరణకు తమిళనాడు ప్రభుత్వం అనువాదాలను విపరీతంగా ప్రోత్సహిస్తోంది. అనువాదం అంటే కేవలం మన సాహిత్యం ఇతర భాషల్లోకి వెళ్లడం కాదు, ఇతర భాషల సాహిత్యాన్ని మన భాషలోకి తెచ్చుకోవడం కూడా. అలాగే ప్రచురణ సంస్థలు సైతం జాతీయ స్థాయిలో అనువాదాల కోసం ఎంతో కృషి చేస్తున్నాయి. తాజాగా అలెఫ్ (Aleph) బుక్ కంపెనీ వారు తెస్తున్న 'ది గ్రేటెస్ట్ స్టోరీస్ ఎవర్ టోల్డ్ సిరీస్'కి విపరీతంగా గుర్తింపు ఉంది. భారతీయ భాషలన్నింటి లోంచి వారు కథలను అనువదించి ఇంగ్లీషులో పుస్తకాలు వేస్తున్నారు.

మీ అనువాదాలకు వచ్చిన పెద్ద ప్రశంస ఏది?

అలెఫ్ బుక్ కంపెనీ ప్రచురించిన మా పుస్తకం 'ది గ్రేటెస్ట్ తెలుగు స్టోరీస్ ఎవర్ టోల్డ్' దేశవ్యాప్తంగా బాగా అమ్ముడవుతోంది. అనువాదం బావుందని చాలామంది మెసేజులు పంపారు. మా మరో పుస్తకాన్ని ప్రచురించిన రూపా పబ్లికేషన్స్ మమ్మల్ని మంచి అనువాదకులుగా పేర్కొంది. తెలుగులో ప్రముఖ రచయిత్రి అబ్బూరి ఛాయాదేవి "దాసు కృష్ణమూర్తి నా కథను అనువదించడానికి అంగీకరించడం గౌరవంగా భావిస్తున్నాను" అన్నారు. కవన శర్మ "మీ ప్రయత్నాలు తెలుగు కథకు, రచయితలకు ఎంతో మేలు చేస్తాయి" అన్నారు. అనువాదం విలువ అందరికీ తెలియకపోవచ్చు కానీ ఇలాంటి రచయితలకైతే తప్పక తెలుసని నా నమ్మకం.

ప్రస్తుతం మీరు ఏమి రచనలు చేస్తున్నారు?

ఇప్పుడు నేను నా భార్యకు సంబంధించిన పుస్తకంపై పనిచేస్తున్నాను. మా సంకలనాలను చూడ్డానికి ఆమె లేదు. నేను బతికిన్నాళ్లు నాకు ఆమె ఒక శక్తి కింద పని చేసింది. అయితే ఆమె దూరమై 23 సంవత్సరాలు అవుతున్నా ఆమె స్ఫూర్తి నన్ను నడిపిస్తూనే ఉంది.

శేషం



సీతాకోక చిలక చివరి క్షణాల్లో
ఆడంబరంగా అంజలి ఘటిస్తుంటావు నువ్వు,
చీమనై దాని రెక్కల్ని తుంచుకుపోయి – వాటి
మాసే రంగుల్లో పొర్లాడి మాయమౌతాను నేను.

వేకువకు నేలరాలే రేరాణి పూల గంధాలతో
లిప్తకాలాల శాశ్వత బంధాలను శ్వాసిస్తూ నేను,
చిన్న చిన్న సంతోషాలతో చెలిమి చేతకాక
పంచేంద్రియాలూ పాడైన స్వనీతి ఆత్మని మోస్తూ
నువ్వు.

అబద్ధ ప్రమాణాల వెలుగులో నిన్ను నువ్వు
ఆనందరాగాలాపనకి సిద్ధం చేసుకొనే వేళలో,
దక్కిన మధుపాత్రను చుంబిస్తూ చేదుగుళికలన్నిట్నీ చప్పరించి ఉమ్మేస్తుంటాను నేను.

నిన్ను మెప్పించేలా అనురాగాలను అరువిచ్చే
నీలాంటి ఆత్మీయులే చుట్టూ దాపురించిన
దారిద్ర్యం నీది,
నాలాగా – తమకోసమే తాము కళలై మెరిసే
ఒకరో, ఇద్దరో సుదూర అదృశ్య ప్రియులున్న
ఐశ్వర్యం నాది.

ఇహపర పారవశ్యాల్ని నటించడంలో జీవించే
తేజో నక్షత్రానివి నువ్వు,
ఎదలో "ప్రవక్త" స్వరానికై ఎడారి దాహాలతో
శిలువను మోసే బడుగుని నేను.

కానుకలూ, శుభాకాంక్షలూ, కొవ్వొత్తి నవ్వులు,
ప్రేమ సందేశాలు, పాతదేహానికి కొత్త కొత్త
అలంకరణలూ, లోకమంతా నువ్వు..

నీకర్థం కాని,
నిన్నటి ప్రేయసికీ, రేపటి ఊర్వశికి అంతే చిక్కని
యోగమేదో సిద్ధింపచేసుకొంటూ
కొండల్లో ప్రవహించే సెలయేరునై.. నేను.

■ **సొలోమోన్ విజయ్ కుమార్**
✆ 83413 36828

బొమ్మలు: అక్బర్

యాగంటి వచనాల్లో అచ్చతెలుగు 'అధివాస్తవికత'!

తెలుగు పాట తొలినాళ్ళ రూపాలలో 'ఏల' ఒకటి. 'ఏల' అనే మాటకు 'శృంగారపు పాట' అని శబ్దరత్నాకరం అర్థం చెప్పింది. "ఏలలు పెట్టి పాడడం" అని పాల్కురికి సోమనాథుడు బసవ పురాణంలో చెప్పిన మాట ఒకటి ఉంది. "రెండేసి పాదములకో, మూడేసి పాదములకో ఒకసారి ఏదో ఒక దేవుని పేరు రాగ క్రమమున ఉచ్చరిస్తూ చదవడం యేలలుపెట్టి చదవడము" అని దానికి వివరణ. 'ఏలలు' పాడుకోవడానికి ఉద్దేశించినవే కాబట్టి, ఈ వివరణలోని 'చదువుట' అనే మాటను 'పాడుట' గానే అర్థం చేసుకోవచ్చు.

కానరాని యడవిలోన
వానలేని మడుగు నిండె,
వానలేని మడుగుమీదనూ, యాగంటిలింగా,
మానరాని అగ్ని పొడమెరా.

ఆకులేని యడవిలోన
తోకలేని మృగముపుట్టె
తోకలేని మృగము కడుపునా, యాగంటిలింగా,
ఈకలేని పక్షిపుట్టెరా.

'యాగంటి వారి ఏల'ల లోనివి ఈ రెండు ఏల పదాలు. పాడుకోవడానికే ఉద్దేశించినవని చెప్పకనే తెలిసిపోతుంది. మాటలతో వర్ణించి చెప్పలేని ఒక అధివాస్తవ మార్మికత ఈ ఏలలలో ఉన్నదని కూడా చెప్పకనే తెలిసిపోతుంది. 'యాగంటిలింగా' అన్నది మూడవ పాదాంతంలో తప్పనిసరిగా ఇవ్వబడిన విశ్రాంతి. ఈ ఏల పదాన్ని పాడుకోవడంలో మాటలకందని ఒక ఉపశమనం ఉంది. అలసిపోయిన మనసుకు ఇందులోని ఉపశమనం ఎంతో హాయినిచ్చేదిగా ఉంటుందని అర్థమవుతుంది. మార్మికత స్థాయిని మరికాస్త ముందుకు తీసుకు వెళితే అధివాస్తవిక మార్మికతగా రూపాంతరం చెందుతుందని పై ఏలలోని మాటలతో అర్థమౌతుంది. ఒక్కొక సమయంలో మనిషి పాడుకుని ఉపశమనాన్ని పొందడానికి, అర్థవంతమైన మాటల కంటే, మార్మికార్థం దాగి ఉన్నదిగా అనిపించే ఏవో కొన్ని మాటలతో ఒక పాట అవసరమౌతుందని, ఆలోచించే అవసరాన్ని మనిషి బుద్ధి ఆ సమయంలో కోరుకోదని, అందువలన లయబద్ధమైన అర్థంలేని మాటలు పాటగా ఉంటే చాలు మనిషి పాడుకుని తృప్తిపడతాడని ఊహించిన వ్యక్తి ఈ పాటల సృష్టికి కారకుడు. ఆ వ్యక్తి పేరు గార్లపాటి లక్ష్మణయ్య.



సాల్వడార్ డాలి సర్రియల్ చిత్రాలకు మించినవిగా భావించదగిన అధివాస్తవిక అక్షర చిత్రాలు తెలుగు సాహిత్యంలోని యాగంటి వచనాలలో ఉన్నాయి.

మాటలకు అలా వచ్చే సాధారణ మార్మికతకు మించిన మార్మికతను, అధివాస్తవికతలో ఆ మార్మికపు మాటలను ముంచి లయబద్ధం చేయడం వలన సాధించవచ్చునని, అలా సాధించడం వలన తయారైన రచన అధివాస్తవ మార్మికత (Surreal-mysticism) అనదగిన ఒక అధిలౌకిక స్థితితో ఈయన ఎప్పటివాడు అనే విషయంపై అభిప్రాయ బేధాలున్నప్పటికీ, కనీసం నాలుగైదు వందల సంవత్సరాలకు పూర్వుడని మాత్రం అందరూ ఒప్పుకున్నారు. జానపద సాహిత్యంలో ఇలా అధివాస్తవిక మార్మికత కలిగిన మాటల కూర్పుతో యాగంటి ఏలలను, వచనాలను సృష్టించిన ఈయన కర్నూలు జిల్లాలోని యాగంటి క్షేత్రంలో ఉన్న యాగంటి నంజేశ్వరుడికి అంకితంగా ఈ యాగంటి పదాలను చెప్పాడు. ఈయన ఇంటి పేరైన గార్లపాడు ఈయన నివాస స్థలం అనుకుంటే, అది కూడా కర్నూలు జిల్లాలోనే ఉంది. సంప్రదాయ సాహిత్యంలోని కావ్యాలలోలా, పైన చూపిన యాగంటి ఏలలోని భాష, అందులోని అంతఃసూత్రం మరేదో భాషలోని రచనకు అనువాదమో, అనుకరణో కావడానికి ఎంతమాత్రమూ అవకాశం లేదు. ఇది అచ్చమైన తెలుగు ఊహ అన్నది సందేహం లేని మాట.

మామూలు మాటల్లో వివరించి చెప్పలేనంత అందాన్ని, కొన్ని సందర్భాలలో, మాటలకు మార్మికత అలంకరించి చూపిస్తుంది. కూడినదై మరింత ఆశ్చర్యాన్ని, మైమరపును కలగజేస్తుందని తెలిపే ఉదాహరణలు యాగంటివారి కొన్ని వచనాల్లో కనపడతాయి. పాశ్చాత్య దేశాలలో అధివాస్తవిక ఆలోచనా ధోరణి ఒక సాహిత్యోద్యమ రూపంలో 20వ శతాబ్దం పూర్వార్థంలో ఫ్రాన్స్‌లో వెలుగు చూసింది. యాగంటి ఏలలకు, వచనాలకు 15వ శతాబ్దం ప్రాంతంలోనే రూపకల్పన జరిగింది కాబట్టి, సాహిత్యంలో అధివాస్తవిక ఆలోచనా ధోరణి తెలుగు నేలపై ఆనాటికే మొదలైందని గట్టిగానే చెప్పవచ్చు.

ఓయక్క ఒక కప్ప అయిదు పాముల మింగె,
తెల్సుకోరె
వినుడి జనులార, ఇనుము వంటక మాయె,
తెల్సుకోరె
అమ్ములపొదిలోన కొమ్ముటేనుగు బుట్టె,
తెల్సుకోరె
అ కొమ్ముటేనుగు మీద కొదమ బాలుడు బుట్టె,
తెల్సుకోరె
చింతమానూ నొక్క బంతిపూవూ బుట్టె,
తెల్సుకోరె
దాని చెంతనున్న కోడి పులిపిల్లాయెనూ,
తెల్సుకోరె
గుడి మీద ఒక నక్క కూతలు బెట్టెను,
తెల్సుకోరె
దాని మెడనున్న గంటలూ మేఘాలు మేసేను,
తెల్సుకోరె
పుడిసెడు నీళ్ళనూ భూమెల్ల తడిసెనూ,
తెల్సుకోరె
దాని వొడినున్న నిప్పులు వనితలు జల్లెనూ,
తెల్సుకోరె
యెరిగిన వారు యాడాది గడియిస్తె,
తెల్సుకోరె
దీనియిరవెల్ల క్రమముతో యాగంటి గురుడెరుగు,
తెల్సుకోరె!

పై గేయంలోని చివరి పాదంలో మాటలనుబట్టి ఇది యాగంటి గురుడైన గార్లపాటి లక్ష్మణయ్య రచనగా తెలుస్తుంది. గేయం మొదలైన దగ్గర నుండి ఒక్కొక్క పాదంలో ఒక్కొక అధివాస్తవిక చిత్రం కళ్ళముందు ప్రత్యక్షమౌతుంది. ముందు పాదంలోని అక్షర చిత్రం పూర్తిగా ఆకళింపుకు వచ్చి, అది కలిగించిన అబ్బురం అంతమవక ముందే, తరువాతి పాదంలో ఒక కొత్త చిత్రం కళ్ళముందు ప్రత్యక్షమై పాఠకుడి ఊహను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. అర్థం గురించి ఆలోచించే ప్రయత్నం చేసే లోపే, అర్థం గురించి ఆలోచించడం అంత అవసరమా? అనే ఆలోచన ఈ గేయంలోని పాదాలను చదువుతున్నప్పుడు ప్రతి పాదంలోనూ కలుగుతుంది. మొత్తం మీద ఈ గేయంలో ఉన్నది అనన్య సామాన్యమైన అధివాస్తవిక అందం!

సాల్వడార్ డాలి సర్రియల్ చిత్రాలకు మించినవిగా భావించదగిన అధివాస్తవిక అక్షర చిత్రాలు తెలుగు సాహిత్యంలోని యాగంటి వచనాలలో ఉన్నాయి. అధివాస్తవిక ధోరణిని అంతఃసూత్రంగా చేసుకుని కుంచెలతో బొమ్మలు వేసి డాలి ప్రపంచం వేపు వింతగా చూసి మెరిపిస్తే, మాటలతో అంతకు మించిన వింతలను అక్షర చిత్రాలుగా 15వ శతాబ్దం ప్రాంతాలకే తెలుగు జానపద సాహిత్యంలోని పై రచనలలో మలిచి చూపించడం జరిగింది. కానీ ఇవి కనీసం ఒక పుస్తకంగా కూడా ముద్రణ పొందక, చెన్నై లోని ప్రభుత్వ ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారంలో వ్రాతప్రతులుగా మూలన పడి ఉన్నాయి!

■ **భట్టు వెంకటరావు**

చదువు ముచ్చట

పద్మజ సూరపరాజు



ఆఖరుగా ఏ పుస్తకాన్ని చదివి బాగా ఇష్టపడ్డారు?

ఆఖరుగా చదివింది ఆంటన్ చెహోవ్ కథలు, పెద్ద కథలు, నవలికలు. వాటిల్లో ఎక్కువ ఇష్టపడింది చెహోవ్ నవలిక 'మై లైఫ్'. చెహోవ్ రచనలు విడి విడి వ్యక్తుల స్వభావాల కంటే 'మనిషి తత్వా'న్ని మాట్లాడుతాయి, మానవ మూల తత్వాన్ని. చెహోవ్ దృష్టిలో ఒక మనిషికి మరో మనిషి అర్థం చేసుకోలేని అగాథం. చెహోవ్‌కు మానవ దయనీయత అంటే అమితమైన జాలి, దాచుకోలేని చిరాకు, రెండూను. ఆయన సృష్టిలో మనిషి ఎవరికీ ఏమాత్రం పట్టనివాడు. Fate (God) is indifferent to man.

మొదటిసారి ఏ పుస్తకాన్ని ఇష్టంగా చదవటం గుర్తుంది?


ఎనిమిది తొమ్మిదేళ్ళప్పుడు మొట్టమొదట చదివింది ఆర్. కె. నారాయణ్ 'స్వామి అండ్ ఫ్రెండ్స్'. తర్వాత ఆయనవే మరికొన్నిటితోపాటు, చార్లెస్ & మేరీ లాంబ్ పుస్తకం 'టేల్స్ ఫ్రమ్ షేక్స్పియర్'. ఇంట్లో ఉండే భారతి పత్రికలు కూడా. అందులోంచి బాగా నవ్వొచ్చి గుర్తున్నది తిలక్ కవితలో ఒక లైన్, 'మిత్రమా రుబ్బుడు పొత్రమా!' ఆయనదే 'పోస్ట్‌మాన్' కవిత కూడా. చిన్నప్పుడు చదివినవాటిల్లో బాగా నచ్చినవి– చార్లెస్ డికెన్స్ 'డేవిడ్ కాపర్ ఫీల్డ్', ఎమిలి బ్రాంటీ 'వుదరింగ్ హైట్స్'.

సాహిత్యంలో మీకు ఆల్టర్ ఈగోలా అనిపించిన పాత్ర ఏది?

అలా ఒక్క పాత్రా అనిపించ లేదు, నిజంగా! చెపితే నవ్వుతారేమో కానీ, ఇదొక అవాంఛనీయమైన అవలక్షణం కూడా కావచ్చు కానీ, ప్రతి ప్రొటాగనిస్ట్‌కీ నన్ను తల్లిలా ఊహించుకుంటాను. ఇది చాలా బలమైన లక్షణం నాలో. కాఫ్కా 'మెటమార్ఫసిస్' కథలో అక్కడి బలహీన మనస్కురాలైన అమ్మను తీసేసి నేను వెళ్ళిపోయి అక్కడ ఉండాలన్నంత తీవ్రంగా! ఇలా నేను ఆలోచిస్తానని ఇప్పుడు మీ ఈ ఫీచర్‌లో ఈ ప్రశ్నకు జవాబు వెతుక్కుంటుంటేనే నాకూ తెలిసింది.

"ప్రతి ప్రొటాగనిస్ట్‌కీ నన్ను తల్లిలా ఊహించుకుంటాను"

ఏ గతకాలం రచయితనైనా కలిసి మాట్లాడగలిగితే ఎవరితో, ఏం మాట్లాడతారు?



దాస్తోయెవ్‌స్కీని ఒక ప్రశ్న అడుగుతాను: నీ రచనల్లోని అంత విషాదం, దాన్ని మోస్తూ ఇంత అద్భుత విశద సృష్టి ఎలా చేశావు? లేక దాన్ని మోయలేక దింపుకుందామని రాసినవా నీ రచనలు?

ఒకప్పటికీ ఇప్పటికీ మీరు చదివే పద్ధతి ఎలా మారింది?

గత రెండేళ్లుగానే చదివే పద్ధతి మారింది. ఇప్పుడు ఒక రచయితను మొదలు పెడితే వాళ్ళ లభ్య రచనలన్నీ చదువుతున్నాను. అంతకు ముందు వరకూ కూడా ఏది కంట్లో పడితే అది ఒక క్రమ పద్ధతి లేకుండా చదివేదాన్ని. ఎక్కువ చదవటమూ జరగలేదు. బోర్హెస్ కథలు, జేమ్స్ జాయ్స్ కథలు, తమిళ రచయిత్రి శివశంకరి కథల ఇంగ్లిష్ అనువాదం... ఇలా ఏది దొరికితే అది.

బాగా నచ్చిన నాన్ ఫిక్షన్ పుస్తకం?

ఆలివర్ సాక్స్ 'ద రివర్ ఆఫ్ కాన్షస్‌నెస్'. జంతు శాస్త్రం, నాడీ శాస్త్రాలతోపాటు ఆయన అధ్యయనం చేయకుండా వదిలిపెట్టిన శాఖ లేదు. ఈ శాఖలకు ఒకదానితో మరొకదానికి కార్యకారణ సంబంధాలు ఉన్నాయని శాస్త్రీయంగా పరిశోధనచేసి, వీటన్నింటిలో ఒక ఏక సూత్రత దర్శించడం ఆయన జీవితాంతమూ చేసిన అధ్యయన లక్షణం, ఫలితం కూడా.

మిమ్మల్ని ఇరిటేట్ చేసిన పాత్రలు?

జేన్ ఆస్టిన్ 'సెన్స్ అండ్ సెన్సిబిలిటీ' నవలలో అన్నా వదినల పాత్రలు నచ్చలేదు. డబ్బు కోసం భార్య మాట విని చెల్లెళ్ళను నిరాధారంగా వదిలేసిన అన్నను, అతన్ని చాకచక్యంగా అందుకు ఒప్పించిన శకుని తెలివితేటల వదినను చూస్తే జుగుప్స కలిగింది. కాఫ్కా 'మెటమార్ఫసిస్' కథలో గ్రెగర్ చెల్లెలు గ్రెటె పాత్ర కూడా చాలా ఇరిటేట్ చేసింది. పొద్దున్న లేవగానే పురుగుగా మారిపోయిన అన్న దుస్థితి పట్ల మొదట్లో జాలి సానుభూతి కలదానిలా ఉండి, కాలం గడిచేకొద్దీ అతను తన భవిష్యత్తుకు అవరోధం అవుతాడనుకోవడం మటుకే కాదు నాకు ఆమె నచ్చకపోవడానికి కారణం; ఆమె అన్నకు సహాయం చేసే విధంలో తన తండ్రికి లేని దయ, తల్లికి లేని ధైర్యం తనకు మాత్రమే ఉన్నాయనీ, వాటి వల్ల అన్నకు తను మాత్రమే ఉపయోగపడగలుగుతున్నాను అనీ ఒక కనపడని సంతోషం ఆమెలో ఉన్నది. అది నాకు నచ్చలేదు. అన్న స్థితి పట్ల బాధకంటే ఇటువంటి పరిస్థితిని నిర్వహించగల నైపుణ్యం నాకు ఉన్నది అన్నట్టు ఆమె కనిపించడం నాకు నచ్చలేదు.

మీకు తరచుగా గుర్తొచ్చే కవితా పంక్తి?

చార్లెస్ బాదిలేర్ 'ద స్వాన్' కవితకు సూరపరాజు రాధాకృష్ణమూర్తి చేసిన తెలుగు అనువాదం లోని ఈ పంక్తులు:

"ఒక నగరం, మనిషి మనసు కంటే
అయ్యో! త్వరగా వేషం మారుస్తుంది. ....
సర్వం నాకిపుడు రూపకాలు,
బండరాయి కన్నా బరువైన ఇష్ట స్మృతి చిహ్నాలు."

(పద్మజ సూరపరాజు అనువాదకురాలు, విమర్శకురాలు)

తానా నవలల పోటీ

జులై 3, 4, 5 తేదీలలో డిట్రాయిట్‌లో జరుగనున్న తానా మహాసభల సందర్భంగా ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) రెండు లక్షల బహుమతితో నిర్వహిస్తున్న నవలల పోటీలో పాల్గొనవలసిందిగా తెలుగు రచయితలను కోరుతున్నాం. నవలలు తెలుగు జీవితాన్ని ప్రతిబింబించాలి, పేజీల పరిమితి లేదు. వీలైనంతవరకు డిటిపి చేసి పంపాలి. నవలలపై రచయిత పేరు, చిరునామా ఉండకూడదు. కవరింగ్ లెటర్‌పై మాత్రమే ఉండాలి. మీ రచనలను ఏప్రిల్ 15లోగా ఈమెయిల్ tana.novel.2025@gmail.comకు, లేదా పోస్టులో చిరునామా: అక్షర క్రియేటర్స్, ఎజి-2, 'ఎ' బ్లాక్, మాతృశ్రీ అపార్ట్‌మెంట్స్, హైదర్‌గూడ, హైదరాబాద్-500029కు పంపాలి. మరిన్ని నిబంధనల వివరాలకు ఫోన్: 98493 10560.

నిరంజన్ శృంగవరపు

అలిశెట్టి పురస్కారం

తెలంగాణ రచయితల వేదిక కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అలిశెట్టి ప్రభాకర్ రాష్ట్రస్థాయి సాహిత్య పురస్కారం 2024ను కవి బెల్లి యాదయ్యకు జనవరి 12 ఉదయం కరీంనగర్ ఫిలిం భవన్‌లో ప్రదానం చేయనున్నారు. అల్లం నారాయణ, నారదాసు లక్ష్మణరావు, నలమెల భాస్కర్, కొండి మల్లారెడ్డి, బూర్ల వెంకటేశ్వర్లు, అన్నవరం దేవేందర్, గాజోజు నాగభూషణం, నగునూరి శేఖర్ తదితరులు హాజరవుతారు.

సి.వి. కుమార్




ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల ప్రాంగణంలో రంగవల్లులు తీర్చిదిద్దుతున్న మహిళలు


కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రత్యేకాధికారి వెలగా జోషి,ఆంధ్రజ్యోతి సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్‌కుమార్ చేతుల మీదుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకుంటున్న కె.మల్లేశ్వరి, టి.జ్యోతి, టి.నాగలక్ష్మి

రంగవల్లుల సంబరం

- నగరంలో ఉత్సాహంగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు
- జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన మహిళలు
- రంగోలి వేడుకలో ఆకట్టుకున్న రంగులు

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్వియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఆధ్వర్యంలో నగరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి పాల్గొన్నారు. తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా సంక్రాంతి రంగవల్లులను అందంగా తీర్చిదిద్దారు. మొదటి బహుమతిని న్యూరాజరాజేశ్వరిపేటకు చెందిన కె.మల్లేశ్వరి, రెండో బహుమతిని నందిగామకు చెందిన టి.జ్యోతి, మూడో బహుమతిని యనమలకుదురుకు చెందిన టి.నాగలక్ష్మి సొంతం చేసుకున్నారు.

సంక్రాంతికి 52 ప్రత్యేక రైళ్లు

రైల్వే స్టేషన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి దక్షిణ మధ్య రైల్వే వివిధ స్టేషన్ల మధ్య 22 రూట్లలో 52 అదనపు రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ ఆదివారం ప్రకటించారు. ఈ రైళ్లు ఈ నెల 6వ తేదీ నుంచి పట్టాలు ఎక్కనున్నాయి. చర్లపల్లి - తిరుపతి, వికారాబాద్ - కాకినాడ టౌన్, కాచిగూడ - తిరుపతి, చర్లపల్లి - నరసాపూర్, కాకినాడ టౌన్ - సికింద్రాబాద్, కాకినాడ టౌన్ - చర్లపల్లి, నాందేడ్ - కాకినాడ టౌన్, చర్లపల్లి - శ్రీకాకుళం టౌన్, కాచిగూడ - శ్రీకాకుళం రోడ్డుల మధ్య అప్ అండ్ డౌన్‌గా 22 రైళ్లు తిరగనున్నాయి. వీటి కాల పట్టికను వెబ్ సైట్ ద్వారా లేదా రైల్వే ఎంక్వయిరీ ద్వారా తెలుసుకోవచ్చు.

మెట్లపల్లిలో మరో చిరుతపులి కలకలం

గన్నవరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గన్నవరంలోని మెట్లపల్లి శివారులో మరో చిరుతపులి కలకలం రేపింది. డిసెంబరు 18వ తేదీ రాత్రి మెట్లపల్లి తోటలో అడవి పందుల కోసం పెట్టిన ఉచ్చులో పడి ఓ చిరుతపులి మృతిచెందిన సంఘటన తెలిసిందే. అది మరువక ముందే ఆదివారం తెల్లవారుజామున అదే ప్రాంతంలో రోడ్డు దాటుతున్న పులిని చూసినట్లు ఆర్టీసీ కండక్టర్ రవికుమార్ తెలిపారు. దీంతో గ్రామంలోని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఆయన గన్నవరం డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. తెల్లవారుజామున ఆ రూట్‌లో డ్యూటీకి వెళ్తుండగా, పులి కనిపించిందని కండక్టర్.. సగ్గూరు గ్రామస్తులకు చెప్పాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. మెట్లపల్లి, వీరపనేనిగూడెం గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా, గార్డు కుమారి పులి కనిపించిన ప్రాంతంలో పరిశీలన జరిపారు.

కాషాయ సంద్రం



హాజరైన మూడు లక్షల మంది హిందువులు

- ఆలయాలకు స్వయం ప్రతిపత్తిపై పూరించిన శంఖం
- దేవాలయాల భూముల అన్యాక్రాంతంపై పీఠాధిపతుల ఆగ్రహం

విజయవాడ, గన్నవరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆలయాలకు స్వయం ప్రతిపత్తే లక్ష్యంగా కేసరపల్లిలో ఆదివారం నిర్వహించిన 'హైందవ శంఖారావం'సభ దద్దరిల్లింది. దేశవ్యాప్తంగా తరలివచ్చిన హైందవ సమాజంతో కేసరపల్లి కాషాయ సంద్రంగా మారింది. సభకు మూడు లక్షల మంది తరలివచ్చారు. హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలన్న ఏకైక డిమాండ్‌తో ఈ హైందవ శంఖారావాన్ని నిర్వహించారు. హైందవ శంఖారావంలో ఉత్తర భారతదేశం, దక్షిణ భారతదేశానికి చెందిన వంద మందికి పైగా పీఠాధిపతులు, స్వామిజీలు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి విశ్వహిందూపరిషత్ కేంద్రీయ సంఘటన అధ్యక్షుడు గోకరాజు గంగరాజు అధ్యక్షత వహించారు. విశ్వహిందూ పరిషత్ సంఘటన ఉత్తరాంధ్ర కార్యదర్శి తనికెళ్ల సత్యరవికుమార్ కార్యక్రమాన్ని నడిపించారు. శంఖనాదాల హోరుతో హైందవ శంఖారావం ప్రారంభమైంది. అశేష హైందవ సమాజం సమక్షంలో కార్యక్రమం ఐదు గంటల పాటు సాగింది. హైందవ శంఖారావంలో వీహెచ్‌పీ అగ్రనాయకులు, మఠాధిపతులు, స్వామిజీలు అందరూ హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని డిమాండ్ చేశారు. ఇతర మతాలకు వారి దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి ఉన్నపుడు హిందూ దేవాలయాలను ప్రభుత్వం పరిధిలోకి తీసుకురావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బోర్డులు ఏర్పాటు చేసి రాజకీయ నాయకులకు పునరావాసం కల్పించారని ఆరోపించారు.


కేసరపల్లి హైందవ శంఖారావం సభకు హాజరైన అశేష జనవాహిని, (ఇన్‌సెట్‌లో) పీఠాధిపతులు, నిర్వాహకులు

పైసా వసూల్!

వీఎంసీ యూసీడీ విభాగంలో అవినీతి బాగోతం

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థకు అనుబంధంగా వీఎంసీలో నడుస్తున్న అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ విభాగంలో అవినీతి పెరిగిపోయింది. నగదు ముట్టజెబితే చాలు వివిధ హోదాల్లో నియమించేస్తున్నారు. తాజాగా జరిగిన క్లస్టర్ రిసోర్స్ పర్సన్ నియామకం వీఎంసీలో దుమారాన్ని రేపుతోంది. ఈ వ్యవహారంలో రూ.అరకోటి చేతులు మారినట్టు ఆరోపణలు బలంగా వి నిపిస్తున్నాయి. గతంలో అవినీతి ఆరోపణలతో తొలగించిన వారిని ఇప్పుడు తిరిగి కొలువుల్లో నియమి ంచుకోవడం వివాదాస్పదమవుతోంది. మొత్తం వ్యవహారంలో టెక్నికల్ ఎక్స్‌పర్ట్‌గా పనిచేస్తున్న ఉద్యోగి చక్రం తిప్పినట్టు తెలుస్తోంది.

- తిరస్కరించిన ఫైలును తెరమీదకు తెచ్చిన అధికారులు
- 18 మందికి సీఎల్ఆర్పీలుగా నియామకం
- రూ.50 లక్షలు చేతులు మారినట్టు ఆరోపణలు
- చక్రం తిప్పిన టెక్నికల్ ఎక్స్‌పర్ట్ 'పాము'

(ఆంధ్రజ్యోతి, చిట్టినగర్): వీఎంసీలో యూసీడీ విభాగానికి ఒక ప్రాజెక్ట్ అధికారి ఉంటారు. ఆయన కింద కమ్యూనిటీ కోఆర్డినేటర్లు 36 మంది ఉన్నారు. ఈ సీవోల కిందన రిసోర్స్‌పర్సన్లు ఉంటారు. ఈ ఆర్పీలు నగరంలోని వివిధ డివిజన్లో ఉన్న మహిళలతో పొదుపు సంఘాలను ఏర్పాటు చేయించి, వారితో బ్యాంకుల్లో పొదుపులు చేయించాలి. ఆ సంఘాలకు అవసరమైన రుణాలను ఈ ఆర్పీలు ఏర్పాటు చేయిస్తుంటారు. పొదుపు సంఘాలు చేసుకున్న దరఖాస్తు ఆర్పీలు పూర్తి చేసి సీవోలకు అందజేస్తారు. వారు ఆ దరఖాస్తులను పరిశీలించి ప్రాజెక్టు అధికారికి పంపుతారు. పీవో ఆమోదముద్ర వేసిన తర్వాత దరఖాస్తులు బ్యాంకుకు వెళతాయి. అప్పుడు బ్యాంకులు ఆ సంఘాలకు రుణాలను మంజూరు చేస్తాయి.

సీఎల్ఆర్పీలపై అవినీతి ఆరోపణలు

ఈ ప్రక్రియలో తాజాగా సీవోలను పక్కకు పెట్టి కొత్తగా క్లస్టర్ రిసోర్స్‌పర్సన్‌లను రంగంలోకి దింపారు. కమ్యూనిటీ ఆఫీసర్లు చేయాల్సిన పనిని మొత్తం కొత్తగా వచ్చిన సీఎల్ఆర్పీలకు అప్పగించడానికి రంగం సిద్ధం చేశారు. వాస్తవానికి 2018లో సీఎల్ఆర్పీలను నియమించారు. రుణాలు మంజూరులో క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లు చేతివాటం చూపించడంతో వివాదాలు రేగాయి. రుణాలు మంజూరు చేసేటప్పుడు దరఖాస్తుల సమయంలో ఒక్కో గ్రూపు నుంచి వేలాది రూపాయలు వసూలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై వివాదాలు రావడంతో సీఎల్ఆర్పీలను రద్దు చేశారు. ఇప్పుడు తాజాగా 26 మంది సీఎల్ఆర్పీలను తీసుకోవాలని యూసీడీ విభాగం అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి మెప్మా, కమిషనర్ అనుమతి తీసుకున్నారు. వారిలో ఇప్పటికే 18 మందిని నియమించారు. వారికి రెండు రోజుల క్రితం ఉత్తర్వులు ఇచ్చారు. వారు గతంలో 11 నెలలు పాటు సీఎల్ఆర్పీలుగా పనిచేశారు. ఆరోపణలు రావడంతో వారిని తొలగించారు. తాజాగా తిరిగి వాళ్లనే నియమించుకోవడం వీఎంసీలో వివాదాన్ని రేపుతుంది. తొలుత ఈ ప్రతిపాదనను కమిషనర్



తిరస్కరించినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ప్రాజెక్టులోని ఒక కీలక అధికారి ఈ ఫైల్ పై కమిషనర్‌తో సంతకం చేయించారని ఆరోపణలు ఉన్నాయి. ఈ విభాగంలో ప్రాజెక్ట్ అధికారితోపాటు అక్కడ పనిచేసే టెక్నికల్ ఎక్స్‌పర్ట్ 'పాము' మెప్మా అధికారులను మేనేజ్ చేసి చక్రం తిప్పినట్టు తెలిసింది. ఒక్కొక్కరి నుంచి లక్షలాది రూపాయలను వసూలు చేసి రూ. 50లక్షలకు డీల్ కుదుర్చుకున్నట్టు ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

టెక్నికల్ ఎక్స్‌పర్ట్ 'పాము' టెక్నినిక్..

2018లో 26 మంది పీఎల్ఆర్పీల 11 నెలల కాలపరిమితి ముగిసిన తర్వాత వీరిపై తీవ్రస్థాయిలో ఆరోపణలుండటంతో అప్పటి కమిషనర్ క్ర మబద్ధీకరించకుండా ఆపేశారు. అలాగే వీరి విషయంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ పై ఆరోపణలు రావడంతో అతన్ని సొంత సంస్థకు పంపించారు. అంతా దుమారం లేపిన ఈ ఫైల్‌ను మరల అధికారులు కాసులకు కక్కుర్తిపడి తె రపైకి తెచ్చినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. పథకం ప్రకారం ఆ 26 మందిని ముఖ్యమంత్రి ప్రజా ఫిర్యాదుల కార్యక్రమానికి పంపించి తాము టీడీపీ వాళ్లమని వైసీపీ ప్రభుత్వం తీసేసిందని పథకం ప్రకారం ఫైల్ కద లించారు. అక్కడ నుంచి వీఎంసీ పీవో, టెక్నికల్ ఎక్స్‌పర్ట్ నగరపాలక సం స్థలో సీవోలపై అధిక భారం పడుతుందని, ఎక్కువ గ్రూపులు ఉన్నాయని ఇబ్బందులు పడుతున్నారని ఫైల్‌ను పెట్టి మెప్మా, కమిషనర్ అనుమతి తీ సుకున్నట్లు తెలిసింది. అయితే ఈ 26 మందిలో ఎక్కువ శాతం వైసీపీ వా ళ్లేనని పాలకుల మెప్పుకోసం, ఫైల్‌ను కదలించడం కోసం ఈ నాటకం తెర పైకి తెచ్చినట్లు బహిరంగానే మాట్లాడుకుంటున్నారు.

భవిష్యత్‌లో సీఎల్ఆర్పీల బాధ్యతను ఎవరు తీసుకుంటారు..!

సీఎల్ఆర్పీలు బాధ్యతలు తీసుకొని గ్రూపులకు లోన్స్ తదితర కా ర్యక్రమాలు చేపడుతుంటారు. గ్రూపుల్లో లోన్స్ ఇప్పించే విషయంలో ఏమైన అవకతవకలు జరిగితే ఎవరు బాధ్యత తీసుకుంటారనేది ప్ర శ్నార్థకంగా మారింది. అధికారులు పని ఒత్తిడి తగ్గించేందుకని సీవోల బాధ్యతలను సీఎల్ఆర్పీలకు పంచితే భవిష్యత్‌లో గ్రూపుల్లో తప్పిదా లకు ఎవరు బాధ్యత వహిస్తారు. లోన్‌ల విషయంలో అవకతవకలు జరిగితే ఎవరిపై చర్యలు తీసుకుంటారు. సీవోలకైతే ఉద్యోగం భయం ఉంటుంది. ఎక్కడ తప్పు చేస్తే ఉద్యోగం పోతుందోనని, కానీ సీఎల్ఆ ర్పీలకు గౌరవ వేతనం మాత్రమే ఇస్తారు. లక్షల్లో అవినీతి జరిగితే, ఫేక్‌లోన్‌లు, డమ్మీ లోన్‌లు ఇప్పించి అధికారులను కొన్నాళ్లు మేనేజ్ చేసి ఆగిపోతే పరిస్థితి ఏమిటి ఇలా అనేక అనుమానాలు ఉన్నాయి. ఐనా అధికారులకు ఐదేళ్ల కాలంలో అవసరం రాని సీఎల్ఆర్పీలు ఒ క్కసారిగా గుర్తుకు రావడం ఫైల్ ఆమోదం తీసుకోవడం అంతా పథ కం ప్రకారం జరిగిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. 18 మంది గ తంలో పని చేశారనే ఒక్క కారణంతో ఎటువంటి బ్యాగ్ రౌండ్ వెరిఫి కేషన్ లేకుండా హడాహుడి నియమాకాలు జరిగినట్లు తెలిసింది.

మెప్మా ఆదేశాల మేరకు తీసుకున్నాం

26 మంది సీఎల్ఆర్పీలకు సంబంధించిన ఫైల్ నేను వచ్చిన తర్వాత పెట్టలేదు. గతంలోనే పెట్టారు. మెప్మా ఆదేశాలు, వీఎంసీ క మిషనర్ సూచనల మేరకు 26 మందిలో ముందుకు వచ్చిన 18 మందిని సీఎల్ఆర్పీలుగా నియమించాం. ఆయా సీఎల్ఆర్పీలు ము ఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేష్‌లను కలసి విన్నవించుకోగా వా రి సూచనల మేరకు మెప్మా అధికారులు వారిని విధుల్లో తీసుకోవా లని ఫైల్ పంపించారు. దాని ప్రకారమే వారిని విధుల్లోకి తీసుకోవ డం జరిగింది. సీఎల్ఆర్పీలు, సీవోలు, ఇతర ఆర్పీలు ఎవరైన సరే అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయి. ఈ నియామకా లకు సంబంధించి ఎటువంటి అవకతవకలు జరగలేదు. పద్ధతి ప్రకా రం కమిషనర్ ఆదేశాల మేరకే జరిగాయి.

-వెంకట నారాయణ, యూసీడీ ప్రాజెక్ట్ అధికారి



విజ్ఞాన వెలుగు

పుస్తక మహోత్సవానికి పోటెత్తిన ప్రజలు

నేడు పుస్తక ప్రియుల పాదయాత్ర

ప్రారంభించనున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

విజయవాడ కల్చరల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి) : ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్న విజయవాడ పుస్తక మహోత్సవానికి సందర్శకులు ఆదివారం పోటెత్తారు. స్టాల్స్‌లో ప్రదర్శించిన విజ్ఞాన సంపదను ఆసక్తిగా తిలకించారు. మనస్సుకు నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రద్దీ కొనసాగింది. ఏటా నిర్వహించే పుస్తక ప్రియుల పాదయాత్ర సోమవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి జరగనుంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ హాజరవుతారు. ఆయన జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించనున్నారు. పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్, సీనియర్ సంపాదకుడు కె.శ్రీనివాస్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పాల్గొంటారు. ఈ యాత్ర మొగల్రాజపురంలోని సిద్ధార్థ కళాశాల నుంచి ప్రారంభం కానుంది.

కమ్మవారిపై ఐదేళ్లు యుద్ధం!

- కమ్మ సేవా సమితి సంక్రాంతి సంబరాల్లో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీవీ వ్యాఖ్యలు

6లో

ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి : మంత్రి

- ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్‌గా డూండీ ప్రమాణస్వీకారం



మోగిన శంఖం


కదంతొక్కిన హైందవ సోదరులు.. కాషాయమయమైన కేసరపల్లి

భారతీయ సంస్కృతీ, సంప్రదాయం, సనాతన ధర్మం, ఆధ్యాత్మికతను భవిష్యత్ తరాలకు చాటిచెప్పే ఉద్దేశంతో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లాలోని గన్నవరం మండలం కేసరపల్లిలో ఆదివారం హైందవ శంఖారావం భారీ బహిరంగ సభ నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి హిందువులు పెద్ద ఎత్తున తరలి రావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. దేశవ్యాప్తంగా కీర్తి గడించిన ఎందరో హైందవ నేతలు తమ ప్రసంగాల్లో హిందూధర్మం గొప్పతనాన్ని చాటిచెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి హైందవ సోదరులు ర్యాలీలుగా తరలివచ్చారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి



సభా ప్రాంగణానికి వెళ్తున్న హిందువులు





సభలో ప్రసంగిస్తున్న గణపతి సచ్చిదానంద స్వామి, గోవింద్ దేవ్ గిరిజి మహరాజ్, స్వామి కమలానంద, స్వామి వరదానంద



హిందూ సోదరులతో కిక్కిరిసిన కేసరపల్లిలోని సభా ప్రాంగణం

ఆలయాల విముక్తి కోసం పోరాడదాం

● వీహెచ్‌పీ కేంద్రీయ సంఘటన అధ్యక్షుడు గోకరాజు గంగరాజు



విజయవాడ, గన్నవరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల రక్షణకు ఎన్నో బలిదానాలు, పోరాటాలు జరిగాయని, హిందూ దేవాలయాలు స్వయం ప్రతిపత్తిని కోల్పోవటంతో రాజకీయ నేతల పునరావాసకేంద్రంగా మారిపోయిందని వీహెచ్‌పీ కేంద్రీయ సంఘటన అధ్యక్షుడు గోకరాజు గంగరాజు అన్నారు. కృష్ణాజిల్లా కేసరపల్లిలో జరిగిన హైందవ శంఖారావంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా హిందూదేవాలయాలపై దాడులు పెరిగిపోయాయని, హిందూ ఆలయాల స్వయం ప్రతిపత్తి కోసం జాతీయ ఉద్యమం ప్రారంభమైందన్నారు. దేవాలయాల ఆస్తుల పరిరక్షణకు నడుం బిగించాలని హిందూ దేవాలయాల విముక్తి కోసం పోరాటం జరుగుతుందన్నారు.

స్వేచ్ఛను కోల్పోవడం బాధాకరం

● తనికెళ్ల సత్యరవి కుమార్

వీహెచ్‌పీ కేంద్రీయ సంఘటన కార్యదర్శి

స్వాతంత్ర్య వచ్చి 77 ఏళ్లవుతున్నా ఇప్పటికీ దేవాలయాల స్వయంప్రతిపత్తి కోసం ఉద్యమించటం బాధగా ఉంది. హిందూ దేవాలయాలు స్వేచ్ఛను కోల్పోవటం ఇంకా బాధగా ఉంది. ఈరోజు ఆలయాలు అగ్నిపరీక్ష ఎదుర్కొంటున్నాయి.

ప్రతి మహిళ కదలి రావాలి

● కొండవీటి మాతా జ్యోతిర్మయి



ప్రతి ఇంట్లో స్త్రీ వేదాధ్యయనం చేయాల్సిన సమయం ఆసన్నమైంది. వేదాలను అధ్యయనం చేయటం ద్వారా దేవాలయాల పరిరక్షణ కోసం పాటుపడేతత్వం పెరుగుతుంది. లవ్‌జిహాద్ అరికట్టాలన్నా కూడా మహిళలు చైతన్యవంతం కావాల్సిన అవసరం ఉంది.

ఎస్సీలంతా హిందువులే

● గరికముక్కు సుబ్బయ్య, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం

ఎస్సీ, ఎస్టీలంతా హిందువులే. 1950లో బాబాసాహెబ్ అంబేడ్కర్ ఎస్సీ, ఎస్టీల్లో అంటరానితనం అనుభవిస్తున్న హిందువులకు రిజర్వేషన్లు కల్పించారు. ఈ రోజున అన్యమతస్తులు కూడా రిజర్వేషన్లు పొందుతున్నారు. మతం మారిన వారంతా వెనక్కు రండి. ఎస్సీల్లో ఉన్న వాళ్లు హిందువులుగానే ఉండాలి. లేదంటే బయటికు వెళ్లిపోండి.

స్వయంప్రతిపత్తికి నడుం బిగిద్దాం

● దక్షిణాంధ్ర వీహెచ్‌పీ అధ్యక్షుడు సాయిరామ్

హిందూ సమాజం మూడు ప్రమాదాలను ఎదుర్కొంటోంది. అన్యమతస్థుల నుంచి దాడులు, పోలీసు కేసులు, ప్రభుత్వాల ఆంక్షలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇంకెన్నాళ్లీ అవమానాలు. ఇప్పటికైనా స్వయం ప్రతిపత్తికి నడుం బిగిద్దాం.

దాడుల్ని ఖండించాలి

● శివానంద సరస్వతి



హైందవ సమాజంపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలి. కాషాయమంటే అగ్నివర్ణమని దాంతో పెట్టుకున్న వారిని దహించి వేస్తుంది. ఇన్నాళ్లూ సహనంగా ఉన్నాం. ఇకపై హైందవ సమాజం, కాషాయధారులపై దాడులు జరిగితే సహించేది లేదు. వీహెచ్‌పీ ఏపీ ట్రెజరర్ వీ దుర్గాప్రసాదరాజు, ఎస్ఎల్‌వీ గ్రూప్ చైర్మన్ పెన్మెత్స శ్రీనివాసరాజు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి, ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, యార్లగడ్డ వెంకట్రావు, కామినేని శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు, విజయా డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు, చిగురుపాటి కుమారస్వామి, పొట్లూరి బసవరావు, ఆళ్ల గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన శంఖారావం బహిరంగ సభ

విజయవాడ, గన్నవరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హైందవ శంఖారావం బహిరంగ సభ ఆదివారం జరిగింది. అతిథులంతా మధ్యాహ్నం 12.30 గంటలకు వేదికపైకి వచ్చారు. 12.43కు శంఖారావాన్ని పూరించారు. 12.45కు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర కోశాధికారి గోవింద దేవ్ గిరి మహరాజ్ జ్యోతి ప్రజ్వలన చేశారు. 12.49కి ఓం, ఓం, ఓం, శ్రీరామ, జయరామ అంటూ జపించారు. అనంతరం కన్వీనర్ తనికెళ్ల సత్యరవికుమార్ వేదికపై ఉన్నవారిని పరిచయం చేశారు. విశ్వహిందూ పరిషత్ అఖిల భారత ఉపాధ్యక్షుడు గోకరాజు గంగరాజు సభకు అధ్యక్షత వహించారు. వేదికపై 85 మంది స్వామీజీలు ఆశీనులయ్యారు. వీహెచ్‌పీ జాతీయ అధ్యక్షుడు అలోక్ కుమార్ అఖిల భారత సంఘటన ప్రధన కార్యదర్శి మిలింద్ పరాండే, అయోధ్య ట్రస్టు కోశాధికారి గోవింద దేవ్ గిరి మహరాజ్‌లు హిందీలో మాట్లాడగా తెలుగులో అనువాదించారు. హైందవ శంఖారావం డిక్లరేషన్‌ను ప్రకటించారు. చినజీయర్ స్వామి సంకల్ప ప్రతిజ్ఞ చేయించారు. సాయంత్రం 5.10 గంటలకు వేదికపైనున్న స్వామీజీల ఆశీర్వాదంతో హైందవ శంఖారావం ముగిసింది.

3,500 బస్సులు, 10 రైళ్లు, 2వేల కార్లు



హైందవ శంఖారావం బహిరంగ సభలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

కాగా ఈ బహిరంగ సభకు అనేక వాహనాలలో హైందవ కుటుంబీకులు వచ్చారు. 3,500 బస్సులు, 10 ట్రైన్‌లు, 2వేల కార్లు, 15వేలు బైకుల్లో బహిరంగ సభకు హైందవ కుటుంబీకులు తరలివచ్చారు. ఐజీ అశోక్ కుమార్, ఎస్పీ గంగాధరరావు పర్యవేక్షణలో 4వేల మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఉప్పులూరు రైల్వే స్టేషన్ నుంచి సభాస్థలికి వచ్చే మార్గంలో పోలీసులు ఉండి వరుస క్రమంలో పంపించారు. ట్రాఫిక్‌ను సజావుగా పంపించారు. కేసరపల్లి నుంచి రామవరప్పాడు వరకూ ట్రాఫిక్‌ను నిలుపుదల చేయటంతో స్థానికులు కాస్త ఇబ్బందులు పడ్డారు. పోలీసులు ముందుగా సూచించిన విధంగానే వాహనాలను మళ్లించారు. పోలీసులు ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించారు. విధులలో ఉన్నవారిని ఐజీ, ఎస్పీలు ప్రతిక్షణం అప్రమత్తం చేస్తూనే ఉన్నారు. పార్కింగ్ ప్రదేశాల నుంచి వాహనాలు వెళ్లేటప్పుడు ముందస్తు జాగ్రత్తలు పాటించటంతో ట్రాఫిక్ అంతగా కనిపించలేదు. కదిరి నుంచి 100 మంది స్కూటర్లపై మూడు రోజులుగా ప్రచారం చేస్తూ వచ్చారు. మొత్తం 5చోట్ల భోజన ఏర్పాట్లు చేశారు. సావరగూడెం, ఉప్పులూరు రోడ్డు, ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల, ఐటీ పార్క్ ప్రక్కన, హెచ్‌సీఎల్ దగ్గర పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశారు. నాలుగువైపుల నుంచి వచ్చే వాహనాలు అటువైపే పార్కింగ్ చేసుకునేలా తగిన చర్యలు చేపట్టడంతో ట్రాఫిక్ ఇబ్బందులు కలగలేదు.



సభలో ప్రసంగిస్తున్న ఏపీజేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు

మున్సిపల్ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్

రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా నాగేశ్వరరావు

గవర్నర్‌పేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంలో ప్రధాన భూమిక పోషిస్తున్న మున్సిపల్ శాఖ కార్పొరేషన్ ఉద్యోగులకు కనీసం సర్వీస్ రూల్స్ లేకపోవడం బాధాకరమని ఏపీజేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక శ్రీపాద హోటల్‌లో ఆదివారం జరిగిన మున్సిపల్ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరిగింది. మాజీ అధ్యక్షుడు దోప్పలపూడి ఈశ్వర్ అధ్యక్షత వహించారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా తిమ్మసర్తి నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగులకు సొంతంగా సర్వీస్ రూల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ఏపీసీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.శంకర్, గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.అరలయ్య, ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం అధ్యక్షురాలు పారే లక్ష్మీ, సెక్రటరీ జనరల్ పొన్నూరు విజయలక్ష్మీ పాల్గొన్నారు.

కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఆప్కాస్‌లోకి తీసుకోవాలి

వన్‌టౌన్: కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, నూతన ప్రభుత్వంలో తమ కష్టాలు తీరుతాయన్న నమ్మకంతో ఉద్యోగులు ఉన్నారని, ఏజెన్సీల దోపిడీకి గురవుతున్న వేలాది మంది ఉద్యోగులను ఆప్కాస్‌లోకి తీసుకోవాలని ఏపీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. ఏపీ జేఏసీ అనుబంధ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల సమావేశం ఆదివారం లెనిన్ సెంటర్‌లోని రెవెన్యూ భవన్‌లో జరిగింది.

విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ ప్రతిపాదనలు వెనక్కి తీసుకోవాలి

గుంటూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ పంపిణీ సంస్థల ప్రైవేటీకరణ ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని విద్యుత్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శేషారెడ్డి డిమాండ్ చేశారు. విద్యుత్‌శాఖ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం గుంటూరులో జరిగింది. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో శేషారెడ్డి మాట్లాడుతూ, విద్యుత్‌శాఖకు తగినంత సిబ్బంది, సామగ్రి అందజేయకుండా సిటీజన్ చార్టర్ పేరుతో సిబ్బందిపై జరిమానాలు, జీతంలో కోతలు విధించటం అన్యాయమని ఆందోళన వ్యక్తం చేశారు. జూనియర్ ఇంజనీర్లకు, అసిస్టెంట్ ఇంజనీర్లకు ఇంక్రిమెంట్ల వ్యత్యాసాన్ని 23 నుంచి 9కు తగ్గించాలని కోరారు.

రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక

రాష్ట్రంలోని మూడు విద్యుత్ పంపిణీ సంస్థలైన ఏపీ ఎస్పీడీసీఎల్, సీపీడీసీఎల్, ఈపీడీసీఎల్‌తో పాటు ఏపీ ట్రాన్స్‌కో, జెన్‌కోల్లోని డిప్లొమా ఇంజనీర్స్‌తో రాష్ట్ర నూతన కార్యవర్గం (2025-26) ఎన్నిక ఆదివారం జరిగింది. ఏపీ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర చీఫ్ అడ్వైజర్‌గా ఎ.సుబ్బారావు, ప్రెసిడెంట్‌గా కేవీ శేషారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.హుస్సేన్‌ఖాన్, సెక్రటరీ జనరల్‌గా పి.సన్యాసిరావు, వైస్ ప్రెసిడెంట్‌గా ఆర్.సాంబశివరావు, వైస్ ప్రెసిడెంట్ (జెన్కో) పి.నరేంద్ర, డిప్యూటీ జనరల్ సెక్రటరీ జనరళ్లుగా వి.శ్రీనివాసరావు, టీకే మిశ్రాతో పాటు జాయింట్ సెక్రటరీలు, ఆర్గనైజింగ్ సెక్రటరీలతో కలిపి నూతన కార్యవర్గం ఎన్నికైంది.

పోరంకిలో రేపు, ఎల్లుండి రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్

అమరావతి:: రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌ను మంగళ, బుధవారాల్లో నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీచేసింది. పోరంకిలో ఈ ఫెయిర్ జరుగుతుందని, ఎంపిక చేసిన 72 పాఠశాలల నుంచి టీచర్లు, సైన్స్ ఆఫీసర్లు, ఎంపికైన విద్యార్థులు ఇందులో పాల్గొంటారన్నారు.



'కమ్మవారి సేవా సమితి' క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు

కమ్మవారిపై ఐదేళ్లు యుద్ధం!

● కమ్మ సేవా సమితి సంక్రాంతి సంబరాల్లో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీవీ వ్యాఖ్యలు
● కమ్మ సేవా సంఘం సేవలు శ్లాఘనీయం
● ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, సుజనా ప్రశంసలు

కంకిపాడు (గంగూరు), జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లు కమ్మ సమాజంపై కొందరు బహిరంగ యుద్ధం చేశారని, ఇప్పుడు వారేమయ్యారో అందరికీ తెలుసునని పరోక్షంగా వైసీపీ పాలనపై రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు (ఏబీవీ) విమర్శలు గుప్పించారు. అందుకే ఈ సంక్రాంతిని విమోచన, విముక్తి దినంగా భావించాలని సూచించారు. కృష్ణా జిల్లా కమ్మవారంటే ఆషామాషీ కాదని, తెలుగు సమాజానికి సేవలందించిన ఘనత వారికే దక్కుతుందన్నారు. కృష్ణాజిల్లా పెనమలూరు మండలంలోని గంగూరులోని ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో ఆదివారం 'కమ్మవారి సేవా సమితి' ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, బోడే ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏబీవీ మాట్లాడుతూ కృష్ణా జిల్లా అనేక మంది ప్రముఖులకు పుట్టినిల్లని, ఎన్టీఆర్, రామోజీరావు, ఘంటసాల, విశ్వనాథ సత్యనారాయణ, కాకాని వెంకటరత్నం సహా అనేక మంది ఇక్కడే జన్మించారన్నారు. కృష్ణా జిల్లా వారిని విమర్శించే వ్యక్తులు.. వారికి దమ్ముంటే 'ఆంధ్రబ్యాంక్'ను పునరుద్ధరించాలని వ్యాఖ్యానించారు. విమర్శకులకు దమ్ముంటే మరో రామోజీరావును చూపించాలన్నారు. గత ఐదేళ్లు జరిగిన సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూసుకోవాలి. కమ్మ సామాజిక వర్గంలో అనేక మంది పేదరికంలో కొట్టు మిట్టాడుతున్నారన్నారు. అలాంటి వారికి సహకారం అందించాల్సిన అవసరముందన్నారు. వారిని ప్రోత్సహిస్తే మన పిల్లల్లో మరో సత్యానాదెళ్ల, ఎన్టీఆర్‌లను చూసుకోవచ్చునన్నారు.

సేవలు భేష్: బోడె, సుజనా

కమ్మ సేవాసమితి నిర్వహించిన సంబరాలతో సంక్రాంతి పండుగ ముందే వచ్చిందని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. బోడె ప్రసాద్ మాట్లాడుతూ కమ్మ సేవా సంఘం ద్వారా అనేక మంది పేద కుటుంబాలను ఆదుకుంటున్నారని, వారి సేవలు బాగున్నాయని కొనియాడారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ సూర్యచంద్రులు ఉన్నంత వరకు కులాలు, మతాలు ఉంటాయన్నారు. ఇతర కులాలను ఎవరూ కించపరచొద్దని సూచించారు. అన్ని కులాలు, మతాలు కలిసి పనిచేస్తేనే రాజ్యాధికారం వస్తుందని తెలిపారు. జలవనరుల శాఖ సలహాదారు కన్నయ్యానాయుడు, ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీ చైర్మన్ ధనేకుల రవీంద్రనాథ్ ఠాగూర్ పాల్గొన్నారు. అనంతరం 'కమ్మవారి సేవాసమితి' క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ అభివృద్ధికి సహకరిస్తా

● బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

వన్‌టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించి, వ్యాపారస్థులకు అండగా ఉంటానని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. ఆదివారం వన్‌టౌన్‌లోని గాంధీజీ మునిసిపల్ హైస్కూల్ ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా డూండీ రాకేష్ పదవీబాధ్యతలు చేపట్టి, ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సవిత మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఆర్యవైశ్యులకు అండగా ఉంటుందన్నారు. టీడీపీ ప్రభుత్వంలో వ్యాపారస్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ వ్యాపారాలను సక్రమంగా నిర్వహించుకుంటున్నారన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ ఆర్యవైశ్యులు ఎన్నికల్లో టీడీపీకి ఏకపక్షంగా మద్దతు ప్రకటించారన్నారు. డూండీ రాకేష్ ప్రమాణ స్వీకారం జాతిపిత గాంధీజీ మునిసిపల్ హైస్కూల్‌లో జరగటం ఆనందంగా ఉందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఆర్యవైశ్యులకు ఏ సమస్య వచ్చినా డూండీ రాకేష్ ముందుంటాడన్నారు. డూండీ రాకేష్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు, చిరు వ్యాపారస్థులు, మధ్యతరగతి వర్గాల వారిని మరింత బలోపేతం చేయటానికి కృషి చేస్తానన్నారు. కార్పొరేషన్ ద్వారా వ్యాపారస్థులకు లోన్లు ఇచ్చి వారిని ఆదుకుంటానన్నారు. వైసీపీ పాలనలో వ్యాపారస్తులు అనేక విధాలుగా నష్టపోయారని, కొందరు వ్యాపారస్తులు దుకాణాలను మూసివేశారని గుర్తు చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం ఆర్యవైశ్యులకు అన్ని విధాలుగా ఆదుకుంటుందని చెప్పారు. ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, కామినేని శ్రీనివాస్, జి.వి.ఆంజనేయులు, కాలువ శ్రీనివాస్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కె.నాగుల్ మీరా, తదితరులు ప్రసంగించారు. అనంతరం డూండీ రాకేష్‌ను ఘనంగా సన్మానించి అభినందించారు. కర్నూల్ అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య నేతలు వి.వి.కె.నరసింహారావు, కొణిజేటి రమేష్, టీడీపీ నేతలు, కార్యకర్తలు, ఆర్యవైశ్య అనుబంధ సంఘాల నేతలు, శ్రేణులు పాల్గొన్నారు.



డూండీ రాకేష్‌ను అభినందిస్తున్న మంత్రి సవిత, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే సౌమ్య

మాతృభాషను విస్మరించడం ఆత్మహత్య సదృశ్యం

● మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు

విజయవాడ కల్చరల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): తెలుగును విస్మరించటం ఆత్మహత్య సదృశ్యమని, తెలుగుభాషను నిర్లక్ష్యం చేయడం, జాతికి ప్రమాదకరమని, మన జాతి ఉనికికి అది ప్రశ్నార్థకం చేస్తుందని మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవంలో ఆదివారం రామోజీరావు సాహిత్యవేదికపై పుస్తక మహోత్సవ సంఘం సంస్థాపక కోశాధికారి పిడికిడి రామకోటేశ్వరరావుగారి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుస్తక ప్రచురణను ఒక సామాజిక బాధ్యతగా భావించి, చివరి వరకూ అలాగే నిర్వహించిన ఆదర్శవంతుడు పిడికిటి రామకోటేశ్వరరావు అన్నారు. అనంతరం పిడికిటి రామకోటేశ్వర రావు జ్ఞాపకాలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. తెలుగువారు జాతీయస్థాయిలో రాణించడానికి హిందీ భాషతో బలమైన అనుబంధం ఉండటమే కారణమన్నారు. ఆ అనుబంధం బలపడటానికి కృషిచేసిన వారిలో కోటేశ్వరరావుగారు ఒకరన్నారు. పుస్తకం మొదటి ప్రతిని తానా పత్రిక సంపాదకుడు కేసీ చేకూరి స్వీకరించారు. సభకు అధ్యక్షత వహించిన బెల్లపు బాబ్జి మాట్లాడుతూ పుస్తకమహోత్సవానికి కోటేశ్వరరావుకు ఉన్న అనుబంధాన్ని వివరించారు. పుస్తక మహోత్సవ సంఘ పూర్వాధ్యక్షుడు డి.అశోక్ కుమార్ మాట్లాడుతూ ఎంత కలిగి ఉన్నా నిరాడంబరంగా, మృదుభాషిగా, వినయశీలిగా ఉండటం అనే లక్షణాలు కోటేశ్వరరావును చూసి నేర్చుకున్నానన్నారు. కోటేశ్వరరావు అల్లుడు తానా పూర్వాధ్యక్షుడు కోమటి జయరాం, తానాకు మరో పూర్వాధ్యక్షుడు సతీష్ వేమన మాట్లాడుతూ పుస్తక మహోత్సవానికి తానా మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. రామచంద్ర మిషన్ ప్రతినిధి ఝాన్సీ రామకోటేశ్వరరావు ఆధ్యాత్మిక పార్శ్వాన్ని ప్రేక్షకులకు పరిచయం చేశారు.

స్ట్రీట్ బ్లడ్ - డెడ్ ఆర్ అలైవ్ పుస్తకావిష్కరణ

విజయవాడ కల్చరల్ జనవరి 5 (ఆంధ్రజ్యోతి): వీధి కుటుంబాల జీవితాల్ని అద్దం పట్టే ప్రయత్నమే స్ట్రీట్ బ్లడ్: డెడ్ ఆర్ అలైవ్ నవల అని రచయిత రుద్రమల్ల ఆనంద్ మోహన్ అన్నారు. పుస్తక మహోత్సవంలో చెరుకూరి రామోజీరావు సాహిత్య వేదికపై నవల పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. పిల్లలు నేరస్థులుగా మారడంలో పేదరికం, కుటుంబ వ్యవస్థ వైఫల్యం, గ్యాంగ్ కల్చర్ కీలక పాత్ర వహిస్తాయని ఇందులో చూపించానని ప్రోడిగల్ సన్స్ కథతో, తప్పిపోయిన వారు ఎలా మార్పు సాధించగలరన్న దానిపై దృష్టి పెట్టానని ఆయన చెప్పారు. గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ మార్పు వ్యక్తిగతంగానే కాకుండా సమాజ స్థాయిలో అవసరమని ఈ రచన చెబుతుందన్నారు. అధికార భాష కమిషన్ రాష్ట్ర సభ్యుడు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలుగు భాషపై ఆసక్తిని, పఠన అభిలాషను విద్యార్థుల్లోనూ, ప్రజల్లోనూ విస్తృతంగా వ్యాపింపజేయడం, పాఠకుల సంఖ్యను పెంచడం కోసం పుస్తక మహోత్సవం దోహదపడుతుందన్నారు. ముష్టి శ్రీనివాస్, పుస్తక మహోత్సవ అధ్యక్షుడు లక్ష్మయ్య, కార్యదర్శి మనోహర్ నాయుడు పాల్గొన్నారు.

తెలుగు చిత్రంపై భానుమతి ముద్ర

తెలుగు సినిమా గౌరవాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన గొప్ప వ్యక్తి భానుమతి రామకృష్ణ అని, నటన, సంగీతం, రచన, దర్శకత్వం, నాటకాలు ఇలా ఆమె ప్రతిభ అపారమైందని ప్రముఖ సినీ పాత్రికేయుడు రెంటాల జయదేవ్ అన్నారు. ఆదివారం రామోజీరావు సాహిత్యవేదికపై సినీ నటి భానుమతి రామకృష్ణ శతజయంతి సభ నిర్వహించారు. పురుషాధిక్యత నుంచి సంరక్షించుకోవడం కోసం తాను సృష్టించుకున్న తోడుగే అహంకారమన్నారు. సినిమా ప్రపంచంలో ఆత్మవిశ్వాసంతో, ప్రతిభతో సంపూర్ణ వ్యక్తిత్వంతో నిలిచిన గొప్ప నటి అన్నారు. సినిమాల్లోనూ బయట ఆమె నమ్మిన విలువలకు కట్టుబడి జీవించిందన్నారు. ఏ పాత్రను ధరించినా, ఆ పాత్రలో తన వ్యక్తిత్వాన్ని ఆరోపించి, ప్రేక్షకుల మెప్పు పొందిన ఘనత ఆమెదన్నారు. నటిగా, గాయకురాలిగా, రచయిత్రిగా, నిర్మాతగా, దర్శకురాలిగా, సంగీత దర్శకురాలిగా దాదాపు ఎనిమిది పాత్రలను సమర్థవంతంగా పోషించిన ప్రతిభను ఆమె సొంతమన్నారు. సభకు అధ్యక్షత వహించిన పాటిబండ్ల దక్షిణామూర్తి మాట్లాడుతూ బహుముఖ ప్రతిభతో సినిమారంగంలో ధృవతారగా వెలిగిన నటి భానుమతి రామకృష్ణ అని అన్నారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	118,126, 137
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 525

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి



సూచనలిస్తున్న సీఐ ప్రకాష్

భారతీనగర్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల ప్రాణరక్షణ నిమిత్తం ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని మాచవరం సీఐ సి.హెచ్.ప్రకాష్ వాహనదారులకు సూచించారు. హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వుల మేరు ప్రతి ఒక్కరు హెల్మెట్ పెట్టుకోవాలన్నారు. రమేష్ ఆసుపత్రి సిగ్నల్ వద్ద సీఐ ప్రకాష్ సిబ్బందితో ఆదివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. 106 మందితో పాత చాలనాలను కట్టించామని, దానిని విలువ 56వేలు రూపాలయలు, అంతే కాకుండా హెల్మిట్ లేకుండా ప్రయాణించే 40 మంది వాహదారులకు జరిమానా విధించామని ఆయన తెలిపారు.

భక్తులకు అసౌకర్యం కలిగిస్తే చర్యలు

వన్‌టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): దుర్గ గుడికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలిగిస్తే శాఖాపర మైన చర్యలు తీసుకుంటామని వెస్ట్ ఏసీపీ దుర్గారావు కనకదుర్గానగర్‌లోని వ్యాపారులకు సూచించారు. దుర్గ గుడికి భక్తులు పెద్ద ఎత్తున రావటంతో ఆదివారం కనకదుర్గనగర్ భక్తులతో కిటకిటలాడింది. వ్యాపారు లపై వస్తువులను ఫుట్‌పాత్‌లపై పెట్టుకుని భక్తుల రాకపోకలకు అసౌకర్యం కలిగిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఏసీపీ దుర్గారావు, సీఐ గురు ప్రకాష్, టెంపుల్ సూపరింటెండెంట్ నగేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ దేవస్థానం ఉన్న తాధికారులు కేటాయించిన షాపులు మేరకే వినియో గించుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హెల్త్ వర్సిటీ క్రికెట్ జట్టు ఎంపిక రేపు

విజయవాడ స్పోర్ట్స్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఇబ్రహీంపట్నంలోని నిమ్రా కాలేజీ మైదానంలో మంగళవారం ఉదయం 9 గంటలకు డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ క్రికెట్ పురుషుల జట్టు ఎంపిక చేపడుతున్నట్లు స్పోర్ట్సుబోర్డు సెక్రటరీ ఇత్రిమూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఎంపికైన క్రీడాకారులను ఈ నెల 18 నుంచి 21 వరకు చెన్నైలోని మద్రాస్ యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ క్రికెట్ టోర్నీకి పంపుతామన్నారు.

పాఠశాల ఉన్నత విద్యస్థాయిలో లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

● పీవీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవంలో సబ్ కలెక్టర్ చైతన్య ● ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యాలు


మొగల్రాజపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలో 8,9,10 తరగతుల్లోనే భవిష్యత్తులో ఏమి అవ్వాలనుకున్నారో ఆ లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని విజయవాడ డివిజన్ సబ్ కలెక్టర్ కావూరి చైతన్య విద్యార్థులకు పిలుపు ఇచ్చారు. మొగల్రాజపురం వీరమాచనేని పద్దయ్య పబ్లిక్‌స్కూల్ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సబ్ కలెక్టర్ చైతన్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సామాజిక బాధ్యత కలిగి ఉండాలన్నారు. తల్లిదండ్రులను గౌరవించాలని సూచించారు. ఉన్నత స్థానానికి చేరుకోవడానికి క్రమశిక్షణ, పట్టుదల, పరిశీలన, సమయపాలన ప్రధాన కారణాలన్నారు. కార్యక్రమానికి సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు మలినేని రాజయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, తదితరులు తమ సందేశాన్ని ఇచ్చారు. చదువుతో పాటు వివిధ విభాగాల్లో ప్రతిభ చూపించిన విద్యార్థులకు అవార్డులను ప్రదానం చేసి, వారి తల్లిదండ్రులను సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులను సత్కరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన ది ఒపెన్ ట్రెజర్, నిజాయితీగా జీవించాలని సందేశం ఇచ్చిన గోల్డెన్ సీడ్స్, గిరిజన జానపద నృత్యాలు, డాన్స్ డైనాసిటీ, కోలాటం, ఫిట్నెస్ ఏరోబిక్స్, క్రిస్మస్ కారల్స్, అనే అంగ్ల నాటిక అహశాతులను అలరించాయి. సిద్ధార్థ అకాడమీ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అకాడమీ చరిత్రను, అకాడమీ సాధించిన విజయాలను సిద్ధార్థ యశో వివరించారు. పాఠశాల సంచాలకులు మేడా సీతారామయ్య, జాయింట్ సెక్రటరీ ఎస్.లలితప్రసాద్, పాఠశాల కన్వీనర్ సూరెడ్డి విష్ణు, వైస్ ప్రిన్సిపాల్ రోజ్‌మేరీ, సభ్యులు చనుమోలు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందిస్తున్న సబ్‌కలెక్టర్ కావూరి చైతన్య



గిరిజన నృత్యం ప్రదర్శిస్తున్న విద్యార్థులు





సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

● సీఎంఆర్ యూనివర్సిటీ మార్కెటింగ్ అడ్మిషన్ డైరెక్టర్ రాజు కుమార్ చక్రవర్తి

లబ్బీపేట, జనవరి5(ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని బెంగళూరు సీఎంఆర్ యూనివర్సిటీ మార్కెటింగ్ అడ్మిషన్ డైరెక్టర్ రాజు కుమార్ చక్రవర్తి అన్నారు. బందర్ రోడ్డులోని ఒక హోటల్‌లో ఆదివారం యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల శ్రమను మాత్రమే గుర్తించడం కాదని, వారు చేసే గొప్ప పనికి కూడా గౌరవ ప్రశంసలు ఇవ్వాలన్నారు. సమాజంలో మార్పులు తీసుకురావడంలో ఉపాధ్యాయులు గొప్ప పాత్ర వహిస్తారన్నారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులను సత్కరించి, అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో శారద ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ కరస్పాండెంట్ జి.వి.రావు, యూనివర్సిటి ప్రతినిధి దుర్గా రమేష్, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో యూనివర్సిటీ ప్రతినిధులు

భారీ వృక్షం తొలగింపు

రాణిగారితోట, జనవరి5(ఆంధ్రజ్యోతి): నిత్యం అక్కడికి వచ్చే ఎంతో మందికి నీడ నిచ్చే ఒక పచ్చని భారీ వృక్షాన్ని, ఎప్పుడో కట్టే వాటర్ ట్యాంక్ కోసం ఇప్పుడే నరికి వేయడంపై స్థానికులు, పర్యావరణ ప్రేమికులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాణిగారితోట సిమెంట్ గౌడౌన్‌లో ఎన్నో సంవత్సరాల నుంచి ఉన్న భారీ వృక్షాన్ని ఆదివారం కార్పొరేషన్ సిబ్బంది నరికేశారు. ఆసుపత్రి, సచివాలయాలకు, సేద తీరెందుకు వచ్చే వారికి నీడ నీవ్వడమే కాకుండా ఎన్నో పక్షులకు అశ్రయంగా ఈ వృక్షం ఉంది. తారకరామ నగర్‌తో పాటు మరికొన్ని ప్రాంతాల మంచినీటి అవసరాల కోసం ఇక్కడ భారీ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది. అయితే ఈ నిర్మాణం ప్రారంభించడానికి దాదాపు 3నెలలు పడుతుందని ఒక అధికారి తెలిపారు, ఇప్పుడే ఈ వృక్షాన్ని తొలగించవలసిని అవసరం ఎముందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అసలు వృక్షం తొలగించడానికి అనుమతి ఉందా అంటున్నారు. కొమ్మ లు మాత్రమే తొలగిం చాలంటే, చెట్టు మొత్తాన్ని కొట్టివేశారని ఒక అధికారి అన్నారు.



భారీ వృక్షాన్ని నరికి వేస్తున్న సిబ్బంది



హెల్త్ వర్సిటీ క్రికెట్ జట్టు ఎంపిక రేపు

విజయవాడ స్పోర్ట్స్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఇబ్రహీంపట్నంలోని నిమ్రా కాలేజీ మైదానంలో మంగళవారం ఉదయం 9 గంటలకు డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ క్రికెట్ పురుషుల జట్టు ఎంపిక చేపడుతున్నట్లు స్పోర్ట్సుబోర్డు సెక్రటరీ ఇత్రిమూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల్లోని ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆ రోజు నిమ్రా కళాశాలో ఫిజికల్ డైరెక్టర్‌కు రిపోర్టు చేయాలన్నారు. ఎంపికైన క్రీడాకారులను ఈ నెల 18 నుంచి 21 వరకు చెన్నైలోని మద్రాస్ యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ క్రికెట్ టోర్నీకి పంపుతామన్నారు.

హంపీకి ఏపీబీఏ అభినందన

విజయవాడకు చెందిన మహిళా చెస్ గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి రెండో వరల్డ్ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుని తన సత్తాను చాటారని అంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ద్వారకానాథ్, పోలినేని అంకమ్మ చౌదరి అభినందించారు.

బెనిఫిట్ షో జీవో ఉపసంహరించాలి

గవర్నర్‌పేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా విడుదలవుతున్న కొత్త సినిమాలపై టికెట్ల ధరలు పెంచుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీవోను ఉపసంహరించుకోవాలని సీపీఎం ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. బెనిఫిట్ సో అనే పదానికి అర్థం మారిపోతోందని, దీని ద్వారా వచ్చిన ఆదాయాన్ని సామాజిక కార్యక్రమాలకు వినియోగించడం లేదని రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. ప్రేక్షకుల అభిమానాన్ని లాభంగా మలుచుకోవడానికి మొదటి వారం రోజులకు టికెట్టు ధరలు పెంచడం దారుణమని, కొన్ని ప్రత్యేక సినిమాలకే ప్రభుత్వం వివక్ష కూడిన అనుమతి ఇవ్వడం సరైంది కాదన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యం

వన్‌టౌన్ : హైదరాబాద్ అమీన్‌పూర్‌కు చెందిన తాండవ నృత్యడాన్స్ మ్యూజిక్ అకాడమీ 14 మంది కళాకారులు ఆదివారం దుర్గగుడి కళావేదిక పై కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. గిరిజా కల్యాణం యక్షగానం, అలివేలు మంగా విలాసం, దశావతారాలు ప్రదర్శించి అందరి మన్ననలను అందుకున్నారు. కళాకారులను ప్రశంసించి సర్టిఫికెట్లను అధికారులు అందజేశారు.

13న గోదా రంగనాథస్వామి కల్యాణం

సత్యనారాయణపురం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఈనెల 13న గోదా రంగనాథస్వామవార్ల కల్యాణం కనుల పండువగా నిర్వహించడం జరుగుతుందని మందిర గౌరవాధ్యక్షుడు పి. గౌతమ్‌రెడ్డి తెలిపారు. ముత్యాలంపాడు షిర్డీసాయిబాబా మందిరంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బాబా మందిరంలో ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 11న 1008 కూడారై నిర్వహిస్తున్నామన్నారు. మండలి కన్వీనర్ మందలపర్తి సత్యశ్రీహరి, పారాయణమండలి సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

పటమట, జనవరి 5(ఆంధ్రజ్యోతి) : కేబీసీ జెడ్పీహెచ్ స్కూల్ పటమటలో 1980 సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థుల కలయిక గాయత్రీ నగర్ ఆంధ్ర ఫంక్షన్‌హాల్లో ఘనంగా ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు తమ చిన్నతనంలో చేసిన అల్లరిని గుర్తు చేసుకుని సందడిగా గడిపారు. 1980లో 10వ తరగతి ప్రథముడిగా నిలిచిన విద్యార్థి జాస్తి శ్రీనివాస్‌ను సత్కరించారు. ఈ సభలో పాఠశాల అభివృద్ధికి నిధులను సమకూర్చాలని నిర్ణయం తీసుకున్నారు. దేశ, విదేశాల నుంచి పలువురు ఈ ఆత్మీయ కలయికలో పాల్గొన్నారు. ఆటల పోటీలతో సందడి చేశారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం 130 మంది అప్పటి విద్యార్థిని, విద్యార్థులు కలిసి భోజనం చేశారు. ప్రసాద్, చందు, ప్రమీల, మద్దె ఉషశ్రీ, కొలా సుధా ఈ కార్యక్రమానికి నిర్వాహకులుగా వ్యవహరించారు.



ఆత్మీయ కలయికలో పాల్గొన్న 1980 సంవత్సరం విద్యార్థులు

పేదరిక నిర్మూలనే చంద్రబాబు లక్ష్యం

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. అశోక్‌నగర్‌లోని తన కార్యాలయంలో ఆదివారం రెండో డివిజన్‌కు చెందిన గారపరెడ్డి కనకదుర్గకు రూ.60వేలు, బోడే స్పందన(15 డివిజన్)కు రూ.50వేలు, 12వ డివిజన్‌కు చెందిన మల్లంపాటి వసుంధరకు రూ.2.50లక్షలు, గంధం అరుణకురూ. 32,833,అబ్దుల్ సర్దార్‌కు రూ.30,541, ఫున్నమరాజుకు రూ.35వేలు, వక్కపట్ల వృష. ద్రీపతికి రూ.59,200ల సీఎంఆర్‌ఎంఎఫ్ నుంచి మంజూరైన చెక్కులు ఎమ్మెల్యేఅందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పొట్లూరి సాయిబాబు, ముమ్మనేని ప్రసాద్, శాయన బుజ్జి, గాదిరెడ్డి అమ్ములు, తుమ్మల శేషుబాబు, చలసాని రమా పాల్గొన్నారు.



చెక్కులను అందజేస్తున్న గద్దె రామ్మోహన్

ఆనందంగా వాకింగ్ చేస్తున్న వాకర్లు

భారతీనగర్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): లయోలా కళాశాల గ్రౌండ్‌లో వాకింగ్ చేసుకునేందుకు కళాశాల యాజమాన్యం అంగీకారం తెలపడంతో ఆదివారం ఉదయం వాకర్లు ఆనందం వ్యక్తంచేశారు. గడిచిన ఐదు సంవత్సరాలుగా వాకింగ్ చేయడానికి సరైన గ్రౌండ్ లేక సమీపంలో రోడ్లపై వాకింగ్ చేయాల్సి వచ్చిందని, దీంతో పలువురు వాకర్లు గాయాల పాలయ్యారని వాకర్స్ ప్రతినిధులు అన్నారు. సుదీర్ఘ చర్చలు తర్వాత మా సమస్యను గుర్తించి వాకర్లను తిరిగి కళాశాలలో వాకింగ్ చేయడానికి అనుమతులు ఇచ్చిన కళాశాల యాజమాన్యనికి కృతజ్ఞతలు తెలిపారు. తమ తరపునుంచి కళాశాల యాజమాన్యానికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటామని వాకర్స్‌సంఘం ప్రతినిధులు గూడపాటి లక్ష్మీనారాయణ, తులసీ మోహన్, రావిరమేష్ తెలిపారు.



కళాశాల గ్రౌండ్‌లో వాకింగ్ చేస్తున్న వాకర్లు

గవర్నర్‌పేట టూ డిపోలో బస్సు దగ్ధం

బస్ స్టేషన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : గవర్నర్‌పేట ఆర్టీసీ టూ డిపో ప్రాంగణంలో శనివారం రాత్రి పార్కింగ్ చేసిన బస్సు దగ్ధమైంది. విధుల్లో ఉన్న సిబ్బంది స్పందించటంతో పెద్ద ప్రమాదం తప్పింది. గవర్నర్‌పేట టూ డిపోకు చెందిన ఏపీ07 జడ్0358 నెంబరు గల బస్సు శనివారం రాత్రి 11 గంటలకు డ్రైవర్ డిపోకు తీసుకువచ్చారు. గ్యారేజీ సిబ్బంది బస్సును శుభ్రం చేసి డిపో ప్రాంగణంలో పార్కింగ్ చేశారు. ఆరోజు రాత్రి 11.15 గంటలకు బస్సులో నుంచి ఒక్కసారి పొగ, మంటలు దట్టంగా వ్యాపించటంతో విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తమై సంబంధిత ఉన్నతాధికారులకు, ఫైర్ సిబ్బందికి ఫోన్ ద్వారా తెలియపరిచారు. ఫైర్ సిబ్బంది హుటాహుటీన ఘటనా స్థలం వద్దకు వెళ్లి బస్సు నుంచి పెద్ద ఎత్తున వస్తున్న మంటలను ఆర్పివేశారు. అయితే అప్పటికే బస్సు పూర్తిగా దగ్ధమైంది. బస్సు ఇంజన్‌లో వైరింగ్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా దగ్ధమైనట్లు ఉద్యోగులు చెబుతున్నారు. దగ్ధమైన బస్సు ఇరువైపుల మరికొన్ని బస్సులు ఉండటంతో పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉండటంతో విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తం కావటంతో ప్రమాదం తప్పింది. అధికారులు బస్సు దగ్ధమైన ఘటన పై విచారణ చేపట్టారు.

సర్వీస్ రోడ్లకు మోక్షం ఎప్పుడో...

భారతీనగర్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): వెటర్నరీ కాలనీ సర్వీస్ రోడ్డు గుంతలు పడి ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఈ రోడ్డు నిర్మించి ఏళ్లు గడిచిపోవడంతో వాహనాల రాకపోకలకు గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. ఏలూరు జాతీయ రహదారికి అనుసంధానంగా సర్వీస్ ఉండడంతో పాటు వెంకటేశ్వరనగర్ కాలనీ, వెటర్నరీ కాలనీ, ఎన్టీఆర్ నగర్ కాలనీలకు ప్రధాన రహదారి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం ఈ రోడ్లో రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్థానిక పెద్దలు వాపోతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్య తీసుకోవాలని కోరుతున్నారు.

బైక్‌లు దహనం చేసింది మతిస్థిమితం లేని బాలుడు

వన్‌టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని కుమ్మరిపాలెం సెంటర్, కొట్టేటి కోటయ్యవీధిలో ఈనెల 2వ తేదీ రాత్రి పార్కింగ్ చేసిన ఐదు బైక్‌లకు నిప్పు పెట్టిన సంఘటనలో భవానీపురం పోలీసులు మతిస్థిమితంలేని బాలుడిని నిందితుడిగా గుర్తిం చారు. ఈ సంఘటనపై 3న భవానీపురం పోలీసులకు ఫిర్యాదు రావ టంతో దర్యాప్తు చేసిన పోలీసులు మైనర్ ఈ సంఘటనకు పాల్పడినట్టు గుర్తించారు. బాలుడితల్లితోసహా తదుపరి చర్యలు నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కేసును చేధించిన ఎస్సై డి.ఆనంద్‌కుమార్, బి.అనూష, హెడ్ కానిస్టేబుల్ ఎం.నాగఫణీంద్ర, కానిస్టేబుళ్లు రెడ్డమ్మ, పి.అనిల్‌లను పోలీసు కమిషనర్ రాజశేఖర్ బాబు అభినందించారు.

తరలించకుండా తగలబెడుతున్నారు

భారతీనగర్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రోజు రోజుకు పెరుకుపోతున్న కాలుష్యాన్ని అరికట్టాలంటే ప్రజలు అధికారులకు సహకరించాలి ప్రజా ప్రతినిధులు చెప్పే మాటలు ప్రచారాలకే పరిమితమయ్యాయని స్థానిక పెద్దలు వాపోతున్నారు. నాల్గవ డివిజన్ లోని వెంకటేశ్వరనగర్ కాలనీలోని అంతర్గత రోడ్లో ఊడ్చిన చెత్త, ఎండిటాకులను వియంసి సిబ్బంది బండిలో తరలించకుండా సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో వేసి తగలబెడుతున్నారని స్థానిక పెద్దలు తెలియజేస్తున్నారు.ఈ మంటల నుంచి విపరీతమైన దుర్వాసనతో పాటు తట్టమైన పొగ రావడంలతో ఆసమయంలో చుట్టు పక్కల నివాసాలవారు తీవ్ర ఇబ్బంది పడాల్సివస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కుట్టుమిషన్‌లు పంపిణీ

మొగల్రాజపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : దేవినేని నెహ్రూ , వైఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్టులు నిరుపేదలకు స్వయం ఉపాధి కల్పించడం లక్ష్యంగా పనిచేస్తున్నాయని వైసీపీ ఎన్టీయార్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ అన్నారు. 8వ డివిజన్ గాయత్రీనగర్ వైసీపీ కార్యాలయంలో ఆదివారం 2,5,7,11,17,18 డివిజన్‌లకు చెందిన ఏడుగురికి కుటుమిషన్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్ ట్రస్టు చైర్మన్ యలమంచలి జయప్రకాష్, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్ అమర్‌నాథ్ పాల్గొన్నారు

ప్రభుత్వాసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

విజయవాడ, జనవరి 5(ఆంధ్రజ్యోతి) : విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో బ్రెయిన్ ట్యూమర్‌కు సంబంధించి ఓ బాలుడి అరుదైన శస్త్ర చికిత్స చేశారు. వెలగలేరుకు చెందిన 11ఏళ్ల బాలుడికి మెదడులో కణితి పెరుగుతోంది. కణాలు అధిక సంఖ్యలో పెరగడంవల్ల ఇలాంటి కణితిలు ఏర్పడతాయని వైద్యులు తెలిపారు. ప్రభుత్వాసుపత్రి న్యూరో విభాగంలోని డాక్టర్ రాకేష్ మెదడులో కణితి ఉన్నట్టు గుర్తించారు. వైద్య పరిభాషలో దీన్ని బోన్ ట్రోమాగా వ్యవహరిస్తారు. దీని కారణంగా మెదడులో ఉన్న పుర్రె ఎముక దెబ్బతింది. దానిని శస్త్రచికిత్స ద్వారా తొలగించి కృత్రిమ ఎముకను అమర్చారు. శస్త్ర చికిత్స తర్వాత బాలుడు ఆరోగ్యంగా ఉన్నాడని డాక్టర్ రాకేష్ తెలిపారు. శస్త్ర చికిత్స చేయడంలో కీలకంగా వ్యవహరించిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాకేష్, విభాగాధిపతి డాక్టర్ బాబ్జి శ్యామ్‌కుమార్, సీనియర్ రెసిడెంట్ డాక్టర్స్ మునికుమార్, మణికుమార్, నిఖిల్, శశిధర్, నర్సింగ్ సిబ్బందిని అధికారులు అభినందించారు.





ఇంటి యజమాని మద్యానికి బానిసైతే ఆ కుటుంబం అనుభవించే బాధ వర్ణనాతీతం.. అలాంటి నరకాన్ని ఎన్నో ఏళ్ళు అనుభవించారు చెన్నైకి చెందిన భాను సురేష్‌బాబు. కష్టనష్టాలు భరించి, ఓర్పుతో, నేర్పుతో తన భర్తను మార్చుకున్నారు. తన దుస్థితి మరే మహిళా అనుభవించకూడదనే ఆలోచనతో... డి-అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసి... వందలాదిమందికి కొత్త జీవితాన్ని ప్రసాదిస్తున్నారు. స్ఫూర్తిమంతమైన భాను జీవన ప్రయాణం గురించి ఆమె మాటల్లోనే...

మత్తు వదిలిస్తున్నారు

"మా వారు స్టేట్ బ్యాంక్‌లో ఉద్యోగం చేసేవారు. చీఫ్ మేనేజర్‌గా రిటైరయ్యారు. అయితే మా పెళ్లయిన కొత్తలో ఆయన రేయింబవళ్లు తాగేవారు. ఆయనవల్ల నాతో పాటు మొత్తం మా ఉమ్మడి కుటుంబంలోని 20 మంది సమస్యలు ఎదుర్కోవాల్సివచ్చింది. సరిగ్గా ఆఫీసుకు వెళ్లేవారు కాదు. దాంతో ఉద్యోగం నుంచి తీసేస్తామని ఉన్నతాధికారులు హెచ్చరించారు. నేను వారిని కాళ్లా వేళ్లా పడి బతిమాలితే వదిలేశారు. అలా 1985-94 మధ్య నరకం అనుభవించాను. ఆయనను ఎలాగైనా బాగు చేసుకుందామని ప్రయత్నాలు మొదలుపెట్టాను. ఎన్నో ఆలయాలకు వెళ్లాను. వ్రతాలు చేశాను. కొంతమంది మాటలతో మతం మార్చుకొనేందుకూ సిద్ధమయ్యాను. అవేవీ ఫలించలేదు.

జీవితం మీద విరక్తి కలిగేది...

చివరకు తిరువాన్మియూరు టీటీకే హాస్పిటల్లో ఒక డి-అడిక్షన్ చికిత్సా కేంద్రం ఉందని తెలిసి, మావారిని చేర్పించాను.. అక్కడ మద్యం బానిసలతో పాటు వారి కుటుంబీకుల్లో ఒకరు తోడు ఉండాలి. దాంతో మావారి వెంట నేనే వున్నాను. అప్పట్లో చెన్నై మొత్తం మీద అలాంటి కేంద్రం అదొక్కటే ఉండేది. ట్రీట్‌మెంట్ తరువాత ఒక నెల బావుండేవారు. తరువాత మళ్లీ పాత పద్ధతే. దాంతో నాకు జీవితం మీద విరక్తి కలిగేది. ఆ కేంద్రంలో చికిత్స పొందుతున్నవారి కుటుంబ సభ్యులకు కూడా సైకోథెరపీ, కౌన్సెలింగ్ ఇచ్చేవారు. దాంతో నాకు కూడా మద్యపాన సమస్య మీద ఎంతో అవగాహన వచ్చింది. చివరికి... సుమారు పదేళ్ల తరువాత మావారిలో మార్పు వచ్చింది. పూర్తిగా మద్యం మానేశారు. అప్పుడు నేను ఆలోచనలో పడ్డాను. ఒక వ్యక్తి చేత మద్యం మానిపించడానికి నేను ఇంత కష్టపడ్డాను. ఇదే సమస్య ఎదుర్కొంటున్న మిగిలిన మహిళల సంగతేమిటి? అందరూ ఇంతగా పోరాడాల్సిందేనా? ఒక వ్యక్తి మద్యపానంలో కూరుకుపోతే, ఆ కుటుంబం మొత్తం నష్టపోవాలా? దేవుడు నాకు చూపించిన మంచిని నలుగురికి పంచాలనుకున్నాను. అదే కేంద్రానికి వెళ్లి బాధితులకు స్వచ్ఛందంగా కౌన్సెలింగ్ ఇవ్వడం ప్రారంభించాను. అవగాహన కల్పించాను. ఆ సెంటర్లో ఒక పెద్దాయన దీనికి సంబంధించి కోర్సు చేస్తే అధికారికంగా కౌన్సెలింగ్ ఇవ్వవచ్చని సూచించారు. అప్పటికే నేను బీఏ హిస్టరీ చేశాను. అప్పటికి నా వయసు 33 ఏళ్లు.. ఎంఏలో చేరే అవకాశం ఉన్నా... కావాలనే బీఏ సైకాలజీలో చేరాను. తరువాత ఎంఏ సైకాలజీ, ఎంఫిల్ చేశాను. డి-అడిక్షన్ సెంటర్‌లో పని చేయడానికి అవసరమైన శిక్షణ పొందాను. అనేక కోర్సులు చేశాను. ఆ తరువాత టీటీకే సెంటర్ వారు ఫ్యామిలీ థెరపిస్ట్, రిహాబిలిటేషన్ కౌన్సెలర్‌గా అవకాశం ఇచ్చారు. అక్కడ ఏడేళ్ల పాటు పని చేశాను. ఆ తరువాత చెన్నై కార్పొరేషన్‌కు చెందిన 'కెపాక్స్' అనే కేంద్రంలో చేరాను. అక్కడి నుంచి 15 సంవత్సరాల పాటు వివిధ కేంద్రాల్లో పని చేశాను.

పరిమితులు లేని సేవకోసం...

డి-అడిక్షన్, మద్యపానం, మాదకద్రవ్యాల వ్యసనం తదితర అంశాలపై పని చేశాను. అక్కడ నాకు పరిమితులు ఉండేవి. వాటిని అధిగమించి సేవ చేయడానికి సొంతంగా ఒక స్వచ్ఛంద సంస్థను, దానికి అనుబంధంగా డి-అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయాలని దృఢంగా అనుకున్నాను. ఆ కేంద్ర భవనంలో వార్డులు, ఓపెన్ ఏరియా, థెరపీ సెంటర్, కిచెన్, థియేటర్ హాల్ లాంటివన్నీ ఉండేలా ప్రణాళిక వేసుకున్నాను. దాని గురించి మా వారికి చెబితే "ఇవన్నీ కావాలంటే కొన్ని కోట్లు కావాలి. మనకంత శక్తి ఎక్కడిది?" అన్నారు.. దాంతో మా ఆర్థిక స్తోమత మేరకు పరిమితంగానే పని ప్రారంభించాను. 2005లో 'కన్సర్న్' అనే సంస్థను ఏర్పాటు చేశాను. అనంతరం డబుల్-బెడ్‌రూమ్ ఇంటిని అద్దెకు తీసుకొని, అయిదు పడకలతో డి-అడిక్షన్ సెంటర్‌ని ప్రారంభించాం. ఇప్పుడు మాడంబాక్కంలో ఇది నడుస్తోంది. ఈ కేంద్రానికి వచ్చిన వారికి అన్నీ బోధపడేలా చెప్పి, వ్యసనం మాన్పించడానికి ప్రయత్నిస్తాం. ఇప్పుడు సామాజిక న్యాయ మంత్రిత్వశాఖతో కలిసి పని చేస్తున్నాం. మా 'కన్సర్న్'లో ఆహారం, చికిత్స, కౌన్సిలింగ్, మందులు తదితరాలన్నీ ఉచితమే. ఇప్పటి వరకూ 2 వేల మందికి చికిత్స అందించాం.

> 'మా స్వస్థలం చెన్నై. మా అత్తగారి పూర్వీకులు ఆంధ్రా సరిహద్దు నుంచి వచ్చి చెన్నైలోనే స్థిరపడ్డారు. మేం తెలుగునాయుళ్లం. ఇంట్లో తెలుగే మాట్లాడతాం. మా పిల్లలు, మనవళ్లు అందరూ ఇంట్లో తెలుగు మాట్లాడాల్సిందే. నో డాడీ.. నో మమ్మీ... 'అమ్మా-నాన్నా' అని పిలవాల్సిందే. మన అమ్మ భాషను మరచిపోతే అమ్మను కూడా మరచిపోయినట్లే. అందుకే ఒక్కొక్కరికి నాలుగైదు భాషలు వచ్చినా అందరం మాట్లాడేది తెలుగులోనే."

మమ్మల్ని సంప్రదించాలంటే...

"మా వెబ్‌సైట్ ద్వారా, 'కన్సర్న్' హెల్ప్‌లైన్: 044-46865176 ద్వారా మమ్మల్ని సంప్రదించవచ్చు. మా సంస్థ గురించి అందరికీ తెలుసు. తమిళనాట ఎవరైనా డి-అడిక్షన్ కేంద్రం పెట్టాలంటే ముందుగా మమ్మల్నే సంప్రదిస్తారు. బాధితుడికి చికిత్స పూర్తయిన తరువాత కొన్ని కుటుంబాలు వారిని తీసుకువెళ్లడానికి ఇష్టపడవు. అలాంటివారికి మేమే నెల రోజుల పాటు బస కల్పిస్తాం. ఆ నెల రోజుల్లో వారు ఏదో ఒక ఉపాధి వెతుక్కోవాల్సి ఉంటుంది."

కుటుంబ మద్దతు అవసరం


మద్యపాన బానిసలకు కుటుంబ సభ్యుల మద్దతు ఎంతో అవసరం. చాలామంది "ఏం చేసినా ఆయన మారరు" అంటూ ఉంటారు. అది తప్పు. అలా అనుకుంటే మా వారు మారేవారా? ఇంతమంది జీవితాలను మేం ప్రభావితం చేయగలిగేవారమా?. కాబట్టి నిరంతరం ప్రయత్నం చేయాల్సిందే. మద్యానికి అలవాటుపడిన వారిని అలాగే వదిలేయకండి. మానసికంగా వారికి దగ్గరవ్వండి, వారి బాగోగులు చూసుకునేందుకు మీరున్నారన్న నమ్మకం కలిగించండి. వారిని ఇలాంటి రిహాబిలిటేషన్ సెంటర్లకు తీసుకువచ్చి చికిత్స చేయించండి. చికిత్స పొందిన తరువాత కూడా ఏడాదిపాటు కుటుంబ సభ్యులు వారిని గమనిస్తూ, అదుపులో ఉంచాలి. ఏడాదిపాటు మద్యం జోలికి పోలేదంటే, ఇక జీవితంలో అటువైపు వెళ్లరు.

ఆ సంతృప్తి మాటల్లో చెప్పలేను...

మాకు ఒకే అబ్బాయి. అతను ఆర్కిటెక్ట్. జీవితంలో స్థిరపడ్డాడు. మాకు ఎలాంటి బరువు బాధ్యతలు లేవు. అందుకే నాలాంటి బాధితుల్ని గట్టెక్కించాలన్న ఉద్దేశంతో ఈ సేవను ఎంచుకున్నాను. మా వారు రిటైరయ్యాక ఆయన కూడా నాకు పూర్తిగా సహకరిస్తున్నారు. ఆయన మద్యపానానికి వ్యతిరేకంగా అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నారు. మా దగ్గర చికిత్స పొందిన వారి కుటుంబ సభ్యులు సంతోషంగా మా దగ్గరకు వచ్చినప్పుడు మాకు కలిగే సంతృప్తిని మాటల్లో చెప్పలేను."

డాక్టర్ ఎస్‌కేఎండీ గౌస్‌బాషా, చెన్నై
ఫొటోలు: కర్రి శ్రీనివాస్

ముత్యాల ముగ్గు





17 చుక్కలు, 17 వరుసలు

జి. సుహాసిని, మచిలీపట్నం

ఈ-మెయిల్: features@andhrajyothy.com

పంచదారకు బదులుగా...

చలికాలంలో తరచుగా వచ్చే ప్రత్యేక సందర్భాల కోసం తీపి పదార్థాలు వండుతుంటాం. వీటిలో చాలావరకూ పంచదారనే ఉపయోగిస్తాం. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. పంచదారకు బదులు ఏమి వాడవచ్చో తెలుసుకుందాం!



తేనె

- ఇది సహజంగా లభించే తీపి పదార్థం. దీనిని సంప్రదాయ తీపి వంటకాలతోపాటు కేకులు, కుకీలు, పేస్ట్రీల తయారీలో వాడవచ్చు. తేనెలోని విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు కలిసి శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. ముడి తేనె వాడుకోవడం మంచిది.



బెల్లం

- దీనిని చెరకు లేదా తాటి రసంతో తయారు చేస్తారు. రెండూ ఆరోగ్యానికి మంచివే. వీటిలో ఐరన్ అధికంగా ఉంటుంది. నువ్వుల లడ్డూలు, క్యారెట్ లేదా గాజర్ హల్వా, పుడ్డింగ్‌ల తయారీలో బెల్లాన్ని వాడడం మంచిది.



ఖర్జూరాలు

- కేక్, కుకీల తయారీలో ఖర్జూరం సిరప్... ఖీర్, పాయసం, హల్వా, డ్రైఫ్రూట్ లడ్డూల తయారీలో ఖర్జూరం పేస్ట్... వాడుకోవచ్చు. ఖర్జూరంలో ఉండే పొటాషియం రక్తంలో చక్కెర స్థాయి పెరగకుండా నిరోధిస్తుంది.



ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల ఆవరణలో ఉత్సాహంగా రంగవల్లులు తీర్చిదిద్దుతున్న మహిళలు



ముగ్గును పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు, పక్కన కృష్ణా మిల్క్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, వెలగా జోషి తదితరులు

సంస్కృతికి దర్పణం

ముత్యాల ముగ్గులు

కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

- సంస్కృతిని భావితరాలకు వారసత్వంగా ఇవ్వాలి
- ముగ్గులు మహిళల ప్రతిభకు దర్పణాలు
- ఉత్సాహంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు
- జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన మహిళలు

విజయవాడ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : తరతరాల సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు వారసత్వంగా అందించాలని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పిలుపునిచ్చారు. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్ ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి చలసాని ఆంజనేయులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సంక్రాంతి తెలుగువారి పండగల్లో అతిపెద్దదని.. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా సంక్రాంతికి సొంతూళ్లకు చేరుకుంటారన్నారు. సంక్రాంతికి ప్రతి ఇంటి ముందు ముత్యాల ముగ్గులు కనిపిస్తాయన్నారు. ముగ్గులు మహిళల్లోని ప్రతిభకు నిదర్శనమన్నారు. సాంకేతికత ఆధునిక కొత్త పుంతలు తొక్కుతున్న రోజుల్లో సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించేలా ముత్యాల ముగ్గుల పోటీలను నిర్వహించడంపై 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' కృషిని కొనియాడారు. 'ఆంధ్రజ్యోతి' సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్‌కుమార్ మాట్లాడుతూ, మహిళల జీన్స్‌లోనే ముగ్గు ఉంటుందన్నారు. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' 18ఏళ్లుగా నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడులోనూ అధిక సంఖ్యలో పాల్గొంటున్నారని చెప్పారు. విజేతలకు లక్షలాది రూపాయల బహుమతులను అందజేస్తున్నామన్నారు. న్యాయనిర్ణేతలు అబ్బూరి రత్నలక్ష్మి మాట్లాడుతూ, మహిళలు ముగ్గులను అద్భుతంగా వేశారని.. విజేతలను ఎంపిక చేయడం కష్టంగా మారిందన్నారు. చుక్కలు, రంగులు, సృజనాత్మకతను పరిగణనలోకి తీసుకుని విజేతలను ఎంపిక చేశామన్నారు. జి.లక్ష్మి మాట్లాడుతూ, ముగ్గులతో ఆరోగ్యం, ఆధ్యాత్మికత ముడిపడి ఉన్నాయని చెప్పారు. ఆర్.శ్రీలక్ష్మీదేవి మాట్లాడుతూ, వాకిట్లో పేడ నీళ్లతో కల్లాపి చల్లడం, ముగ్గు వేయడంలో సైన్స్ ఒదిగి ఉందన్నారు. మొదటి బహుమతిని న్యూరాజరాజేశ్వరిపేటకు చెందిన కె.మల్లేశ్వరికి రూ.6వేలను చలసాని ఆంజనేయులు అందజేశారు. ద్వితీయ బహుమతిని నందిగామకు చెందిన టి.జ్యోతికి మరో అతిథి, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రత్యేక అధికారి వెలగా జోషి అందజేశారు. మూడో బహుమతిని యనమలకుదురు చెందిన టి.నాగలక్ష్మికి 'ఆంధ్రజ్యోతి' సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్‌కుమార్ రూ.3వేలను అందజేశారు. బహుమతులను ఓ2 ఎలక్ట్రిక్ వెహికల్స్ అధినేత చుంచు నరసింహారావు సమకూర్చారు. కన్సొలేషన్ బహుమతులుగా అయోధ్యనగర్‌కు చెందిన ఎం.మాధవి, అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన సీతాభవాని, మధురానగర్‌కు చెందిన శాంతకుమారి, కేతనకొండకు చెందిన సరితలకు రూ.1000 చొప్పున అందజేశారు. ఈ పోటీలకు ఎన్టీఆర్ జిల్లా రైతుమిత్రల సంఘం, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు గన్నె వెంకటనారాయణ ప్రసాద్(అన్న), రాయుడు ట్రావెల్స్ అధినేత వెలగలేటి భార్గవ్‌రాయుడు, టీడీపీ డివిజన్ అధ్యక్షులు దాసరి గాబ్రియేలు, పడాల గంగాధర్, అంబులెన్స్ కిషోర్, శారదా కళాశాల ఎండీ వై.శారదాదేవి, చైతన్య కళాశాల ప్రిన్సిపాల్ గోకర్ణేశ్వరరావు, రాష్ట్ర ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీహరి, బొబ్బా సిద్ధార్థ, పైడి శ్రీను, బత్తుల కొండా సహకరించారు.





నేను సైతం.. ముగ్గు వేస్తున్న చిన్నారి

కష్టానికి ఫలితం దక్కింది : కె.మల్లీశ్వరి (మొదటి బహుమతి)

ఏడేళ్లుగా వివిధ ప్రాంతాల్లో జరిగిన ముగ్గుల పోటీలో పాల్గొంటున్నా. ప్రతి ఏడాది మొదటి మూడు బహుమతుల్లో ఏదోఒకటి వస్తుంది. కొన్నిసార్లు కన్సొలేషన్ బహుమతి తీసుకున్నా. 'ఆంధ్రజ్యోతి' ముగ్గుల పోటీల్లో మొదటిసారి పాల్గొన్నాను. నేను వేసిన చుక్కల ముగ్గుకు ప్రథమ బహుమతి రావడం చాలా సంతోషంగా ఉంది. నా కష్టానికి ప్రతిఫలం దక్కింది.



మల్లీశ్వరి

చిన్నతనం నుంచి ముగ్గులపై ఆసక్తి : జ్యోతి (ద్వితీయ)



చిన్నతనం నుంచి ముగ్గులపై ఆసక్తి ఎక్కువ. 2009 నుంచి పోటీల్లో పాల్గొంటున్నా. ఏడేళ్లుగా 'ఆంధ్రజ్యోతి' ముత్యాల ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నా. ప్రతిసారీ ద్వితీయ, తృతీయ బహుమతుల్లో ఏదో ఒకటి సాధించా. ఈఏడాది ద్వితీయ బహుమతి రావడం సంతోషంగా ఉంది.

చాలా సంతోషంగా ఉంది : టి.నాగలక్ష్మి, (తృతీయ)



'ఆంధ్రజ్యోతి' ఐదేళ్ల క్రితం కానూరులో నిర్వహించిన సంక్రాంతి ముత్యాల ముగ్గుల పోటీల్లో మొదటిసారి పాల్గొన్నా. మొదటి బహుమతి వచ్చింది. అప్పటి నుంచి ప్రతీ ఏడాది పోటీల్లో పాల్గొంటున్నా. ఐదేళ్లుగా బహుమతి తీసుకుంటుకున్నా. ఈ ఏడాది మూడో బహుమతి రావడం సంతోషంగా ఉంది.

ఫ్యాషన్ స్టడీస్ @ నిఫ్ట్




కోర్సులు:
- టెక్స్‌టైల్ డిజైన్
- యాక్సెసరీ డిజైన్
- లెదర్ డిజైన్
- ఫ్యాషన్ డిజైన్
- నిట్‌వేర్ డిజైన్
- అపారెల్ ప్రొడక్ట్
- ఫ్యాషన్ కమ్యూనికేషన్

యూజీ/ పీజీ ప్రోగ్రామ్స్
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: జనవరి 6
ప్రవేశ పరీక్ష తేదీ: 2025 ఫిబ్రవరి 9
పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: ఫిబ్రవరి 28
ప్రవేశ పరీక్ష: 2025 ఏప్రిల్
పూర్తి వివరాలకు: NIFT HYDERABAD NIFT Campus, Opposite HiTech City, Cyberabad post, Madhapur, Hyderabad – 500 081, Telangana.
T: (040) 23110841/42/43, 23110630. **వెబ్‌సైట్:** www.nift.ac.in

దక్షిణ మధ్య రైల్వేలో 4232 అప్రెంటిస్‌లు

సికింద్రాబాద్‌లోని రైల్వేరిక్రూట్‌మెంట్ సెల్ ఎస్‌సీఆర్ వర్క్‌షాప్, యూనిట్‌లలో అప్రెంటిస్ శిక్షణలో ప్రవేశాలకు ఐటీఐ పాసైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతోంది. దక్షిణ మధ్య రైల్వేలోకి వచ్చే జిల్లాల అభ్యర్థులు మాత్రమే 2025 జనవరి 27లోగా దరఖాస్తు చేసుకోవాలి.



ఎస్‌సీఆర్ యూనిట్ ప్రదేశాలు: సికింద్రాబాద్, లాలాగూడ, మెట్టుగూడ, ఖాజీపేట్, హైదరాబాద్, విజయవాడ, బిట్రగుంట, గూడూరు జంక్షన్, కాకినాడ పోర్టు, కొండపల్లి, మచిలీపట్నం, నర్సాపూర్, ఒంగోలు, రాజమండ్రి, రాయనపాడు, నల్లపాడు, గుంటూరు, గుంతకల్, తిమ్మనచర్ల, యాద్‌గిర్, నాందేడ్, పూర్ణ జంక్షన్, ముద్‌ఖేడ్.

ట్రేడ్‌ల వారీగా ఖాళీలు:
- ఏసీ మెకానిక్ - 143
- ఎయిర్ కండిషనింగ్ - 32
- కార్పెంటర్ - 42
- డీజిల్ మెకానిక్ - 142
- ఎలక్ట్రానిక్ మెకానిక్ - 85
- ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్ - 10
- పెయింటర్ - 74
- ఎలక్ట్రీషియన్ - 1053
- ఫిట్టర్ - 1742
- మెషినిస్ట్ - 100
- వెల్డర్ - 713
- పవర్ మెయింటెనెన్స్ (ఎలక్ట్రీషియన్) - 34
- ఎలక్ట్రికల్(ఎస్అండ్‌టీ) (ఎలక్ట్రీషియన్) - 10
- ట్రైన్ లైటింగ్(ఎలక్ట్రీషియన్) - 34
- మోటార్ మెకానిక్ మెహికిల్ - 08
- మెకానిక్ మెషిన్ టూల్ మెయింటెనెన్స్ - 10

(మొత్తం పోస్టుల సంఖ్య 4232 (ఎస్సీ-635, ఎసీ-317, ఓబీసీ -1143, ఈడబ్ల్యూఎస్-423, యూఆర్-1714)
అర్హత: కనీసం 50 శాతం మార్కులతో పది పాస్ కావడంతోపాటు, సంబంధిత ట్రేడ్‌లో ఐటిఐ పూర్తి చేసి ఉండాలి.
వయస్సు: 2024 డిసెంబర్ 28 నాటికి 15 నుంచి 24 సంవత్సరాల మధ్యలో ఉండాలి
ఎంపిక: పది, ఐటీఐలో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారు. ఓబీసీలకు మూడు, ఎస్సీ/ ఎస్టీలకు ఐదేళ్ల గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
చివరి తేదీ: 2025 జనవరి 27
పూర్తి వివరాలకు scr.indianrailways.gov.in/ వెబ్‌సైట్ చూడొచ్చు.

దిక్సూచి DIKSUCHI

దేశవ్యాప్తంగా ఇంటర్మీడియేట్(ఎంపీసీ) లేదా తత్సమాన విద్యార్థులు బీటెక్, బీఆర్క్/బీ డిజైన్ కోర్సుల్లో ప్రతిష్ఠాత్మక ఎన్ఐటీ, ఐఐటీ, ఎస్‌పీఏ లాంటి విద్యాసంస్థల్లో ప్రవేశానికి ఎన్‌టీఏ నిర్వహించే జేఈఈ(మెయిన్) ప్రవేశ పరీక్ష ప్రతి ఏడాదిలానే ఈ సంవత్సరం కూడా రెండు దఫాలుగా అంటే జనవరి, ఏప్రిల్‌ల్లో నిర్వహిస్తున్నారు. జనవరి సెషన్‌కి సంబంధించి అప్లికేషన్ ప్రాసెస్ ఈపాటికే పూర్తయింది. దాదాపు 13.6 లక్షలమంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఏప్రిల్ సెషన్‌కి సంబంధించి అప్లికేషన్ ప్రాసెస్ జనవరి 31, 2025 నుంచి ఫిబ్రవరి 24 వరకు ఉంటుంది. జనవరి సెషన్‌కి దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు ఈ తేదీలను గుర్తుపెట్టుకోవాలి.

- జనవరి 22 నుంచి 31 వరకు జరిగే కంప్యూటర్ ఆధార పరీక్షలో ప్రధానంగా చాయిస్ ప్రశ్నలను తీసివేశారు. అంటే గతంలో సబ్జెక్టుకి పార్ట్-బిలో 10 ప్రశ్నల్లో అయిదు అటెంప్ట్ చేస్తే సరిపోయేది. కానీ ఈ సంవత్సరం అయిదింటికి అయిదు అటెంప్ట్ చేయాలి. అంటే ప్రతి సబ్జెక్టుకి 25కి 25 అటెంప్ట్ చేయాల్సి ఉంటుంది. చాయిస్ ఉండదు.
- ఈ సందర్భంగా చాలామంది విద్యార్థులు జనవరి లేదా ఏప్రిల్‌లో ఏ సెషన్‌ని సీరియస్‌గా తీసుకోవాలనే సందిగ్ధంలో ఉంటారు. ఇంటర్ చదువుతున్న విద్యార్థులు ఫిబ్రవరిలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు, మార్చిలో బోర్డ్ పరీక్షలు రాయడంలో హడావుడిగా ఉంటారు. కాబట్టి వారికి జనవరి సెషన్ బెటర్ ఎందుకంటే వీరికి బోర్డు పరీక్షలు అయిన తరువాత జేఈఈ(మెయిన్) ఏప్రిల్ సెషన్‌కి సమయం లభించేది చాలా తక్కువ. అదే ఇంటర్ పూర్తిచేసుకుని లాంగ్‌టర్మ్ ప్రిపరేషన్‌లో ఉన్న విద్యార్థులు ఏ సెషన్ అయినా సీరియస్‌గా తీసుకోవచ్చు.

జేఈఈ(మెయిన్) 2025
జనవరి సెషన్ బెటర్

ఈ టిప్స్‌తో విద్యార్థులు మంచి పర్సంటైల్ స్కోరును సాధించవచ్చు.

1. సిలబస్‌పై అవగాహన
ఎ) విద్యార్థి పరీక్ష విధానం, మార్కింగ్ స్కీమ్, వెయిటేజ్ టాపిక్స్‌పై పూర్తి అవగాహనతో ఉండాలి.
బి) ఎక్కువ వెయిటేజ్ ఉన్న టాపిక్స్/ చాప్టర్స్‌పై దృష్టి సారించాలి.

2. సరైన ప్రణాళిక
ఎ) విద్యార్థి ప్రతి సబ్జెక్టుకి నిర్దీత సమయాన్ని కేటాయించి, దానిప్రకారం ప్రిపరేషన్ మొదలుపెట్టాలి.
బి) ముఖ్యమైన టాపిక్స్‌కి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి.
సి) చదువు, విశ్రాంతికి మధ్య సరైన సమయాన్ని కేటాయించుకోవాలి.

3. రివైజ్- ప్రాక్టీస్
ఎ) ఎన్‌సీఈఆర్‌టీ, ఇంటర్ పాఠ్య పుస్తకాల్లో ఉన్న సమ్మరీని సమగ్రంగా రివైజ్ చేయాలి.
బి) విద్యార్థి తనకు పట్టున్న చాప్టర్లు, టాపిక్స్‌ను ఎక్కువ ప్రాక్టీస్ చేయాలి.

4. నమూనా పరీక్షలు
ఎ) గత సంవత్సరం ప్రశ్నపత్రాలను విరివిగా సాల్వ్ చేయాలి.
బి) మాక్‌టెస్ట్‌ను రాయడం ద్వారా పరీక్ష భయాన్ని అధిగమించవచ్చు.

5. సమయ పాలన
ఎ) ప్రాక్టీస్, మాక్‌టెస్ట్ సమయంలో నిర్దీతమైన టైమ్‌లైన్ పాటించాలి. ప్రతి ప్రశ్నకు రెండు లేదా మూడు నిమిషాల సమయం ఉంటుంది. కాబట్టి తొందరపాటు లేకుండా అటెంప్ట్ చేయాలి. దీనివల్ల నెగెటివ్ మార్కులను తగ్గించవచ్చు.
బి) ముదట క్లిష్టమైన ప్రశ్నలను వదిలేసి, బాగా తెలిసిన వాటిపై దృష్టి సారించడం ద్వారా మీకు మనోనిబ్బరం తగ్గకుండా ఉంటుంది.

6. క్లాస్‌రూమ్ నోట్స్
ప్రిపరేషన్ రోజుల్లో విద్యార్థి ఎక్కువగా ఎన్‌సీఈఆర్‌టీ/ గత ప్రశ్నపత్రాలపై ఆధారపడాలి. మీ క్లాస్‌రూమ్ నోట్స్ అనేది రివిజన్‌కు ఎంతో ఉపయోగపడుతుంది.

7. ఫార్ములాస్ రివిజన్



ఎ) అన్ని ముఖ్యమైన ఫార్ములాలు, ఒకచోట పెట్టుకుని ప్రతి రోజూ రివైజ్ చేయాలి.
బి) వీలైతే దీనికి సంబంధించి బ్రీఫ్ నోట్స్ తయారు చేసుకోవాలి.

8. సమగ్ర విశ్లేషణ
ఎ) ప్రతి మాక్‌టెస్ట్ అయ్యాక తప్పొప్పులుపై దృష్టి సారించాలి.
బి) రెగ్యులర్‌గా అడిగే కాన్సెప్ట్‌లను ఎక్కువగా రివైజ్ చేయాలి. గెస్‌వర్క్‌ను పూర్తిగా అవాయిడ్ చేయాలి.

9. పాజిటివ్ ఆలోచనలు
ఎ) విద్యార్థి ఈ దశలో మాడిఫైడ్‌గా ఉండాలి. అసలు నెగెటివ్ ఆలోచనలను దరికి రానివ్వద్దు.
బి) మీ చుట్టూ సహ విద్యార్థులు, లెక్చరర్స్ ఉండటంతో పోటీ వాతావరణం ఉంటుంది. అయితే ఒత్తిడికి గురికాకుండా చూసుకోవాలి.

10. ఆరోగ్యం ముఖ్యం
ఎ) స్టడీ సెషన్స్ మధ్య సరైన బ్రేక్స్ ఉండాలి
బి) ఆహారం, నిద్ర అనేది మెదడును ఫ్రెష్‌గా ఉంచుతుంది.
సి) వీలైతే మెడిటేషన్, యోగ చేయాలి.
డి) మీ శరీరం, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి.

చివరిగా ఈ పరీక్షలో విజయం సాధించాలంటే హార్డ్‌వర్క్‌తో పాటు, అక్యురసీ, సమయపాలనపై ఎక్కువ శ్రద్ధ పెట్టండి.



డాక్టర్ పవన్‌కుమార్ కాసు
సంజీవిని ఐఐటీ అకాడమీ

SCHOLARSHIP ALERT

Omron Healthcare

Description: OMRON Healthcare India invites applications from girl students studying in Classes 9 to 12 at any school across India.
Eligibility: Girl students studying in Classes 9 to 12 at any school across India are eligible to apply. Students must have received a minimum of 75% marks in their previous academic year. The annual family income of applicants should be less than INR 8,00,000.
Prizes & Rewards: One-time scholarship of INR 20,000
Last Date to Apply: 10-01-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/OMHS2

Kotak Kanya

Description: Under the CSR Project on Education & Livelihood of Kotak Mahindra Group Companies, Kotak Education Foundation invites applications for the Kotak Kanya Scholarship 2024-25 from meritorious girl students from low-income families to empower them to pursue higher studies in professional education after Class 12.
Eligibility: Open for meritorious girl students across India.
Applicants must have scored 75% or more marks or equivalent CGPA in Class 12 board examinations.
Applicant's annual family income must be less than INR 6,00,000.
Meritorious girl students who have secured admission to the first year of graduation programs in the academic year 2024-25 in institutes of repute like NIRF/NAAC accredited for professional graduation degrees like Engineering, MBBS, BDS, Integrated LLB (5 Years), B.Sc. Nursing, B. Pharmacy, Integrated BS-MS/BS-Research in ISER, IISC (Bangalore), or other professional courses (Design, Architecture, etc.).
Prizes & Rewards: INR 1.5 lakh* per year
***Disclaimer:** The renewal of the scholarship every year will be at the sole discretion of the Kotak Education Foundation
Last Date to Apply: 12-01-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/KKGS3

Tata Capital Pankh

Description: An initiative of Tata Capital Limited aimed at providing financial support to students belonging to economically weaker sections of society to help them fulfill their academic dreams.
Eligibility: Indian students who are currently studying in Classes 11, 12 general graduation (B.Com., B.Sc., B.A., etc.), diploma and ITI courses at recognised institutions are eligible. Applicants must have scored at least 60% marks in the preceding class. The annual family income of the applicants from all sources must be less than or equal to INR 2.5 lakh.
Prizes & Rewards: Up to an amount ranging from INR 10,000 to INR 12,000 or 80% of course fees (whichever is less)
Last Date to Apply: 15-01-2025 ***Application mode:*** Online only
Short Url: www.b4s.in/aj/TCPS27

buddy4study.com

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

అలాంటి సినిమాలను నిషేధించాలి
- అనంత శ్రీరామ్



'నిండు సభలో ద్రౌపది వస్త్రాన్ని తీస్తున్నా మౌనంగా ఉన్న కర్ణుడు గొప్పవాడు ఎలా అవుతాడు? పురాణ ఇతిహాసాలను సినిమావాళ్లు తమ ఇష్టం వచ్చినట్లు మార్చి హైందవ ధర్మాన్ని వక్రీకరిస్తున్నారు' అని అన్నారు సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్. గన్నవరం సమీపంలోని కేసరపల్లి వద్ద విశ్వ హిందూపరిషత్(వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో నిర్వహించిన 'హైందవ శంఖారావం' సభలో ఆయన మాట్లాడుతూ. 'హిందూ ధర్మాన్ని అవమానించేలా తీసిన సినిమాలను ప్రభుత్వం నిషేధించాలి. లేదంటే హిందువులే పూర్తిగా వాటిని బహిష్కరించాలి. అప్పుడే హిందూ ధర్మానికి ఒక గౌరవం, గుర్తింపు ఉంటాయి. సినిమాల్లో హైందవ ధర్మం మీద దాడి జరుగుతోంది. వాల్మీకి రామాయణం, వ్యాస భారతం..భారత సాహిత్య వాఙ్మయానికి రెండు కళ్లు వంటివి. అలాంటి వాటిని వినోదం కోసం వక్రీకరిస్తున్నారు. హిందూ ధర్మాన్ని హననం చేసే సినిమాలను ప్రతి ఒక్కరూ బహిష్కరించాలి. అప్పుడు ఆ సినిమాలకు డబ్బులు రావు. డబ్బులు రాకపోతే ఇలాంటి చిత్రాలను నిర్మాతలు తీయరు' అని ఆయన అన్నారు.

అడవికి రాజు.. డాకు మహారాజ్



బాలకృష్ణ కథానాయకుడిగా బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'డాకు మహారాజ్'. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. బాబీ డియోల్, మకరంద్ దేశ్‌పాండే, ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్ కీలక పాత్రలు పోషించారు. ఈ నెల 12న సినిమా విడుదలవుతోంది. అమెరికాలోని డల్లాస్‌లో ట్రైలర్ విడుదల చేశారు. ఇందులో వింటేజ్ బాలకృష్ణను ప్రజెంట్ చేశారు దర్శకుడు బాబీ. 'అనగనగా ఒక రాజు ఉండేవాడు. చెడ్డవాళ్లంతా ఆయనను డాకు అనేవాళ్లు. మాకు మాత్రం ఆయన మహారాజ్'.. 'ఆయన కింగ్ ఆఫ్ జంగిల్' వంటి సంభాషణలతో ట్రైలర్ ఆసక్తికరంగా ఉంది. ఇందులో విభిన్నమైన గెటప్పుల్లో బాలకృష్ణ కనిపించారు. ఆయన లుక్స్, యాక్షన్ సన్నివేశాలు, విజువల్స్, భావోద్వేగాలు, అద్భుతమైన సంగీతంతో నిండిన ఈ ట్రైలర్ సినిమాపై అంచనాలు పెంచేసింది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: విజయ్ కార్తీక్ కన్నన్, సంగీతం: తమన్.

త్రివిక్రమ్‌పై చర్యలేవి?
'మా'ను ప్రశ్నించిన పూనమ్‌కౌర్




నటి పూనమ్ కౌర్ మరోసారి ఎక్స్ వేదికగా దర్శకుడు త్రివిక్రమ్‌ను.. 'మా'ను ఉద్దేశిస్తూ పోస్టు పెట్టారు. 'త్రివిక్రమ్‌పై ఫిర్యాదు చేసి ఎంతో కాలమైంది. కానీ 'మా' (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) నుంచి ఎటువంటి స్పందన రాలేదు. త్రివిక్రమ్‌పై ఇచ్చిన ఫిర్యాదు విషయంలో 'మా' సంఘం ఆయన్ని ప్రశ్నించలేదు. నా జీవితాన్ని నాశనం చేసి.. ఆరోగ్యాన్ని.. ఆనందాన్ని కోల్పోయేలా చేసిన ఆయనపై ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. పైగా ఆయన విషయంలో చర్యలు తీసుకోకుండా ఉండేలా ఇండస్ట్రీ పెద్దల నుంచి సహకారం అందుతోంది' అని ఆరోపించారు.

'మా'ను లేదా న్యాయస్థానాన్ని ఆశ్రయించండి

ఈ ట్వీట్‌పై 'మా' కోశాధికారి, నటుడు శివబాలాజీ స్పందించారు. 'పూనమ్.. మీరు చేసిన ఫిర్యాదు మాకు అందలేదు. గతంలోనూ మీరు ఫిర్యాదు చేసినట్లు 'మా' రికార్డుల్లో లేదు. న్యాయం దక్కాలంటే మీరు 'మా' లేదా న్యాయస్థానాన్ని ఆశ్రయించండి. ఇలా సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టడం వల్ల ఎటువంటి ఉపయోగం లేదు' అని పేర్కొన్నారు. అయితే, ఈ విషయంపై 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు స్పందించాల్సి ఉంది. కాగా, గతంలోనూ పూనమ్ ఎక్స్ వేదికగా త్రివిక్రమ్‌పై పలు సార్లు ఆరోపణలు చేశారు.

అది అకీరా ఇష్టం




తనయుడు అకీరా నందన్ సినీ అరంగేట్రం కోసం తానూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నాని రేణూ దేశాయ్ అన్నారు. ఓ కార్యక్రమానికి హాజరైన సందర్భంలో ఆమె అకీరా సినీ ఎంట్రీపై స్పందించారు. 'ఎక్కడకు వెళ్లినా అకీరా సినిమా ఎప్పుడు? అనే ప్రశ్న ఎదురవుతోంది. పవన్ కల్యాణ్ అభిమానుల్లానే నేను కూడా అకీరా సినిమాల్లోకి రావాలని కోరుకుంటున్నాను. అయితే అందరి కన్నా ఒక తల్లిగా నేనే ఎక్కువగా కోరుకుంటాను. కానీ సినిమాల్లోకి ఎప్పుడు రావాలనేది అకీరా ఇష్టం. ఏదైనా తను కోరుకున్న విధంగా జరగాలి. అప్పటి వరకూ వేచిచూడండి' అని అన్నారు.

ప్రభుకు బ్రెయిన్ సర్జరీ



తమిళ సీనియర్ నటుడు ప్రభుకు బ్రెయిన్ సర్జరీ జరిగింది. జ్వరం, తలనొప్పితో ఆస్పత్రిలో చేరగా, మెదడులోని ఓ రక్తనాళంలో వాపు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. వెంటనే మైనర్ సర్జరీ చేసి వాపును తొలగించారు. ప్రస్తుతం ఆయన ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు.
- చెన్నై, (ఆంధ్రజ్యోతి)



డిఫరెంట్ కాన్సెప్ట్‌తో..

వరుణ్ సందేశ్ హీరోగా ఆర్యన్ సుభాన్ ఎస్‌కే దర్శకత్వంలో బలగం జగదీశ్ నిర్మిస్తున్న చిత్రం 'కానిస్టేబుల్'. మధులిక వారణాసి హీరోయిన్‌గా పరిచయం అవుతున్నారు. తాజాగా ఈ మూవీ టీజర్‌ను దర్శకుడు త్రినాథరావు నక్కిన రిలీజ్ చేశారు. హత్యకు గురైన ఓ అమ్మాయి కేసును ఛేదించే పోలీస్ కానిస్టేబుల్ పాత్రలో వరుణ్ సందేశ్ కనిపించబోతున్నారని టీజర్ చూస్తే తెలుస్తోంది.

దర్శకత్వ ఆలోచన లేదు
- ఎస్.జె.సూర్య




రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'గేమ్ ఛేంజర్'. దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. ఈనెల 10న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నటుడు ఎస్.జె.సూర్య మీడియాతో ముచ్చటించారు.' డైరెక్టర్ శంకర్‌తో పని చేయాలని ప్రతీ ఒక్క ఆర్టిస్ట్‌కు ఉంటుంది. ఆయన చాలా విజనరీ డైరెక్టర్. రామ్‌చరణ్ అద్భుతమైన నటుడు. ఆయన గ్లోబల్ స్టార్‌గా ఎదిగారు. ఈ చిత్రంలో ఆయన డిఫరెంట్ షేడ్స్‌లో కనిపిస్తారు. గేమ్ ఛేంజర్‌లో అన్ని అంశాలు ఉంటాయి. అందరినీ అలరించేలా ఈ మూవీ ఉంటుంది. పవన్ కళ్యాణ్ గారు మా చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు రావడం ఆనందంగా ఉంది. ఆయన ఎప్పుడూ ప్రజల కోసం ఆలోచిస్తూ ఉంటారు. నాకు నటుడిగా చాలా కంఫర్ట్‌గా ఉంది. దర్శకత్వం గురించి ఏమీ ఆలోచించడం లేదు' అని అన్నారు.

ప్రేక్షకులు మెచ్చే ప్రేమకథ



తమిళ దర్శకుడు విక్రమన్ తనయుడు విజయ్ కనిష్క హీరోగా, గరిమ చౌహాన్ హీరోయిన్‌గా నటిస్తున్న 'కలవరం' చిత్రం షూటింగ్ హైదరాబాద్ సారథీ స్టూడియోలో ప్రారంభమైంది. విజయ్, రాజ్ తిరందాసుపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు చదలవాడ శ్రీనివాసరావు కెమెరా స్విచాన్ చేయగా, నిర్మాత సి.కల్యాణ్ తొలి క్లాప్ ఇచ్చారు, హనుమాన్ వాసంశెట్టి దర్శకత్వంలో సీఎల్ఎన్ మీడియా సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. నిర్మాత శోభారాణి మాట్లాడుతూ 'ఈ సినిమాకు 'కలవరం' పర్ఫెక్ట్ టైటిల్. ఇందులో 70 మంది ఆర్టిస్టులు ఉన్నారు. ప్రేక్షకులు మెచ్చే సినిమా అవుతుంది' అన్నారు.

వైవిధ్యమైన కథతో..



లోహిత్ కల్యాణ్, రాజేశ్ కుంచాడా, జోషిత్ రాజ్‌కుమార్, కైలాష్ వేలాయుధన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రాజుగారి దొంగలు'. లోకేశ్ రనల్ హిటాసో దర్శకత్వంలో నడిమింటి బంగారునాయుడు నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు లోకేశ్ మాట్లాడుతూ "ఈ సినిమా అందరిని మెప్పిస్తుందనే నమ్మకముంది. వైవిధ్యమైన కథతో తెరకెక్కిన సినిమా ఇది" అని చెప్పారు. "ఈ సినిమా మీ అంచనాలకు మించి ఉంటుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిచ్చే చిత్రమిది" అని నిర్మాత బంగారునాయుడు అన్నారు.

బిజినెస్

విజయవాడ ● సోమవారం 6 జనవరి 2025

మార్జిన్లకు ద్రవ్యోల్బణం గండి

ఎఫ్ఎంసీజీ కంపెనీల ఆందోళన



న్యూఢిల్లీ: మూడో త్రైమాసికంలో ఎఫ్ఎంసీజీ కంపెనీల మార్జిన్లకు ద్రవ్యోల్బణం గండి కొట్టనుంది. ద్రవ్యోల్బణం, అధిక ముడిసరకు వ్యయాల కారణంగా అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో తమ మార్జిన్లు ఒక మోస్తరుగా ఉండవచ్చునని ఎఫ్ఎంసీజీ కంపెనీల ప్రతినిధులంటున్నారు. ఈ త్రైమాసికంలో మార్జిన్లు ఒక అంకెకే పరిమితం కావచ్చునని కూడా వారు అభిప్రాయపడుతున్నారు. కొబ్బరి, వెజిటబుల్ ఆయిల్, పామాయిల్ వంటి ముడిసరకు ధరలు 30 శాతం వరకు పెరిగిన కారణంగా ఆ ప్రభావాన్ని తట్టుకునేందుకు డిసెంబరు త్రైమాసికంలో చాలా కంపెనీలు ఉత్పత్తుల ధరలు పెంచాయి. పట్టణ మార్కెట్లలో విని యోగం తగ్గిన సమయంలో ధరలు పెంచడం వల్ల అమ్మకాలు కొంతమేరకు ప్రభావితం కావచ్చునంటున్నారు. అయితే గ్రామీణ మార్కెట్లలో డిమాండ్ పరిస్థితి కాస్తంత మెరుగ్గా ఉంది. ఒకవైపు ఆధునిక ట్రేడ్, ఇ-కామర్స్, క్విక్ కామర్స్ విభాగాలు బలమైన వృద్ధిని నమోదు చేయగా పరిసర కిరాణా దుకాణాలు మాత్రం అమ్మకాలపరంగా అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో ఒత్తిడిని ఎదుర్కొన్నట్టు డాబర్ ప్రతినిధి చెప్పారు. ముడి సరకు ధరల భారం కారణంగా రెండో త్రైమాసికంతో పోల్చితే తమ నిర్వహణా మార్జిన్ ఒక మోస్తరు స్థాయికే పరిమితం కావచ్చునని మారికో ప్రతినిధి అన్నారు. స్థూల మార్జిన్లలో క్షీణత ఊహించిన దాని కన్నా అధికంగానే ఉండవచ్చునన్నారు. ద్రవ్యోల్బణ ఒత్తిడులు, వేతనాల్లో స్వల్ప వృద్ధి, ఇళ్ల అద్దెల పెరుగుదల కారణంగా పట్టణ ప్రాంతాల డిమాండు వృద్ధి కాస్తంత ప్రతికూలంగానే ఉన్నదని నువామా చెబుతోంది. నూనెలు, స్నాక్స్, టీ ధరలు పెరుగుదల కారణంగా వినియోగదారులు చిన్న ప్యాక్ల కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారంటున్నారు. ఇది తమ అమ్మకాలను ప్రతికూలంగా ప్రభావితం చేసిందని కంపెనీలు వెల్లడించాయి.

చలికాలం ఆలస్యంగా ప్రారంభం కావడం కూడా తమ మార్జిన్లకు గండి కొట్టిందని కంపెనీలంటున్నాయి. చలి ఆలస్యంగా ప్రారంభం కావడం వల్ల ఆ కాలంలో అధిక డిమాండు గల బాడీ లోషన్లు, చ్యవన్‌ప్రాష్ విక్రయాలు జోరందుకోలేదని చెబుతున్నాయి. డీసీ బ్రాండ్ల అమ్మకాల్లో ఎదురీదుతున్నాయని, అదే సమయంలో క్విక్ కామర్స్ విక్రయాలు జోరందుకోవడం వల్ల కంపెనీల మార్జిన్లు ఒత్తిడిలో లోనయ్యాయని డెలాయిట్ ఇండియా పార్ట్‌నర్ ఆనంద్ రామనాథన్ అన్నారు. అయితే జనవరి నుంచి ఏప్రిల్ వరకు ఉండే పంటల కాలం వ్యవసాయ కమోడిటీల మార్జిన్ ఒత్తిడిని కొంత మేరకు తగ్గించవచ్చునని, ఇది కమోడిటీ ధరలపై కూడా ఒత్తిడి తగ్గడానికి దారి తీస్తుందని ఆయన చెప్పారు.

ఎంఎస్ఎంఈ ఫార్మా యూనిట్లకు ఊరట

జీఎంపీ ప్రమాణాలకు మరో ఏడాది

న్యూఢిల్లీ: చిన్న, మధ్యతరహా ఫార్మా కంపెనీలకు (ఎంఎస్ఎంఈ) ప్రభుత్వం పెద్ద ఊరట ఇచ్చింది. ఈ కంపెనీలు ఉత్తమ తయారీ విధానాలకు (జీఎంపీ) మారాల్సిన గడువును 2026 జనవరి 1 వరకు పొడిగించింది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఈ మేరకు ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ కంపెనీలు తమ ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేయాలన్నా, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) నిర్వహణలోని కార్యక్రమాలకు ఔషధాలు సరఫరా చేయాలన్నా జీఎంపీ సర్టిఫికేషన్ తప్పనిసరి. ప్రస్తుతం దేశంలో 10,500 ఫార్మా కంపెనీలుంటే అందులో 8,500 ఎంఎస్ఎంఈలు. ఇందులో 2,000 ఎంఎస్ఎంఈలకు మాత్రమే జీఎంపీ సర్టిఫికేషన్ ఉంది.

క్రిస్టల్ చేతికి బేయర్ 'ఇథాక్సిసల్ఫరాన్' బిజినెస్

న్యూఢిల్లీ: బేయర్ కంపెనీకి చెందిన 'ఇథాక్సిసల్ఫరాన్' బిజినెస్‌ను ప్రముఖ అంతర్జాతీయ ఆగ్రోకెమికల్ సంస్థ క్రిస్టల్ క్రాప్ కంపెనీ కొనుగోలు చేసింది. ఈ రసాయన మందును వరి, సజ్జ వంటి పంటల్లో కలుపు మొక్కల నివారణకు ఉపయోగిస్తారు. అయితే ఎంత మొత్తానికి ఈ వ్యాపారాన్ని కొనుగోలు చేసింది కంపెనీ వెల్లడించలేదు.

ఉపాధి కల్పనకు సప్తసూత్ర అజెండా

సీఐఐ బడ్జెట్ కోరికల చిట్టా

న్యూఢిల్లీ: దేశంలో ఉద్యోగాల కల్పనకు కేంద్ర బడ్జెట్‌లో మరిన్ని చర్యలు తీసుకోవాలని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ప్రభుత్వాన్ని కోరింది. సమ్మిళిత అభివృద్ధికి, యువత శక్తి సామర్థ్యాలను మరింత నిర్మాణాత్మకంగా ఉపయోగించుకునేందుకు భారీ స్థాయిలో ఉద్యోగాల కల్పన అవసరమని స్పష్టం చేసింది. 2050 నాటికి మన దేశ 13.3 కోట్ల మందికి ఉపాధి అవకాశాలు కల్పించాల్సి ఉందని గుర్తు చేసింది. ఇందుకోసం ఏడు అంశాలతో ఒక అజెండాను సూచించింది. ప్రస్తుతం కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ ఉద్యోగ, ఉపాధి పథకాలను విలీనం చేసి ఒక సమగ్ర జాతీయ ఉపాధి విధానం తీసుకురావాలని కోరింది. దీనికి తోడు కార్మిక శక్తి అధికంగా ఉండే పరిశ్రమలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, విదేశీ ఉద్యోగాల కోసం ప్రత్యేక సంస్థ ఏర్పాటు వంటి చర్యలు అవసరమని పేర్కొంది.

ప్రత్యేక ఇంటర్న్‌షిప్: దీనికి తోడు కాలేజీల్లో చదువు పూర్తి చేసిన వారి కోసం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంటర్న్‌షిప్ పథకం ప్రారంభించాలని సూచించింది. దీని వల్ల వారికి స్వల్పకాలిక ఉపాధి లభించడంతో పాటు, వృత్తి నైపుణ్యాలు పెంపొందుతాయని సీఐఐ తెలిపింది. ఉద్యోగాల కల్పనకు అధికంగా నిలువు చేసే ఐదు ముఖ్యమైన నిబంధనలను ప్రత్యేక సెక్టార్ చట్టం నుంచి మినహాయించేలా ప్రత్యేక సెక్టార్ తీసుకు రావాలని కూడా కోరింది. రాయితీల వన్ను విధానం ఎంచుకున్న కంపెనీలకూ ఈ మినహాయింపును వర్తింప చేయాలని సూచించింది.

మహిళా ఉపాధి: ఉద్యోగ, ఉపాధి రంగాల్లో మహిళల పాత్ర తక్కువగా ఉండడంపై సీఐఐ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ రంగాల్లో వీరి పాత్ర పెరిగితే దేశ ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతం లభిస్తుందని తెలిపింది. సామాజిక బాధ్యత కింద కంపెనీలు (సీఎస్ఆర్) ఖర్చు చేసే నిధులతో పారిశ్రామిక ప్రాంతాల్లో మహిళల కోసం వసతి సముదాయాలు, చిన్న పిల్లల సంరక్షణ వసతులు ఏర్పాటు చేయడం ఇందుకు బాగా కలిసి వస్తుందని సూచించింది. తాత్కాలిక లేదా కాంట్రాక్టు ఉద్యోగులు (గిగ్ వర్కర్లు), ఓలా, ఊబర్, స్విగ్గీ వంటి ప్లాట్‌ఫామ్ కోసం పని చేసే తాత్కాలిక ఉద్యోగులకూ కార్మిక చట్టాలు వర్తింపచేసి, వారికి సామాజిక భద్రత కల్పించాలని సీఐఐ సూచించింది.

24300 పైన బుల్లిష్

(జనవరి 6-10 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

గత వారం నిఫ్టీ : 24005 (+192)

నిఫ్టీ గత వారం 24226-23460 పాయింట్ల మధ్యన కదలాడి 192 పాయింట్ల లాభంతో 24005 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 24300 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 23948, 23821, 23959, 24189 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 24300 బ్రేక్‌డౌన్ స్థాయి: 23600

నిరోధ స్థాయిలు: 24200, 24300, 24400 (24100 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 23800, 23700, 23600 (23900 దిగువన బేరిష్)

ట్రెండ్ ఫాలో

ఫారం గేటు అమ్మకం ధరలు (రూ. 100 గుడ్లు)



6వ తేదీ			
హైదరాబాద్	475	విజయవాడ	500
వరంగల్	477	గోదావరి	500
చిత్తూరు	543	విశాఖపట్నం	510
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	111	విజయవాడ	113
వరంగల్	111	గుంటూరు	110
కరీంనగర్	111	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	111	చిత్తూరు	82
కర్నూలు	111	నెల్లూరు	87
విశాఖపట్నం	104	అనంతపురం	87
గోదావరి	113		

ఈ వారంలోనూ అప్రమత్తతే మేలు

స్టాక్ మార్కెట్ ఈ వారం మిశ్రమంగా కదలాడే సూచనలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ పరిణామాలను బట్టి సూచీల గమనం ఉంటుంది. రూపాయి బలహీనత, ఎఫ్‌పీఐల అమ్మకాలు, ఆర్థిక మందగమనం ఈ వారం మార్కెట్‌ను ఎక్కువగా ప్రభావితం చేయనున్నాయి. గత వారం రియల్టీ, మెటల్ కంపెనీల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనైతే, ఆటో, ఫైనాన్స్, కన్జ్యూమర్ డ్యూరబుల్స్, ఎఫ్ఎంసీజీ, ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ప్రస్తుతం ఫార్మా, హెల్త్‌కేర్ కంపెనీల షేర్లు బుల్లిష్‌గా కనిపిస్తున్నాయి. ఈ అనిశ్చితి నేపథ్యంలో మదుపరులు అప్రమత్తంగా ఉండడమే మంచిది.

ఈ వారం స్టాక్ రికమెండేషన్లు

ఎన్‌టీపీసీ: జీవిత కాల గరిష్ఠ స్థాయి నుంచి ఎన్‌టీపీసీ షేర్లు ప్రస్తుతం 30 శాతం దిద్దుబాటుకు లోనయ్యాయి. కీలక మద్దతు స్థాయి రూ.300 వద్ద టర్న్ అరౌండ్ అయిన, ఈ కంపెనీ షేర్లు గత నాలుగు సెషన్లుగా అప్‌ట్రెండ్‌లో ట్రేడవుతున్నాయి. గత వారం రూ.339 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.365/385 టార్గెట్‌తో రూ.345 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. స్టాప్ లాస్ : రూ.338.

హెచ్‌సీఎల్ టెక్: ఈ కంపెనీ షేర్లు గత వారం రూ.1,946.65 వద్ద క్లోజయ్యాయి. డాలర్‌తో రూపాయి పతనంతో ప్రస్తుతం ఐటీ రంగం బుల్లిష్‌గా కనిపిస్తోంది. దీంతో ఈ కౌంటర్‌లో ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్స్ క్రమంగా పెరుగుతున్నాయి. రూ.1,950 టార్గెట్‌తో మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.1,860పై స్థాయిలో పొజిషన్లు తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ.1,840.

మ్యాక్స్ హెల్త్: ప్రస్తుతం ఈ కంపెనీ షేర్లు జీవిత కాల గరిష్ఠ స్థాయిలో ట్రేడవుతున్నాయి. స్వల్ప పుల్‌బ్యాక్ తర్వాత మరింత బలం పుంజుకున్నాయి. దీనికి తోడు ప్రస్తుతం హెల్త్‌కేర్ సెక్టార్ బుల్లిష్‌గా ఉంది. గత వారం 1.64 శాతం లాభంతో రూ.1,178 వద్ద ముగిశాయి. రూ.1,250/1,310 టార్గెట్‌తో మదుపరులు రూ.1,180 స్థాయిలో ఈ కౌంటర్‌లో పొజిషన్లు తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ.1,165.

కోటక్ మహీంద్ర బ్యాంకు: గత కొన్ని నెలలుగా సైడ్‌వేస్‌లో ఉన్న ఈ బ్యాంకు షేర్లు ప్రస్తుతం ఆకర్షణీయమైన ధరల్లో లభిస్తున్నాయి. ఈ సంవత్సరం బ్యాంకు ఆర్థిక ఫలితాలు బాగుంటాయని రేటింగ్ సంస్థల అంచనా. రూ.1,970 టార్గెట్‌తో మదుపరులు ఈ కౌంటర్లో రూ.1,850 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ.1,830.

డాబర్: అక్టోబరు గ్యాప్‌డౌన్‌తో ఈ కంపెనీ షేర్లు 26 శాతం మేర పతనమయ్యాయి. ప్రస్తుతం కీలక మద్దతు స్థాయి రూ.500 వద్ద మద్దతు తీసుకుని పుంజుకున్నాయి. గత వారం చివరి నాలుగు సెషన్లలోనూ బలం ప్రదర్శించాయి. 2.25 శాతం లాభంతో రూ.524 వద్ద ముగిశాయి. మదుపరులు రూ.590 టార్గెట్‌తో రూ.528 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. స్టాప్ లాస్ : రూ.510.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

24200 వద్ద నిలదొక్కుకోవడం కీలకం

టెక్ వ్యూ

నిఫ్టీ గత వారం కరెక్షన్‌తో ప్రారంభమై 23,500 కన్నా దిగువన రికవరీ సాధించింది. ఆ తర్వాత బలమైన పునరుజ్జీవం సాధించి వారం మొత్తం మీద 190 పాయింట్ల లాభంతో 24,000 కన్నా పైన క్లోజయింది. ముందు వారం బేరిష్ ట్రెండ్ అనంతరం ఏర్పడిన పుల్ బ్యాక్ రికవరీ ఇది. అయితే కరెక్షన్ అనంతరం నిలకడగా ముగియడం విశేషం. మార్కెట్ కనిష్ఠ స్థాయిల్లో మద్దతు పొందడం వల్ల తక్షణ ప్రమాదం నుంచి కూడా తప్పించుకుంది. స్వల్పకాలిక అప్‌ట్రెండ్ కోసం ఈ వారంలో బలంగా నిలదొక్కుకోవడం అవసరం. అలాగే గత వారం మిడ్‌క్యాప్-100 ఇండెక్స్ 950 పాయింట్లు, స్మాల్ క్యాప్-100 ఇండెక్స్ 280 పాయింట్లు లాభపడ్డాయి. గత శుక్రవారం నాటి ప్రపంచ మార్కెట్ ధోరణులను బట్టి ఈ వారంలో పాజిటివ్ ధోరణికి ఆస్కారం ఉంది. ఇప్పుడు నిఫ్టీ స్వల్పకాలిక నిరోధం 24,200 వద్ద పరీక్ష ఎదుర్కొనవచ్చు.



వి. సుందర్ రాజా

బుల్లిష్ స్థాయిలు: స్వల్పకాలిక పాజిటివ్ ట్రెండ్ కోసం ప్రధాన నిరోధం 24,200 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఆ పైన ప్రధాన నిరోధ స్థాయిలు 24500, 24800.

బేరిష్ స్థాయిలు: బలహీనత ప్రదర్శించినా భద్రత కోసం మద్దతు స్థాయి 24,000 వద్ద కన్సాలిడేట్ అయి నిలదొక్కుకోవాలి. విఫలమైతే అప్రమత్త సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 23,800. ఇక్కడ కూడా విఫలమైతే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది. మరో ప్రధాన మద్దతు స్థాయి 23,500.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం మొత్తం మీద ఈ సూచీ 320 పాయింట్లు మేరకు నష్టపోయినా మద్దతు స్థాయి 50,000 కన్నా చాలా పైన ఉంది. గత వారం 51,000 వద్ద క్లోజ్ కావడం కనిష్ఠ స్థాయిల్లో మద్దతు సాధించిందనేందుకు సంకేతం. స్వల్పకాలిక అప్‌ట్రెండ్ కోసం మైనర్ నిరోధం 51,300 కన్నా పైన నిలదొక్కుకోవాలి. నిరోధం 51,650, ప్రధాన నిరోధం 52,000. మద్దతు స్థాయి 51,000 వద్ద నిలదొక్కుకోలేకపోతే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది.

పాటర్న్: నిఫ్టీ ప్రస్తుతం 50, 200 డిఎంఏల వద్ద పరీక్ష ఎదుర్కొంటోంది. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకోవాలి. 24,200 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిరోధం ఉంది. ఇక్కడ నిలదొక్కుకోవడం అవసరం. సానుకూలత కోసం 23,800 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి.

టైమ్: ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమ వారం స్థాయిలు	
నిరోధం : 24,130, 24200	
మద్దతు : 23,950, 23880	

స్పోర్ట్స్

'టెస్ట్'లపట్ల నిబద్ధత ఉంటే.. దేశవాళీల్లో ఆడాలి

ఆటగాళ్లకు కోచ్ గంభీర్ సూచన



సిడ్నీ: ఏ ఆటగాడైనా దేశవాళీ పోటీల్లో ఆడడం ద్వారా టెస్టు క్రికెట్ పట్ల తమ నిబద్ధతను నిరూపించుకోవాలని భారత జట్టు కోచ్ గౌతమ్ గంభీర్ సూచించాడు. దేశవాళీలకు అత్యధిక ప్రాధాన్యమివ్వకపోతే టెస్టుల్లో నాణ్యమైన ఆటగాళ్లను చూడలేమన్నాడు. ఇక ఫామ్‌లేమితో సతమతమవుతున్న రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇప్పటికీ తమ సత్తా నిరూపించుకోవాలన్న తపనతోనే ఉన్నారని చెప్పాడు. ఇక వచ్చే సమయంలో భవిష్యత్‌లో భారత టెస్టు జట్టులో రోహిత్, కోహ్లీ స్థానాలకు గ్యారెంటీ మాత్రం గంభీర్ ఇవ్వకపోవడం గమనార్హం. పేలవ ఫామ్‌తో ఐదో టెస్టు నుంచి వైదొలగిన రోహిత్‌ను ప్రశంసించాడు.

అలా.. వాళ్ల నోళ్లు మూయించాడు!



మైదానంలో ఆటగా ప్రవర్తించిన ఆస్ట్రేలియా ఫ్యాన్స్‌కు తనదైనరీతిలో బదులిచ్చాడు విరాట్ కోహ్లీ. ఇంతకీ ఏం జరిగిందంటే..సిడ్నీ టెస్టు రెండోరోజు ఆటలో భారత క్రికెటర్ బుమ్రా జేబులు సరి చేసుకుంటుండగా దానిలోంచి ఓ 'పేపర్' లాంటిది వచ్చింది. దాంతో భారత ఆటగాళ్లు 'శాండ్ పేపర్' ఉపయోగిస్తున్నారని ఆసీస్ ఫ్యాన్స్ సోషల్ మీడియాలో ఆరోపణలు గుప్పించారు. ఇక సీన్ కట్‌చేస్తే..ఆదివారం ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో స్మిత్ అవుటయ్యాక తన ప్యాంటు జేబుల్లో, ఇంకా ప్యాంటు లోపల ఏమీ లేదన్నట్టు ఆసీస్ ఫ్యాన్స్‌కు సంజ్ఞ చేయడం ద్వారా కోహ్లీ వాళ్లనోళ్లు మూయించాడు. 2018 దక్షిణాఫ్రికా టూర్‌లో ఆసీస్ బ్యాటర్ బాన్‌క్రాఫ్ట్ శాండ్ పేపర్‌తో బంతికి మెరుపు తెస్తూ కెమెరాకు దొరికిపోయాడు. ఆ ఉదంతంలో నాటి ఆసీస్ కెప్టెన్ స్మిత్, వైస్‌కెప్టెన్ వార్నర్ కూడా దోషులుగా తేలారు. 'శాండ్ పేపర్ గేట్' కుంభకోణంగా పేరుపొందిన ఆ ఘటనలో బాన్‌క్రాఫ్ట్, స్మిత్, వార్నర్‌లపై వేటు పడింది. అలా.. ఆ ఘటనను కోహ్లీ గుర్తు చేస్తూ ఆసీస్ ఫ్యాన్స్‌ను వాకిచ్చాడు.

గవాస్కర్‌ను పక్కనబెట్టారు



భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగే టెస్టు సిరీస్‌లను 1996-97 నుంచి బోర్డర్-గవాస్కర్ ట్రోఫీగా పిలుస్తున్నారు. అయితే తాజా సిరీస్‌లో ట్రోఫీని ఆ ఇద్దరు దిగ్గజాలు సంయుక్తంగా అందిస్తే బావుండేది. కానీ బోర్డర్ ఒక్కడే బహూకరించడం చర్చనీయాంశమైంది. ఆ సమయంలో గవాస్కర్ మైదానంలోనే ఉన్నాడు. అయితే ఈ టెస్టుకు ముందే సన్నీకి ఈ విషయంలో అధికారులు స్పష్టత నిచ్చారు. 'ఒకవేళ భారత్ సిడ్నీ టెస్టులో ఓడినా, డ్రా చేసుకున్నా ట్రోఫీని అందించేటప్పుడు మీ అవసరం లేదని నాకు చెప్పారు. ఆ సమయంలో కాస్త ఆయోమయానికైతే గురయ్యా. ఎందుకంటే ఇది బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ కదా. ఇద్దరం కలిసి అందిస్తే బావుండేది. ఆసీస్ గెలిచినందుకు నేను బాధపడ్డానని కాదు. ట్రోఫీని అందించకుండా అంటూ గవాస్కర్ మీడియాకు తెలిపాడు. మరోవైపు సన్నీని ఆహ్వానించకపోవడంపై క్రికెట్ ఆస్ట్రేలియా స్పందించింది. ఇద్దరినీ వేదికమీదకు పిలిస్తే బావుండేదని, కానీ ఆసీస్ గెలిస్తే బోర్డర్, భారత గెలిస్తే గవాస్కర్ ట్రోఫీని అందించాలని ముందే నిర్ణయించుకున్నాం అని తెలిపింది.



సిరీస్ బెర్త్ చేజారె

ఆఖరి టెస్టులో 6 వికెట్లతో భారత్ ఓటమి

- బరిలోకి దిగని బుమ్రా
- 3-1తో ఆసీస్‌దే సిరీస్
- రెండో ఇన్నింగ్స్ 162/4
- డబ్ల్యూటీసీ ఫైనల్లో కంగారూలు



సిడ్నీ: ఒకే ఒక్క పరిణామం.. భారత టెస్టు జట్టును రెండు విధాలుగా దెబ్బకొట్టింది. ఆస్ట్రేలియాతో దాదాపు మూడు రోజుల్లోనే ముగిసిన ఐదో టెస్టులో భారత్ 6 వికెట్ల తేడాతో పరాజయం పాలైంది. దీంతో ఆసీస్ గడ్డపై 2018, 2020ల్లో వరుసగా రెండుసార్లు దక్కించుకున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని 1-3 తేడాతో ఆతిథ్య జట్టుకు కోల్పోయింది. అంతేకాదు.. వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ ఆశలు కూడా గల్లంతయ్యాయి. డబ్ల్యూటీసీ రేసులో ఉండాలంటే టీమిండియా ఈ టెస్టులో కచ్చితంగా గెలవాల్సిఉంది. దీంతో తొలి రెండు డబ్ల్యూటీసీ ఫైనల్స్‌లో ఆడిన టీమిండియాకు ఈసారి నిరాశే ఎదురైంది. అటు సిడ్నీలో విజయంతో వరుసగా రెండోసారి ఆస్ట్రేలియా జట్టు డబ్ల్యూటీసీ ఫైనల్లోకి అడుగుపెట్టింది. ఈ ఏడాది జూన్ 16 నుంచి లార్డ్స్‌లో జరిగే తుది పోరులో దక్షిణాఫ్రికాతో అమీతుమీ తేల్చుకోనుంది. అంతకుముందు భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 157 పరుగులు చేసింది. 141/6 ఓవర్‌నైట్ స్కోరుతో మూడో రోజు రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ 16 పరుగులు మాత్రమే జోడించి చివరి నాలుగు వికెట్లను కోల్పోయింది. జడేజా (13), నితీశ్ (4) విఫలమయ్యారు. బోలాండ్‌కు ఆరు, కమిన్స్‌కు మూడు వికెట్లు లభించాయి. ఇక భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 185, ఆసీస్ 181 పరుగులు చేశాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా బోలాండ్, ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా బుమ్రా నిలిచారు.

వైపు సిడ్నీ టెస్టును గెలుచుకునేందుకు ఆదివారం ఆసీస్ 162 పరుగుల లక్ష్యం కోసం బరిలోకి దిగింది. ఓపెనర్ ఖవాజా (41), వెబ్‌స్టర్ (39 నాటౌట్), హెడ్ (34 నాటౌట్) రాణించడంతో తమ రెండో ఇన్నింగ్స్‌లో 27 ఓవర్లలోనే 4 వికెట్లకు 162 పరుగులు చేసి గెలిచింది. పేసర్ ప్రసిద్ధ్ మూడు వికెట్లు దక్కాయి. అంతకుముందు భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 157 పరుగులు చేసింది.

దూకుడుగా ముగించారు: వెన్నునొప్పి కారణంగా తాత్కాలిక కెప్టెన్ బుమ్రా ఆదివారం కూడా పెవిలియన్‌కే పరిమితమయ్యాడు. దీంతో అతడు లేని భారత బౌలింగ్ విభాగం చేదనలో ఆసీస్‌ను అడ్డుకోలేకపోయింది. 162 పరుగుల ఛేదనను కంగారూలు కేవలం ఆరు పరుగుల రన్‌రేట్‌తో దూకుడుగా ఆడి రెండో సెషన్‌లోనే ముగించారు. ఓపెనర్లు కాన్‌స్టాస్ (22), ఖవాజా తొలి వికెట్‌కు 3.5 ఓవర్లలోనే 39 పరుగులు జత చేశారు. అయితే స్వల్ప వ్యవధిలో కాన్‌స్టాస్, లబుషేన్ (6), స్మిత్ (4)ల వికెట్లను తీసి పేసర్ ప్రసిద్ధ్ కాస్త ఒత్తిడి పెంచాడు. అప్పటికి ఆసీస్ విజయానికి ఇంకా మరో 58 పరుగుల దూరంలో ఉంది. ఈ దశలో బుమ్రా కూడా మైదానంలో ఉంటుంటే పరిస్థితి మరోలా ఉండేదేమో. కానీ హెడ్, వెబ్‌స్టర్ సంయమనంతో భారత్ కట్టడి చేయలేక పోయింది. ఈ జోడీ ఎలాంటి తడబాటు లేకుండా ఐదో వికెట్‌కు అజేయంగా 58 బంతుల్లో 58 పరుగులు జోడించడంతో ఆసీస్ సంబరాలు ఆకాశాన్నంటాయి.

1 ఆసీస్ గడ్డపై జరిగిన టెస్టుల్లో ఎక్కువ రన్‌రేట్ (6.00)తో 100+ రన్స్ ఛేదించడం ఇదే తొలిసారి.

సిడ్నీలో 129 ఏళ్ల తర్వాత అత్యంత వేగం (1141 బంతుల్లో)గా ముగిసిన టెస్టు ఇదే.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 185
ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 181

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (బి) బోలాండ్ 22; రాహుల్ (బి) బోలాండ్ 13; గిల్ (సి) క్యారీ (బి) వెబ్‌స్టర్ 13; కోహ్లీ (సి) స్మిత్ (బి) బోలాండ్ 6; పంత్ (సి) క్యారీ (బి) కమిన్స్ 61; జడేజా (సి) క్యారీ (బి) కమిన్స్ 13; నితీశ్ (సి) కమిన్స్ (బి) బోలాండ్ 4; సుందర్ (బి) కమిన్స్ 12; సిరాజ్ (సి) ఖవాజా (బి) బోలాండ్ 4; బుమ్రా (బి) బోలాండ్ 0; ప్రసిద్ధ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు: 8; **మొత్తం: 39.5 ఓవర్లలో 157 ఆలౌట్.** **వికెట్ల పతనం:** 1-42, 2-47, 3-59, 4-78, 5-124, 6-129, 7-147, 8-156, 9-156, 10-157; **బౌలింగ్:** స్టార్క్ 4-0-36-0; కమిన్స్ 15-4-44-3; బోలాండ్ 16.5-5-45-6; వెబ్‌స్టర్ 4-1-24-1.

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: కాన్‌స్టాస్ (సి) సుందర్ (బి) ప్రసిద్ధ్ 22; ఖవాజా (సి) పంత్ (బి) సిరాజ్ 41; లబుషేన్ (సి) జైస్వాల్ (బి) ప్రసిద్ధ్ 6; స్మిత్ (సి) జైస్వాల్ (బి) ప్రసిద్ధ్ 4; హెడ్ (నాటౌట్) 34; వెబ్‌స్టర్ (నాటౌట్) 39; ఎక్స్‌ట్రాలు: 16; **మొత్తం: 27 ఓవర్లలో 162/4;** **వికెట్ల పతనం:** 1-39, 2-52, 3-58, 4-104; **బౌలింగ్:** సిరాజ్ 12-1-69-1; ప్రసిద్ధ్ 12-0-65-3; నితీశ్ 2-0-10-0; సుందర్ 1-0-11-0.

తీరని వ్యధ వెనుక..

భారత జట్టు తీరు మారలేదు.. అభిమానుల గుండె కోత తప్పలేదు. 2018లో కోహ్లీ హయాంలో, 2020లో రహానె కెప్టెన్సీలో ఆసీస్ గడ్డపై చారిత్రక విజయాలను చవిచూసిన టీమిండియా.. ఈసారి పేలవ ప్రదర్శనతో దశాబ్దం తర్వాత బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని చేజార్చుకుంది. సొంతగడ్డపై న్యూజిలాండ్ చేతిలో 0-3తో చిత్తుగా ఓడినా.. పెర్త్‌లో జరిగిన తొలి టెస్టులో సూర్తిదాయక విజయం సాధించిన భారత జట్టు మళ్లీ అదే తరహా ప్రదర్శన చేయలేక పోయింది. అందుకు ప్రధాన కారణం జట్టు బ్యాటింగ్ వైఫల్యం. సిరీస్‌లోని మొత్తం ఐదు టెస్టుల్లో ఆరుసార్లు భారత్ 200 పరుగుల స్కోరు కూడా దాటలేకపోవడం దారుణం. పెర్త్ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో 150 రన్స్‌కే కుప్పకూలినా.. రెండో ఇన్నింగ్స్‌లో జైస్వాల్, కోహ్లీ శతకాలతో అద్భుత విజయాన్ని అందుకొంది. కానీ, అడిలైడ్ టెస్టు నుంచి మన బ్యాటింగ్ డొల్లతనం బహిర్గతమైంది. మెల్‌బోర్న్ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటర్ల వైఫల్యం కారణంగా డ్రా చేసుకోవాల్సిన మ్యాచ్‌ను చేజార్చుకొని 1-2తో వెనుకబడింది. తప్పక గెలవాల్సిన సిడ్నీ టెస్టులోనూ ఆశించిన స్థాయిలో ఆడలేక సిరీస్‌తోపాటు వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ అవకాశాలను చేజార్చుకొంది. బ్యాటర్లు సమష్టిగా విఫలమవ్వడం.. వారిని సరిదిద్దలేకలేక పోవడమనే సమస్య ఏళ్లుగా వెంటాడుతోంది. ఆఫ్‌స్టంప్‌పై పడే బంతులను వెంటాడి అవుతున్న బలహీనతను కోహ్లీ అధిగమించలేక పోతున్నాడు. రోహిత్ శర్మ పేలవ ఫామ్‌తో జట్టుకు భారంగా మారాడు. వీరిద్దరి వరుస వైఫల్యాలతో టీమిండియా తొమ్మిది మందితోనే ఆడుతోందన్న సెటైర్లు సోషల్ మీడియాలో పేలుతూనే ఉన్నాయి. బౌలింగ్ విషయానికొస్తే బుమ్రా ఒంటరి పోరాటం చేశాడు. సహచరుల నుంచి కనీస సహకారం అందలేదు. అతడు మినహా జట్టు విజయం కోసం పోటుపడ్డాడు. తొలి టెస్టు విజయంలో బుమ్రా పాత్ర ఎంతో ఉంది. సిరాజ్, ఆకాశ్ దీప్, హర్షిత్ రాణా ఎప్పుడో మెరుపులు తప్ప నిలకడ ప్రదర్శించలేదు. ఆఖరి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో గాయం కారణంగా బుమ్రా బౌలింగ్‌కు దూరం కావడంతో మ్యాచ్ ఫలితం ముందుగానే తెలిసిపోయింది. మొత్తంగా ఈ సిరీస్‌తోనైనా కళ్లు తెరిచి.. జట్టును ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. సంధి దశలో ఉన్న భారత జట్టు కోసం మెరికల్లాంటి యువ ఆటగాళ్లను వెలికితీసి.. టీమిండియా మళ్లీ పుంజుకొనే అవకాశం ఉంది.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

ఓటమితో ముగించిన ఆంధ్ర

విజయ్ హజారే ట్రోఫీ

ముంబై: విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా ఆదివారం హిమాచల్ ప్రదేశ్ జట్టుతో జరిగిన తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు 8 వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆంధ్ర 49.2 ఓవర్లలో 197 పరుగులకు ఆలౌటైంది. వినయ్ కుమార్ (44) టాప్ స్కోరర్. ఛేదనలో హిమాచల్ జట్టు.. ఓపెనర్ అంకిత్ అజేయ శతకం (126 బంతుల్లో 100)తో చెలరేగడంతో 38.1 ఓవర్లలో 201/2 స్కోరు చేసి గెలిచింది. ఇక, గ్రూప్-బిలో ఆంధ్ర 16 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచి టోర్నీ నుంచి నిష్క్రమించింది.

పాక్‌కు కష్టమే!

దక్షిణాఫ్రికాతో రెండో టెస్ట్

కేప్‌టౌన్: కెప్టెన్ షాన్ మసూద్ (102 బ్యాటింగ్), బాబర్ ఆజమ్ (81) పోరాడడంతో దక్షిణాఫ్రికాతో రెండో టెస్ట్‌లో పాలో ఆన్ ఆడుతున్న పాకిస్థాన్ తేరుకుంది. అయినా పాక్‌కు ఈ టెస్ట్‌లో ఓటమినుంచి తప్పించుకోవడం దాదాపు అసాధ్యమే. ఆదివారం మూడో రోజు ఆటకి 213/1 స్కోరుతో ఉన్న పాక్ మరో 208 పరుగులు చేస్తేగానీ దక్షిణాఫ్రికాను రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దింపలేదు. అంతకుముందు ఓవర్‌నైట్ 64/3తో మూడోరోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన పాక్ 194 పరుగులకే కుప్పకూలింది. సఫారీలు మొదటి ఇన్నింగ్స్‌లో 615 పరుగులు చేశారు.

ఏపీ జట్లు శుభారంభం

ఫెడరేషన్ కప్ క్యారమ్స్

నెల్లూరు (విద్య) (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హర్షిణి సమీర్-భవానీ జోడీ ఆదివారం ప్రారంభమైన ఫెడరేషన్ కప్ క్యారమ్స్ పోటీల్లో శుభారంభం చేసింది. మహిళల డబుల్స్‌లో ఈ జోడీ సుమ-సౌమ్యల జంటపై 25-4, 25-6 పాయింట్లతో వరుస గేముల్లో విజయం సాధించింది. అలాగే రాజుల్ కుమార్-కల్యాణ్ (పీఎస్‌పీబీ) జోడీ కీర్తన-చెన్నీ (తమిళనాడు)పై నెగ్గింది. ఇక పురుషుల విభాగంలో ఏపీకి చెందిన రమేష్-జనార్దన్ రెడ్డి జంట ఏపీకే చెందిన శ్యామ్-దావీద్‌బాబుపై విజయం సాధించింది. ఢిల్లీకి చెందిన ఫైజ్ ఖురేషీ-సాహిల్ జోడీ గుజరాత్‌కు చెందిన శివమ్-యశ్ జోడీపై గెలుపొందారు.

స్థానిక నామినేటెడ్ పదవుల్లో
30-40% మనకే రావాలి!

» అలా కేటాయింపులు జరిగేలా చూడండి

» జనసేన నేతలకు అగ్రనాయకత్వం సూచన

అమరావతి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రైమరీ, అగ్రిక ల్చర్ కో-ఆపరేటివ్ సొసైటీలు, మార్కెట్ యార్డుల్లో పార్టీకి గౌరవప్రదమైన స్థానాలు దక్కేలా చూసుకోవాలని.. కనీసం 30-40 శాతం సీట్లు కేటాయించేలా చూడాలని జనసేన అగ్రనాయకత్వం పార్టీ జిల్లా అధ్యక్షులను ఆదేశించింది. పార్టీ అగ్రనాయకులు ఆదివారం ఉదయం జిల్లా అధ్య క్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జులు తదితరులతో టెలికాన్ఫ రెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులకు కీలక సూచనలు చేశారు. ప్రతి నియోజకవర్గంలో ఐదుగురు జనసేన కీలక నేతలు స్థానిక ఎమ్మెల్యేల వద్దకు వెళ్లాలని.. నామినేటెడ్ పోస్టుల్లో పార్టీకి గౌరవప్రదమైన స్థానాలు కేటాయించాలని కోరా లని సూచించారు. ఏదైనా నియోజకవర్గంలో ఎమ్మెల్యే నుంచి స్పందన సరిగ్గా లేకపోతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల పాటు రాష్ట్రాభివృద్ధి, ప్రజల సమస్యలపై దృష్టి పెట్టామని.. ఇప్పుడు పార్టీ బలోపేతానికి అందరం కలిసి పని చేయాలని సూచించారు. ముఖ్యంగా ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో ఎలాగైతే కేడర్ పని చేసిందో.. సర్పంచ్ ఎన్నికల్లో కూడా అలాగే పని చేసేందుకు సిద్ధంగా ఉండాలని పిలు పిచ్చారు. కొంత మంది నాయకులు క్షేత్రస్థాయి సమస్య లను అగ్రనాయకుల దృష్టికి తీసుకొచ్చారు. కొన్ని నియోజ కవర్గాల్లో జనసేన నాయకులకు, కేడర్‌కు గుర్తింపు ఇవ్వడం లేదని, 10 శాతం పనులు కూడా జరగడం లేదని చెప్పారు. ముఖ్యంగా గోదావరి జిల్లాలు, రాయల సీమ జిల్లాల నాయకులు ఈ విషయాన్ని ప్రస్తావించారు. అగ్రనాయకులు స్పందిస్తూ.. కేడర్ నిరాశ చెందకుండా ధైర్యం చెప్పాలన్నారు. ముందుగా కమిటీలు ఏర్పాటు చేసుకుని, తాము చెప్పిన విధంగా ఎమ్మెల్యేల వద్దకు వెళ్లా లని.. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోతే నాయ కత్వం దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు.

జనసేన ప్లీనరీకి స్థలాల పరిశీలన

పిఠాపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మార్చిలో పార్టీ ప్లీనరీ నిర్వహణకు జనసేన సమాయత్తమవుతోంది. దీనికోసం అనువైన స్థలాన్ని ఎంపిక చేసేందుకు ఆ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు కసరత్తు ప్రారంభించారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు, గొల్లప్రోలు బైపాస్‌రోడ్డు, పిఠాపురం పట్టణ శివారులో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కొను గోలు చేసిన స్థలంతో పాటు పిఠాపురం మండలం చిత్రాడ సమీపంలోని ఎస్‌బీ వెంచర్స్ లేఅవుట్ స్థలాలను ఆదివా రం సాయంత్రం ఎమ్మెల్సీ హరిప్రసాద్, కల్యాణం శివశ్రీని వాస్, పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, ఇతర నాయకులు సందర్శించారు. మార్చి 12, 13, 14 తేదీల్లో నిర్వహించే ప్లీనరీకి రాష్ట్రం నుంచే గాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి నాయకులు తరలివచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కార్యక్రమ నిర్వాహణ, సౌకర్యాల కల్పనకు అనువుగా ఉండే ప్రాంతాన్ని ఎంపిక చేయాలని పవన్ క ల్యాణ్ ఆదేశించారు. చిత్రాడ శివారులోని లేఅవుట్ స్థలం అనువుగా ఉంటుందని ప్రాథమికంగా అభిప్రాయానికి వచ్చినా.. పవన్ అభిప్రాయాన్ని బట్టి తుది నిర్ణయం తీసుకోనున్నారు.

రాజకీయ పునరావాసాలుగా ఆలయాలు: గోకరాజు

హిందూ ధర్మానికి మూల స్తంభాలైన ఆలయాలు రాజకీయ పునరావాసాలుగా మారాయని వీహెచ్‌పీ జాతీయ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు ఆవేదన వ్యక్తంచేశారు. ఇటీవలి కాలంలో దేవా లయాలపై జరుగుతున్న దాడులు కలచి వేస్తున్నాయని, వాటిని కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి హిందు వుపైనా ఉందన్నారు. ఉద్యోగులుగా, ట్రస్టు బోర్డు సభ్యులుగా ఉన్న అన్యమతస్థులు, నాస్తికులను తొలగిం చాలని డిమాండ్ చేశారు. హిందూ దేవాలయాల విముక్తి పోరాటానికి విజయవాడలో జరిగిన హైందవ శంఖారావం మెదటి అడుగుగా అభివర్ణించారు. ఈ సభలో త్రిదండి చినజీయర్ స్వామీజీ, కమలానంద భారతిస్వామి, గణపతి సచ్చిదానంద స్వామీజీ, ధర్మాచార్యులు, పీఠాధిపతులు, మఠాధిపతులు, ధార్మిక పెద్దలు, ఆగమ పండితులు, అర్చక స్వాములు, వీహెచ్‌పీ ముఖ్య నేతలతో పాటు రాష్ట్ర మంత్రి సత్య కుమార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, బీజేఎల్పీ నేత విష్ణుకుమార్‌రాజు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి, రాష్ట్రప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్ర హ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ కన్వీనర్‌గా తనికెళ్ల సత్య రవికుమార్ వ్యవహరించారు.



విజయవాడలోని కేసరపల్లి వద్ద వీహెచ్‌పీ భారీ బహిరంగ సభకు హాజరైన జనం



చిన జీయర్, గణపతి సచ్చిదానంద పరస్పర పలకరింపు

ఆలయాల రక్షణకు దీక్ష!

(మొదటి పేజీ తరువాయి)

సమీపంలోని కేసరపల్లి వద్ద విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) భారీ బహిరంగ సభ నిర్వ హించింది. రాష్ట్రం నలుమూలల నుంచీ భారీ సంఖ్యలో హిందువులు తరలివచ్చారు. విదేశీ యుల పాలనలోనూ ఆలయాలను రక్షించుకున్నా మని, కానీ స్వాతంత్ర్యానంతరం మాత్రం వాటిని కాపాడులేకపోతున్నామని స్వామీజీలు, సాధుసం తులు వాపోయారు. వాటి రక్షణకు హిందూ సమాజం నడుం బిగించి దీక్షపూనాలని పిలుపి చ్చారు. ఆలయాలను కాపాడి తీరాలని సభికులతో ప్రతిజ్ఞ చేయించారు. అంతకుముందు సభలో వీహెచ్‌పీ జాతీయ అధ్యక్షుడు అలోక్ కుమార్ ప్రసంగించారు. దేవాలయాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పెత్తనం ఉండకూడదన్నారు. వాటిని ఆయా ప్రభుత్వాలే స్వచ్ఛందంగా హిందువులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. 'అన్ని హిందూ దేవాల యాలకు స్వయంప్రతిపత్తి కల్పించాలి. ఆలయాల ఆదాయం నుంచి ఎండోమెంట్స్ విభాగానికి ఇస్తున్న 12 శాతం నిధులను హిందువులకే ఖర్చు చేయాలి. ఒకప్పుడు ఆలయాల సంరక్షణ పూర్తిగా హిందువులే చూసుకునేవారు. దేవాలయాల్లో పూజా కైంకర్యాలు, ఆగమ శాస్త్రాల ప్రకారం నిర్వహణ చేపట్టే బాధ్యత వీహెచ్‌పీ తీసుకుంటుందా.. బ్రాహ్మణులు తీసుకుంటారా.. అని కొందరు అడుగుతు న్నారు.. హిందూ సమాజం ఒక నెట్‌వర్క్‌గా ఏర్పడి దేవాల యాల సంరక్షణ తీసుకోవాలి' అని ఆయన సూచించారు. 'హిందువులకు అతిపెద్ద ఆలయమైన తిరుమలలో అందరూ బ్రాహ్మణులే ఉన్నారా.. కంచి పీఠంలో బ్రాహ్మణే తర హిందువులు లేరా..' అని నిలదీశారు. వీహెచ్‌పీ అఖిల భారత ప్రధాన కార్యదర్శి మిలింద్ పరాండే మాట్లాడుతూ.. మన సమాజంలో శక్తిమంతమైన ఆలయాలను విదేశీ యులు స్వాతంత్ర్యానికి పూర్వం చేతుల్లోకి తీసుకుంటే.. ఆ తర్వాత దురదృష్టవశాత్తూ ప్రభుత్వాలు పెత్తనం చేస్తున్నా యన్నారు. వాటిని తిరిగి హిందూ సమాజానికి ఇవ్వాల్సిం దిగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు విన్నవించినట్లు చెప్పారు. 'విదేశీ సంస్కృతి ప్రభావం వల్ల మన సమాజంలో సహజీవనాలు, మాదక ద్రవ్యాల వినియోగం, కుల వివక్ష, లవ్ జీహాద్ లాంటి దుర్మార్గాలు అధికమవుతున్నాయి. దేశంలో హిందువుల జననాల రేటు తగ్గుతోంది. హిందూ సమాజం ఉంటేనే దేవాలయాలను రక్షించుకుని సంస్కృతిని కాపాడుకుం టుంది' అని పేర్కొన్నారు.



ఒకప్పుడు ఆలయాల్లో గురుకు లాలు, గోశాలలు ఉండేవి. సాంస్కృ తిక కార్యక్రమాలు, వివాహాలు, జరి గేవి. గ్రామ పెద్దలు న్యాయమైన తీర్పులు అక్కడే ఇచ్చేవారు. ప్రభు త్వాలు ప్రవేశించి ఎండోమెంట్ చట్టా లను రుద్ది అన్య మతస్థులను పోషి స్తున్నాయి. - వీహెచ్‌పీ జాతీయ అధ్యక్షుడు అలోక్‌కుమార్

ఆలయం సంస్కృతికి ఆధార స్తంభం

'ప్రపంచం సుఖసంతోషాలతో ఉండాలంటే విశ్వ కల్యాణం కోసం కృషి చేసే భారతదేశం సురక్షితంగా ఉండాలి.. అందుకు హిందూ ధర్మం మరింత భద్రంగా ఉండాలి..' అని అయోధ్య రామాలయ కోశాధికారి గోవింద దేవ్ గిరిజీ మహరాజ్ అన్నారు. 'విశ్వానికి భారతదేశం అందించిన జ్ఞానజ్యోతి.. శాస్త్రాలు, సాధువులు, గోమాత, తీర్థయాత్రలు, దేవాలయాలు అనే ఐదు కేంద్రకాలతో ఆవి ర్భవించింది. దేవాలయం భగవంతుడి నివాసం. మన సంస్కృతికి ఆధార స్తంభం' అని చెప్పారు.

తీర్మానాలివే..

విజయవాడ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): హైందవ శంఖా రావం సభ చివరిలో నిర్వాహక కమిటీ డిక్లరేషన్‌ను ప్రకటిం చింది. 12 అంశాలతో కూడిన ఈ డిక్లరేషన్‌ను వీహెచ్‌పీ కేంద్రీయ సంఘటనా కార్యదర్శి కోటేశ్వరశర్మ వేదికపై విని పించారు. హైందవ సమాజం, సాధు సంతులు, న్యాయవే త్తలు, పీఠాధిపతుల సూచనలతో రూపొందించిన దేవాల యాల స్వయంప్రతిపత్తి కల్పన చట్టానికి సంబంధించిన ముసాయిదాను ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి అందించినట్లు తెలిపారు. తర్వాత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కూడా దీనిపై చర్చించామన్నారు. ముసా యిదాను కేంద్ర ప్రభుత్వానికి సైతం అందించామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై నిర్ణయం తీసుకు నేలోపు, హైందవ సమాజం ప్రభుత్వాలపై ఏయే అంశాలపై ఒత్తిడి తీసుకురావాలో పేర్కొంటూ పలు తీర్మానాలను డిక్లరే షన్‌లో పొందుపరిచారు. 'హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ చట్ట సవరణ చేయాలి. ఆలయాల ఆస్తులు, వ్యవస్థలపై దాడులను ఖండించాలి. చట్టవిరు ద్ధంగా దాడులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. వి నాయకచవితి, దసరా వేడుకలకు ఆంక్షలు విధించడం తగదు. ఆలయాల్లో పూజలు, ప్రసాదాలు, కైంకర్యాలు భక్తిశ్ర ద్ధలతో చేయాలి. హిందూ ఆలయాల్లో అన్యమత ఉద్యోగు లను వెంటనే తొలగించాలి. హిందూ ధర్మం పాటించే వారినే ట్రస్టు బోర్డులో సభ్యులుగా నియమించాలి. వాటిలో రాజకీ యేతర ధార్మిక వ్యక్తులకు చోటు కల్పించాలి. ఆలయాల ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూడాలి. అన్యాక్రాంతమైన ఆస్తులను సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా స్వాధీనం చేసుకుని ఆలయాలకు అప్పగించాలి. ఆలయాల ఆదా యాన్ని ధార్మిక కార్యక్రమాలకే వాడాలి. నిధులను ప్రభుత్వ కార్యకలాపాలకు మళ్లించకూడదు' అని తీర్మానాలు చేశారు.

ట్రస్టు బోర్డులు
వీఐపీల సేవలకా?

» ఆక్రమణల నుంచి ఆలయాలకు విముక్తి

» చినజీయర్ స్వామీజీ పిలుపు

విజయవాడ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో ట్రస్టు బోర్డు పాలక వర్గాలు దేవుడి సేవలను వీఐపీ లకు దగ్గర చేస్తూ, పేదలకు దూరం చేస్తున్నాయని చినజీయర్ స్వామి అన్నారు. ఆదివారం కృష్ణా జిల్లా కేసరపల్లిలో నిర్వహించిన 'హైందవ శంఖారావం' సభలో ఆయన ప్రసంగించారు. తిరుపతిలో చైర్మన్ ఒకరు తన హయాంలో 4.50 లక్షల మందికి వీఐపీ దర్శనాలను కల్పించారని విన్నామని, డబ్బున్న వారికి దర్శనాలు చేయించేందుకే దేవుడి దగ్గర ఉన్నామా? అని ప్రశ్నించారు. వీఐపీ దర్శనాల పేరిట పేదలను దేవుడికి దూరం పెడితే.. వారు ఇతర మతాల్లోకి ఎందుకుపోరని ప్రశ్నించారు. వీఐపీల సేవలో తరించే వారు ట్రస్టుబోర్డు సభ్యులుగా పనికిరారన్నారు. దేశంలో స్వాతంత్ర్యం రాకముందే 1718లో దేవదాయ చట్టాన్ని తీసుకొచ్చారన్నారు. 1840లో మేనేజ్‌మెంట్ పేరుతో రాజకీయ నాయకులు, ఆఫీసర్లను కమిటీల్లోకి తీసుకురావటం జరిగిందన్నారు. నేడు ఆలయాలన్నీ పరాధీనమైపోయాయన్నారు. వాటికి స్వతంత్ర ప్రతి పత్తి కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దేవాల యాలకు సంబంధించిన భూములు 15 లక్షల ఎక రాలు ఉండగా, ప్రస్తుతం 4.50 లక్షల ఎకరాలు మాత్రమే మిగిలాయని తెలుస్తోందని తెలిపారు. కమ లానందభారతి స్వామీజీ మాట్లాడుతూ రాష్ట్రంలో దేవ దాయ శాఖనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. శ్రీకృష్ణదేవరాయలు, కాకతీయులు, పల్లవులు, చోళులు, జమీందార్లు, ప్రజలు సొంతంగా కట్టించిన ఆలయా లపై ప్రభుత్వ పెత్తనమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవదాయ, ధర్మాదాయ చ ట్టం పేరులో హిందూ అనే పదాన్ని తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గణపతి సచ్చిదానంద స్వామీజీ మాట్లా డుతూ... రాష్ట్రవ్యాప్తంగా ప్రతి పల్లెలో దేవాలయాలు న్నాయని, వీటిలో ఎన్నో మహిమాన్విత ఆలయాలు ఉన్నాయని చెప్పారు. ఆలయాలను సంరక్షించుకోవటా నికి చేస్తున్న ఈ ప్రయత్నం కొనియాడదగినదని, దత్తుడి ఆశీర్వచనంతో పోరాటం ఫలించాలని ఆకాంక్షిం చారు. రాష్ట్ర మాజీ చీఫ్ సెక్రటరీ ఎల్వీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ... 1984లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం చల్లా కొండయ్య కమిషన్‌ను ఏర్పాటు చేసిందని, 1987లో దేవదాయ ధర్మాదాయ చట్టాన్ని తీసుకువచ్చా రన్నారు. ఈ చట్టం ద్వారా దేవాలయ వ్యవస్థలను నిర్వీర్యం చేశారని, హైందవుల హక్కులను కాలరాశా రని మండిపడ్డారు.



విశాఖపట్నంలోని కేంద్ర కారాగారం వద్ద అధికారులతో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత


విశాఖ జైల్లో గంజాయి మొక్క

» జైలు సందర్శనలో గుర్తించిన హోం మంత్రి అనిత

విశాఖపట్నం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని కేంద్ర కారా గారం లోపల గంజాయి మొక్క కనిపించడం ఆందోళనకు దారితీసింది. హోం మంత్రి అనిత ఆదివారం కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. జైలు లోపల ఆమె కలియ తిరుగుతుండగా నర్మద బ్లాక్ వద్ద గంజాయి మొక్కను చూసి అవాక్కయ్యారు. జైలు ఆవరణలో గంజాయి మొక్క ఎలా పెరిగిం దని అధికారులను ప్రశ్నించినట్టు తెలిసింది. ఖైదీలు ఎవరో గంజాయి విని యోగించినప్పుడు గింజలు పడి, మొక్క మొలిచి ఉంటుందని జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్ వివరించినట్టు సమాచారం. జైలులోని అన్ని బ్లాక్‌లతో పాటు ఆవరణను మంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం, జైలు బయట మీడియాతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ తప్పిదాల కారణం గానే జైలులో పరిస్థితి ఇలా తయారైందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే జైలులో పరిస్థితులను గాడిలో పెట్టడంతో పాటు ఖైదీల రక్షణకు చర్యలు ప్రారంభించినట్టు తెలిపారు. ఖైదీల వద్ద 10 రోజుల కిందట ఒకసారి, 4 రోజుల కిందట మరోసారి సెల్‌ఫోన్లు బయట పడ్డాయని, వీటిపై దర్యాప్తు ప్రారంభించామని, 15 రోజుల్లో నివేదిక వస్తుం దని వివరించారు. "ఫోన్లు ఎవరు వినియోగించారు? ఎవరితో మాట్లాడారు? వారికి వాటిని ఎవరు సరఫరా చేశారు వంటి వివరాలన్నీ బయటపడ తాయి" అని చెప్పారు. ఇందులో ఎవరి ప్రమేయం ఉన్నా వదిలిపెట్టే పరి స్థితి లేదన్నారు. జైలు ఆవరణలో గంజాయి మొక్క కనిపించిందని, సిబ్బంది సమర్థంగా విధులు నిర్వర్తించకపోవడమే దీనికి కారణమని, వారు నిర్ల క్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేదిలేదన్నారు. జైలులో వరుస ఘటనల నేప థ్యంలో బాధ్యులైన జైలు సూపరింటెండెంట్‌తోపాటు అదనపు సూపరింటెం డెంట్‌లను ఇటీవల సస్పెండ్ చేశామని తెలిపారు. జైలులో ప్రక్షాళన ప్రారం భించారని, సిబ్బందిని సైతం తనిఖీ చేస్తూ జైలులోకి గంజాయి, సెల్‌ఫో న్‌లు వంటివి వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారని వివరిం చారు. యూనిఫాం సర్వీసులో ఉన్నవారు ధర్నాలు, ఆందోళనల్లో పాల్గొనకూ డదని తెలిపారు. పది రోజుల్లో జైలు ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. అదేవిధంగా విశాఖ జైలు నుంచి కొంతమంది ఖైదీ లను రాజమహేంద్రవరం జైలుకు తరలిస్తామని తెలిపారు.

పోలవరం పరిహారంలో అవినీతికి తావులేదు

» ఉత్తరాంధ్రకు, సీమకు తాగు, సాగునీరు అందిస్తాం: మంత్రి నిమ్మల



పాలకొల్లు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వా సితులకు రూ.వెయ్యికోట్ల పరిహారం సొమ్ము పంపిణీలో ఏ విధమైన అవినీతికీ, దళారీ వ్యవస్థకు తావులేకుండా ఉండాలన్న ఉద్దేశంతోనే సీఎం చంద్రబాబు నేరుగా బ్యాంకుల్లోనే జమ చేసేలా నిర్ణయం తీసుకున్నారని జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గంలో ఆది వారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు సంక్రాంతి కానుకగా రూ.1,000 కోట్ల పరిహారం సొమ్మును పంపిణీ చేసిన ఘనత సీఎంకే దక్కుతుంద న్నారు. జగన్ ప్రభుత్వంలో నిర్వాసితులకు పైసా విదల్చలేదని చెప్పారు. పాదయాత్రలో రూ.10లక్షలు ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చాక నిర్వాసి తులను పట్టించుకోకపోవడంతో గత ఎన్నికల్లో జగన్‌కు గుణపాఠం చెప్పార న్నారు. ప్రాజెక్టును పూర్తి చేసి అటు ఉత్తరాంధ్ర, ఇటు రాయలసీమకు గోదా వరి జలాలు మళ్లించి తాగు, సాగునీరుగా అందిస్తామని తెలిపారు.

● నాడు చర్యలు శూన్యం

గత ఐదేళ్లలో దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా దాని మూలాలు ఆంధ్రప్రదేశ్‌లో ఉండేవి. జగన్ పాలనలో రాష్ట్రం గంజాయి హబ్‌గా మారిందనే పేరుంది. నాడు గంజాయి నిర్మూలనకు సరైన చర్యలు చేపట్టకపోవడమే దీనికి కారణమనే విమర్శలున్నాయి.

● నేడు నిర్మూలనే లక్ష్యం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గంజాయిని సమూ లంగా నిర్మూలించడంపై దృష్టిసారించింది. హోం మంత్రి అనిత నేతృత్వంలో మంత్రి వర్గ ఉపసంఘాన్ని నియమిం చింది. ఐజీ రవికృష్ణ నేతృత్వంలో 'ఈగల్' పేరిట స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

● యాక్షన్ స్టార్ట్

కూటమి ప్రభుత్వ ఆదేశాలతో మన్యంలో స్థానిక అధికార యంత్రాంగం కఠిన చర్యలు తీసు కుంటోంది. గంజాయి తోటలను డ్రోన్ల ద్వారా గుర్తించి ధ్వంసం చేస్తు న్నారు. తనిఖీలను ముమ్మరం చేసి గంజాయి రవాణా చేస్తున్న స్మగ్ల ర్లను అరెస్ట్ చేసి, సరుకు స్వాధీనం చేసుకుంఖున్నారు. మరోవైపు గంజాయి మత్తు, సాగు నుంచి బయటపడేలా అవగాహనా కార్యక్ర మాలు చేపడుతున్నారు.

● గంజాయి తోటలు ధ్వంసం

గత ఏడాది జూన్ 12 నుంచి ఇప్పటివరకూ అల్లూరి జిల్లాలో 12,491 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. 444 మందిని అరెస్టు చేశారు. డ్రోన్ల ద్వారా అడవుల్లో 32 ఎకరాల్లో గంజాయి తోటలను గుర్తించి దహనం చేశారు.

● ఒడిశా నుంచి ఏపీ మీదుగా

కూటమి ప్రభుత్వం గట్టిగా వ్యవహరించడంతో మన్యంలో గంజాయి సాగు తగ్గుతోంది. అయితే సరిహ ద్దుల్లో ఉన్న ఒడిశాలో మరింత అధికమైంది. ఆ గంజా యిని ఏపీ మీదుగా ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారు. కట్టడి చేయడానికి అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టిసా రిస్తోంది.

గంజాయిపై యుద్ధం!

(మొదటి పేజీ తరువాయి)

తగ్గుతోంది. ఒకప్పుడు గంజాయి ఖిల్లాగా పేరొందిన అల్లూరి జిల్లాలో ఇప్పుడు మారుమూల గ్రామాల్లో సైతం గిరిజనులు దాని జోలికి వెళ్లడం లేదు. గంజాయి కట్టడిలో స్థానిక పోలీసులు, అధికార యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తు న్నారు.



శీలావతి రకం ఎండు గంజాయి

కూటమి ప్రభుత్వం వచ్చాక గంజాయి నిర్మూలనకు హోం మంత్రి వంగలపూడి అనిత నేతృత్వంలో మంత్రులు లోకేశ్, కొల్లు రవీంద్ర, గుమ్మిడి సంధ్యారాణి, సత్యకుమార్‌లతో మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఉపసంఘం సిఫారసు మేరకు ప్రభుత్వం స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసింది. గత ఏడాది డిసెంబరు 11న అమరావతిలో జరిగిన కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు గంజాయి నిర్మూలన గురించి ప్రస్తావించారు. ఇటీ వల అల్లూరి జిల్లా అనంతగిరి మండలంలో పర్య టించిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గంజాయికి యువత దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. హోం మంత్రి అనిత రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారు లతో పలుమార్లు సమావేశాలు నిర్వహించారు. దీంతో అధికార యంత్రాంగం గంజాయి నిర్మూల నను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అవసరమైన చర్యలు చేపడుతోంది.

మూడు మార్గాల్లో చర్యలు

గిరిజన ప్రాంతంలో గంజాయి సాగు, రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రస్తుతం పోలీసులు మూడు మార్గాల్లో చర్యలు చేపడుతున్నారు. అల్లూరి జిల్లా లోని మారుమూల ప్రాంతాల్లో గంజాయి తోటలను డ్రోన్ల ద్వారా గుర్తించి ధ్వంసం చేస్తున్నారు. అదే సమయంలో జిల్లా వ్యాప్తంగా ప్రతి స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. గంజాయి తరలిస్తున్న వారిని పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నారు. మరోవైపు గంజాయి సాగు, రవాణా, వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి గిరిజన రైతులు, ప్రజలు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. అలాగే పోలీసు స్టేషన్ల స్థాయిలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు, రైతులతో 'పరివర్తన' పేరిట సమావే శాలు నిర్వహిస్తున్నారు. జిల్లా కలె క్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్, ఎస్పీ అమిత్‌బర్ధార్ యంత్రాంగాన్ని నిత్యం అప్రమత్తం చేస్తూ గంజాయి నిర్మూలన కార్యాచ రణను పర్యవేక్షిస్తున్నారు. గత ఏడాది జూన్ 12 నుంచి ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా 156 కేసులు నమోదు చేసి 12,491 కిలోల గంజాయిని, మూడు లీటర్ల గంజాయి లిక్విడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణాకు వినియోగించిన 20 కార్లు, 94 బైకులు, 21 ఆటోలు, 3 భారీ వాహనాలు సీజ్ చేశారు. గతంలో గంజాయి కేసుల్లో నిందితులుగా ఉంటూ పోలీసుల కళ్లు గప్పి తిరుగుతున్న 145 మందిని అరెస్టు చేశారు. 202 మారుమూల గ్రామా లను పోలీస్ బృందాలు స్వయంగా పరిశీలించాయి. 4 డ్రోన్లతో ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో సుమారు 900 ఎకరాల్లో పంట భూములను పరిశీ లించారు. ఈ క్రమంలో జి.మాడుగుల, పెదబయలు ప్రాంతాల్లోని అడవుల్లో 32 ఎకరాల్లో గంజాయి తోటలు ఉన్నట్టు గుర్తించి దహనం చేశారు. దీంతో గంజాయి సాగుకు ఎవరూ సాహసించడం లేదు.

స్మగ్లర్ల ఆస్తుల జప్తు!

రాష్ట్రాన్ని గంజాయిరహితం చేయడంలో భాగంగా స్మగ్లర్ల ఆస్తులను జప్తు చేయడంతో పాటు సాగుదా రులను గుర్తించి వారికి ప్రభుత్వ పథకాలను రద్దు చేయాలనే యోచనలో కూటమి ప్రభుత్వం ఉంది. విశాఖ రేంజ్ పరిధిలోని ఉన్నతాధికారులతో ఇటీవల రెండుమార్లు ప్రత్యేక సమావేశాలు నిర్వహించిన డీఐజీ గోపినాథ్ జెట్టి ఇదే విషయాన్ని స్పష్టంచేశారు.

ఒడిశా నుంచి ఆంధ్రాకు

కూటమి ప్రభుత్వం వచ్చాక మన్యంలో గంజాయి సాగు తగ్గు తుండగా, సరిహద్దుల్లో ఉన్న ఒడిశా లో మరింత ఎక్కువైంది. అక్కడి ప్రభుత్వం పెద్దగా చర్యలు చేపట్టక పోవడంతో గంజాయి విచ్చలవిడిగా సాగు చేస్తున్నారు. ఆంధ్రాను ఆను కుని ఉన్న ఒడిశా భూభాగంలో సుమారు ఐదు వేల ఎకరాల్లో గంజాయి సాగవుతు న్నదని అంచనా. దానిని ఆంధ్రప్రదేశ్ మీదుగా ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారు. ఒడిశా నుంచి ఇతర ప్రాంతాలకు గంజాయిని రవాణా చేయాలంటే అల్లూరి జిల్లాను దాటుకుని వెళ్లాల్సిందే. అల్లూరి, అనకాపల్లి, విశాఖ జిల్లాల ద్వారా దేశంలోని పలు రాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది. ఇటీవల కాలంలో ఒడిశాకు చెందిన గంజాయి, స్మగ్లర్లు ఎక్కువగా పట్టుబడుతున్నారు. ఈ నేపథ్యంలో గంజాయి సాగును అరికట్టేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఒడిశా ప్రభుత్వాన్ని కోరాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది.

ఐజీ నేతృత్వంలో స్పెషల్ టాస్క్‌ఫోర్స్

రాష్ట్రంలో గంజాయి వాసన లేకుండా చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ఇటీవల ఐజీ ర్యాంకు అధి కారి ఆకే రవికృష్ణ నేతృత్వంలో 'ఈగిల్' (ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్ మెంట్) పేరిట ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. రాజధాని అమరావతిలో ప్రధాన కార్యాల యంతో పాటు రాష్ట్ర స్థాయి టాస్క్‌ఫోర్స్ కార్యా లయం ఏర్పాటు చేస్తారు. అదే తరహాలో టాస్క్ ఫోర్స్ కార్యాలయాలను పాడేరు, విశాఖలోనూ ఏర్పాటు చేస్తారు. ప్రతి జిల్లా కేంద్రంలోనూ ఎస్‌ఐ స్థాయి అధికారి నేతృత్వంలో నార్కోటిక్ సెల్‌ను ఏర్పాటు చేయనున్నారు. గంజాయి మూలాలను గుర్తించి సమూలంగా నిర్మూలించే దిశగా 'ఈగిల్' వ్యవస్థ 450 మంది అధికారులు, సిబ్బందితో ప్రత్యేక కార్యాచరణతో రంగంలోకి దిగనుంది.

వైసీపీ పాలనలో గంజాయి హబ్‌గా..

వైసీపీ ఐదేళ్ల పాలనలో గంజాయి నిర్మూలనకు చర్యలు తీసుకో లేదు. ఒడిశాకు ఆనుకుని ఉన్న జీకే వీధి, జి.మాడుగుల, పెదబ యలు, ముంచంగిపుట్టు, హుకుంపేట, చింతపల్లి మండలాల్లోని మారుమూల గ్రామాల్లో అధిక విస్తీర్ణంలో గంజాయి సాగు చేస్తుం డేవారు. ఆరు మండలాల్లోని 151 గ్రామాల్లో 3వేల ఎకరాల్లో గంజాయి సాగు చేస్తున్నారని అధికారులు అప్పట్లో ప్రకటించారు. వాస్తవానికి అంతకు పదిరెట్లు ఎక్కువగా గంజాయి సాగు అవు తోందని, కేవలం ఒడిశాను ఆనుకుని ఉన్న పల్లెల్లోనే పది వేల ఎక రాల్లో గంజాయి సాగు చేస్తున్నారని తర్వాత గుర్తించారు. అనం తరం పోలీసు అధికారులు నిర్వహించిన రహస్య సర్వేలో 25 వేల ఎకరాల్లో గంజాయి సాగవుతున్నట్లు తేలింది.

సర్కారీ కొలువుల జాతర!

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వడంతో పాటు పాతవాటిని పూర్తిచేయడం ప్రస్తుతం ఏపీపీఎస్సీకి పెద్ద బాధ్యతగా మారింది.

ఈ పోస్టులకు కొత్త నోటిఫికేషన్లు

జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్-7, ఇంటర్ విద్యలో లైబ్రేరి యన్ సైన్స్ జూనియర్ లెక్చరర్- 2, మున్సిపల్ అకౌంట్స్ సబార్డినేట్ సర్వీసెస్-11, అగ్రికల్చర్ ఆఫీసర్-10, హార్టిక ల్చర్ ఆఫీసర్-2, ఫిషరీస్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్-3, గ్రౌండ్ వాటర్ టెక్నికల్ అసిస్టెంట్-4, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్-100, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్-256, ఫారెస్ట్ అసిస్టెంట్ బీట్ ఆఫీ సర్-435, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్, సీనియర్ సిటిజన్ శాఖలో గ్రేడ్-1 వార్డెన్-1, దేవదాయశాఖ ఈవో-7, మైన్స్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్-1, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్-1, ఫారెస్ట్ తానే దార్-10, ఫారెస్ట్ గ్రేడ్-2 డ్రాఫ్ట్‌మెన్- 13, బీసీ వెల్ఫేర్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్-1, జైళ్ల శాఖ జూనియర్ అసి స్టెంట్-1, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్-1 పోస్టు లకు త్వరలో నోటిఫికేషన్లు జారీకానున్నాయి. ఎస్సీ వర్గీక రణ ప్రక్రియ అనంతరం ఈ నోటిఫికేషన్లను ఏపీపీఎస్సీ విడుదల చేయడానికి సిద్ధమైంది.

పాత నోటిఫికేషన్ల వివరాలివీ..

2023లో ఏపీపీఎస్సీ అనేక నోటిఫికేషన్లు జారీ చేసింది. ఐదేళ్లలో ఒక్క గ్రూప్-2 పోస్టు భర్తీచేయని జగన్ ప్రభుత్వం ఎన్నికల వేళ నిరుద్యోగులను ఆకర్షించడమే లక్ష్యంగా 987 పోస్టులకు గతేడాది జూలైలో ఏపీపీఎస్సీ ద్వారా నోటిఫికేషన్ జారీ చేయించింది. అలాగే డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టులు 38, పీసీబీలో సహాయ పర్యావరణ అధికారి పోస్టులు 21, పీసీబీలో గ్రేడ్-2 అన లిస్ట్ పోస్టులు 18, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు 37, ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ 20, మెయిన్స్ జరగాల్సిన గ్రూప్-1 పోస్టులు 89, పాలిటెక్నికల్ కాలేజీల్లో లెక్చరర్ పోస్టులు 99, ఇంటర్ విద్యలో జూని యర్ లెక్చరర్లు 47, డిగ్రీ కాలేజీల్లో లెక్చరర్లు 290, ఇతర శాఖల్లో మరికొన్ని పోస్టులున్నాయి.

జూన్ నాటికి పూర్తయ్యేలా షెడ్యూలు


ఇప్పటికే జారీచేసిన నోటిఫికేషన్లను ఈ ఏడాది జూన్ నాటికి పూర్తిచేయాలని ఏపీపీఎస్సీ లక్ష్యంగా పెట్టుకుంది. గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష ఫిబ్రవరి 23న జరుగుతుంది. డీవైఈవో పోస్టులు, పర్యావరణ ఇంజనీర్ పోస్టుల పరీ క్షలు మార్చిలో, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పరీక్ష ఏప్రిల్ 15న, ఎన్టీఆర్ యూనివర్సిటీ జూనియర్ అసిస్టెంట్ పరీక్ష ఏప్రిల్ 16న, గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు మే నెలలో, జూనియర్ లెక్చరర్లు, డిగ్రీ లెక్చరర్ పోస్టుల పరీక్షలు జూన్‌లో నిర్వ హించేలా షెడ్యూలు రూపొందించింది. అలాగే కొత్త నోటి ఫికేషన్లను జూలై నుంచి డిసెంబరు నాటికి పూర్తిచేయ నుంది. అయితే త్వరలో విడుదల చేసే డీఎస్సీ పరీక్షల తేదీలు, ఏపీపీఎస్సీ పరీక్షలు ఒకేసారి రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

మిగిలిన ఉద్యోగాలపైనా కసరత్తు

ఇప్పటికే ప్రకటించిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్ త్వరలో విడుదల కానుంది. 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ విడుదల చేసేందుకు ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే నిర్ణయం తీసుకుంది. షెడ్యూలు ప్రకారం ఇప్పటికే జారీ కావాల్సి ఉండగా ఎస్సీ వర్గీకరణ కోసం ప్రక్రియ ఆగింది. వర్గీకరణ కసరత్తు పూర్తయిన వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తారు. అలాగే యూనివర్సిటీలు, ఆర్జీయూకేటీల్లో 3వేలకు పైగా ఖాళీలను కూడా ఈ ఏడాదే భర్తీ చేసే అవకాశం ఉంది.

సెల్యూట్ సర్!

రిటైరైన వెంటనే సైకిల్‌పై ఇంటికి.. ఐజీ వెంకట్రామి రెడ్డి సింప్లిసిటీ



- నిజాయతీ ఊపిరిగా బతికిన పోలీసు అధికారి

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): డబ్బు సంపాదన.. దర్పం.. రాజకీయ సాన్నిత్యం.. కుటుంబ స్వార్థం లాంటివి ఎక్కువగా కనిపిస్తున్న పోలీసు శాఖలో అవేవీ వద్దనే మహానుభావులు చాలా అరుదు!. ఆదాయం వచ్చే పోస్టింగ్ కోసం పైరవీలు చేస్తూ లంచాలతో ప్రజల్ని పీడించుకుతినే ఖాకీలున్న చోట.. సమాజ సేవ తప్ప ఇంకేమీ వద్దనే రక్షకభటులూ ఉన్నారంటే ఆశ్చర్యం కలుగకమానదు!. 30 సంవత్సరాల క్రితం డీఎస్పీగా పోలీసు శాఖలో చేరి ఐజీ స్థాయికి ఎదిగిన వెంకట్రామిరెడ్డి అలాంటివారే!. వారం క్రితం పదవీ విరమణ చేశారు. కారు, డ్రైవరు, గన్‌మెన్లు ఉన్నా అవేవీ అక్కర్లేదంటూ అత్యంత సాధారణ జీవితం గడిపేందుకు ఇష్టపడే వెంకట్రామిరెడ్డి సైకిలు తొక్కుకుంటూ రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి నిష్క్రమించారు. ఆయన నవ్వుతూ సంతోషంగా సైకిలు తొక్కుతూ వెళుతుండగా.. ఫోటోలు తీసిన పోలీసులు 'మీకు సెల్యూట్ సర్ అంటూ ఆయన నిరాడంబరతను కొనియాడారు. ఎక్కువకాలం పోలీసులకు శిక్షణ ఇచ్చే పీటీసీల్లో పనిచేసిన వెంకట్రామిరెడ్డి పోలీసుశాఖకు ఎందరో రక్షక భటుల్ని అందించారు. ఆయన రాయలసీమకు చెందినవారు. ఆయన వయసు 61 ఏళ్లు కాగా, తనతో ఉండే తండ్రికి 92 ఏళ్లు. ఇద్దరికీ ఒకటే వ్యసనం.. రోజూ కనీసం 3గంటల పాటు పుస్తకాలు చదవడం!

మత్స్యకారుల వలకు చిక్కిన భారీ వేల్‌షార్క్!

- రెండున్నర టన్నులకు పైగా బరువు
- తిరిగి సముద్రంలోకి నెట్టలేక.. తీరంలోనే వదిలేసిన వైనం

అచ్యుతాపురం(అనకాపల్లి జిల్లా), జనవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడిమడక శివారు కడపాలెం సముద్రంలో మత్స్యకారుల వలకు అరుదైన సొర చేప(వేల్ షార్క్) చిక్కింది. తిమింగలం జాతికి చెందిన ఈ చేప సుమారు 2.5 టన్నుల బరువుంది. వీటిని వ్యాపారులు కొనుగోలు చేయరు. దీంతో సముద్ర తీరంలోనే వదిలేశారు. కడపాలెం గ్రామానికి చెందిన సూరాడ వసంతరావు, సూరాడ ధర్మ, మరో 30 మంది మత్స్యకారులు కలిసి ఆదివారం ఉదయం సముద్రంలో చేపల వేటకు బయలుదేరారు. అచ్యుతాపురం-రాంబిల్లి మండలాల సరిహద్దులోని సీతపాలెం తీరం నుంచి వల వేసుకుంటూ సముద్రం లోపలికి వెళ్లారు. వల బరువుగా ఉండడంతో భారీగా చేపలు పడ్డాయని భావించి సాయంత్రం 4గంటలకు తీరానికి చేర్చారు. తీరా వలలో అరుదైన భారీ సొరచేప కనిపించడంతో అవాక్కయారు. తెల్లని మచ్చలతో ఉన్న ఈ చేపను 'పప్పర మేను' అని పిలుస్తామని మత్స్యకారులు తెలిపారు. అప్పటికే వలలో పడిన ఇతర జాతుల చేపలను తినేసిందని, వల బాగా పాడైపోయిందని చెప్పారు.



మత్స్యకారుల వలకు చిక్కి తీరానికి చేరిన వేల్ షార్క్

ఇలాంటి సొరచేపలను ఇక్కడ వ్యాపారులు ఎవరూ కొనుగోలు చేయరని తెలిపారు. అధిక బరువు వుండడంతో తిరిగి సముద్రంలోకి నెట్టలేక తీరంలో వదిలేశామని, కెరటాలు తీరంలో ఎక్కువ దూరం వస్తే.. అది తిరిగి సముద్రంలోకి వెళుతుందని, లేదా చనిపోతుందని చెప్పారు.

శ్రీతేజ్‌కు పరామర్శపై పునరాలోచించండి

- హీరో అల్లు అర్జున్‌కు చిక్కడపల్లి పోలీసుల నోటీసు
- జరగరానిది జరిగితే బాధ్యత వహించాలని హెచ్చరిక

రాంగోపాల్‌పేట్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాటలో గాయపడ్డ శ్రీతేజ్‌ను పరామర్శించే విషయమై పునరాలోచించాలని హీరో అల్లు అర్జున్‌కు రాంగోపాల్‌పేట్ పోలీసులు నోటీసిచ్చారు. ఆయన రాకతో ఆస్పత్రి కార్యకలాపాలకు, ఇతర రోగులకు ఇబ్బంది కలిగే అవకాశం ఉందని అందులో పేర్కొన్నారు. అయినా ఆస్పత్రికి వెళ్లాలని భావిస్తే.. ఆస్పత్రి వర్గాలతో, తమతో సమన్వయం చేసుకోవాలని.. తమ సూచనలను పాటించాలని సూచించారు. ఏదైనా జరగరానిది జరిగితే అందుకు అల్లు అర్జునే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. శ్రీతేజ్ ప్రస్తుతం సికింద్రాబాద్ మినిస్టర్ రోడ్డులోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. అతణ్ని పరామర్శించడానికి అల్లు అర్జున్ వెళ్లాలనుకుంటున్నట్టు సమాచారం అందడంతో.. రాంగోపాల్‌పేట్ పీఎస్ ఎస్సై నర్సింగరావు నేతృత్వంలోని పోలీసు సిబ్బంది ఆదివారం జూబ్లీహిల్స్‌లోని ఆయన ఇంటికి వెళ్లారు. అయన అందుబాటులో లేక పోవడంతో ఆయన మేనేజర్‌కు నోటీసు అందజేశారు. ఈ కేసులో అల్లు అర్జున్ ఆదివారం చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సంతకం చేశారు.

ఫార్ములా-ఈ కేసు..నేడు ఏసీబీ విచారణకు కేటీఆర్!

హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు రేసు కేసుకు సంబంధించి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) సోమవారం మాజీ మంత్రి కేటీఆర్‌ను విచారించనుంది. ఈ నెల 6న ఉదయం 10 గంటలకు విచారణకు హాజరు కావాలంటూ ఏసీబీ అధికారులు ఇప్పటికే కేటీఆర్‌కు నోటీసులు జారీ చేశారు. న్యాయ నిపుణుల సూచన మేరకు ఈ కేసులో విచారణకు హాజరవుతానని కేటీఆర్ కూడా శనివారం బీఆర్‌ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో తెలిపారు. మరోవైపు తనపై ఏసీబీ నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌ను క్వాష్ చేయాలంటూ కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై తీర్పును హైకోర్టు రిజర్వ్ చేసింది. తీర్పు ప్రకటించే వరకు కేటీఆర్‌ను అరెస్టు చేయవద్దని పేర్కొంది. అయితే విచారణ కొనసాగించవచ్చని తెలిపింది. ఈ నేపథ్యంలోనే కేటీఆర్‌ను విచారణకు రావాల్సిందిగా ఏసీబీ నోటీసులిచ్చింది. దీంతో సోమవారం జరగనున్న పరిణామాలపై ఉత్కంఠ నెలకొంది. మరోవైపు ఇదే కేసులో ఈ నెల 7న విచారణకు రావాలంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేటీఆర్‌కు సమన్లు జారీ చేసింది. కాగా, ఈ కేసులో సహనిందితులుగా ఉన్న బీఎల్ఎన్ రెడ్డి, అరవిందకుమార్‌లనూ ఈ నెల 2, 3వ తేదీల్లోనే విచారణకు రావాలని ఈడీ సమన్లు జారీ చేయగా.. వారిద్దరు కొంత సమయం కావాలని రాతపూర్వకంగా కోరారు. దీంతో వారికి ఈడీ అధికారులు వారం రోజుల వ్యవధి ఇచ్చారు.

ఇలపై విరిసిన ఇంద్రధనస్సులు

- ఉత్సాహంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు
- పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు, యువతులు, విద్యార్థినులు
- ఏపీ, తమిళనాడు, కర్ణాటక విజేతలకు 11న విజయవాడలో ఫైనల్స్
- తెలంగాణలో ఉమ్మడి జిల్లాల విజేతలకు 10న హైదరాబాద్‌లో...

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

"ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్ సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) రెండు తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు, కర్ణాటకల్లోని 81 కేంద్రాల్లో జనవరి 3, 4, 5 తేదీల్లో ఘనంగా జరిగాయి. 12వేల మందికి పైగా మహిళలు ఈ పోటీల్లో పాల్గొని తమ రంగవల్లులతో సంక్రాంతి శోభను ఇనుమడింపజేశారు. ప్రతి కేంద్రంలో ప్రథమ బహుమతి రూ.6,000, ద్వితీయ బహుమతి రూ.4,000, తృతీయ బహుమతి రూ.3,000తో పాటు అనేక కన్సొలేషన్ బహుమతుల్ని మహిళలు గెల్చుకున్నారు. పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు, ఉన్నతాధికారులు ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తెలంగాణలోని ఉమ్మడి జిల్లాల నుంచి ఎంపికైన పదిమంది మహిళలకు ఈ నెల 10న హైదరాబాద్‌లో ఫైనల్ పోటీలు జరుగుతాయి. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని 13 పాత జిల్లాలు, తమిళనాడు, కర్ణాటకల నుంచి ఒక్కొక్కరు... మొత్తం 15 మందికి ఈ నెల 11న విజయవాడలో ఫైనల్స్ జరుగుతాయి. ఫైనలిస్టులకు రూ.1,70,000కు పైగా బహుమతులు, ఇంకా గిఫ్ట్ హ్యాంపర్లు లభిస్తాయి.

ఉత్సాహంగా ముగ్గుల పండుగ

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. పెద్దసంఖ్యలో మహిళలు, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారు తీర్చిదిద్దిన రంగవల్లులతో సంక్రాంతి పండుగ ముందే వచ్చినట్టయింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అద్దంకి, ఒంగోలు, కనిగిరి, గిద్దలూరు కేంద్రాల్లో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీల్లో అత్యధికంగా 717 మంది మహిళలు, యువతులు పాల్గొని పోటీలు పడి రంగవల్లులను తీర్చిదిద్దారు. ఆ తర్వాత ఉమ్మడి జిల్లాలైన కర్నూలులో 373 మంది, చిత్తూరులో 312 మంది, విశాఖపట్నంలో 234, విజయనగరంలో 176, ఏలూరులో 115 మంది, శ్రీకాకుళంలో 109 మంది చొప్పున మహిళలు ఈ పోటీలకు హాజరయ్యారు. విజయవాడ ఎస్ఎస్ఆర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన పోటీల్లో ఎన్టీఆర్ జిల్లా నలుమూలల నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మిగిలిన జిల్లాలోనూ ముగ్గుల పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో సందడిగా జరిగాయి. ఈ సందర్భంగా పలుచోట్ల నిర్వహించిన గంగిరెద్దుల విన్యాసాలు, కోలాటాలు, జానపద నృత్యాలు, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కాకినాడలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, మచిలీపట్నంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, కర్నూలులో రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.





కర్నూలు జిల్లా ఆదోనిలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

ప్రకాశం జిల్లా కనిగిరిలోని అమరావతి గ్రౌండ్స్‌లో ముగ్గులు వేస్తున్న మహిళలు

ఇక ప్రతి ఇల్లూ విద్యుత్కేంద్రమే!

(మొదటి పేజీ తరువాయి)

లాంఛనంగా ప్రారంభించనున్నారు. ప్రయోగాత్మకంగా కుప్పంలో చేపట్టే పీఎం సూర్యఘర్‌ను రాష్ట్రమంతటికీ విస్తరిస్తారు. కుప్పం నియోజకవర్గంలో విద్యుత్తు కనెక్షన్లు కలిగిన 50వేల గృహాలకు ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. ప్రధాని సూర్యఘర్ కింద గృహాల రూఫ్‌టాప్‌పై సౌర ఫలకాలను ఏర్పాటు చేయడం ద్వారా విద్యుదుత్పత్తి చేసే ప్రక్రియను.. వ్యక్తిగతంలోనూ, సొసైటీ పరంగానూ ఏర్పాటు చేసుకునేందుకు కేంద్ర సంప్రదాయేతర ఇంధన శాఖ అనుమతిస్తోంది. పీఎం సూర్యఘర్‌లో చేరి కిలోవాట్ నుంచి రెండు కిలోవాట్‌ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యంలో కూడిన ప్యానళ్లను ఏర్పాటు చేస్తే.. రూ.18000 దాకా సబ్సిడీని కేంద్రం ఇస్తుంది. 2 నుంచి 3 కిలోవాట్‌ల ప్యానళ్లకైతే రూ.30వేల దాకా సబ్సిడీ వస్తుంది. ఇక, 3 కిలోవాట్లు దాటితే రూ.78వేల సబ్సిడీ వస్తుంది. పీఎం సూర్యఘర్ పథకాన్ని పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది.

పీఎం సూర్యఘర్‌పైనా జగన్ నిర్లక్ష్యం

కేంద్రం అమలు చేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలపై వైసీపీ ప్రభుత్వం కన్నెర్రచేస్తూ వచ్చింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నిధులు భరిస్తూ అమలు చేసే పథకాలపై గత సీఎం జగన్ నిర్లక్ష్యం చేసూ వచ్చారు. అదే తరహాలో తాము పీఎం సూర్యఘర్‌లో చేరడం లేదంటూ కేంద్రానికి లేఖ రాశారు. దీంతో.. గడచిన ఐదేళ్లలో ఈ పథకం రాష్ట్రంలో అమలు కాలేదు. ఫలితంగా సొంతంగా విద్యుత్తు ఉత్పత్తి చేసుకుని ఉచిత విద్యుత్తు పొందే అవకాశాన్ని రాష్ట్ర ప్రజలు కోల్పోయారు. పైపెచ్చు తొమ్మిది సార్లు జగన్ ప్రభుత్వం పెంచిన విద్యుత్తు చార్జీల భారాన్ని మోయాల్సి వచ్చింది. సూర్యఘర్ పథకాన్ని అమలు చేసి ఉంటే.. ప్రతి ఇల్లూ విద్యుదుత్పత్తి కేంద్రంగా మారేంది. ఈ పథకంలో చేరిన వారు తాము ఉత్పత్తి చేసిన విద్యుత్తును వాడుకుంటూనే, మిగిలిన విద్యుత్తును గ్రిడ్‌కు అనుసంధానం చేస్తూ కరెంటును అమ్ముకునే అవకాశం దక్కేది.

కూటమి రాకతో వెలుగు రేఖలు!

కూటమి ప్రభుత్వం అదికారంలోనికి వచ్చాక పీఎం సూర్యఘర్‌లో చేరేందుకు ఏపీకి అవకాశం ఇవ్వాలంటూ కేంద్రాన్ని సీఎం చంద్రబాబు కోరారు. రాష్ట్ర సంప్రదాయేతర ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ ఎండీ కేవీఎన్ చక్రధర్‌బాబు సెప్టెంబరులో కేంద్రానికి దరఖాస్తును అందించారు. గడచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పీఎం సూర్యఘర్ వినియోగించుకోకపోవడాన్ని కేంద్ర ఇంధనశాఖ తప్పుబట్టింది. ఇప్పటికైనా పీఎం సూర్యఘర్‌లో చేరేందుకు ముందుకు వచ్చినందుకు ఏపీని అభినందించింది. రాష్ట్రాన్ని కూడా ఈ పథకంలో కేంద్రం చేర్చింది.

కుప్పంతో మొదలు...

సోమవారం కుప్పం నియోజకవర్గంలో పీఎం సూర్యఘర్ పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయోగాత్మకంగా ప్రారంభిస్తారు. దీనిని రాష్ట్రమంతటికీ విస్తరిస్తున్నారు. ఈ పథకం అమల్లోకి వస్తే విద్యుదుత్పత్తి సంస్థలపై ఆధారపడకుండా స్వయం విద్యుత్కేంద్రాలుగా ఇంటి పైకప్పును మార్చుకునే కొత్త సౌరవిద్యుదుత్పత్తి విప్లవం అమలులోనికి రానున్నదని అధికారులు చెబుతున్నారు.

వైసీపీ అక్రమాలపై

త్వరలోనే యాక్షన్!

- ప్రస్తుతం విచారణ జరుగుతోంది: లోకేశ్

విశాఖపట్నం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అక్రమాలపై ప్రస్తుతం విచారణ జరుగుతోందని రాష్ట్ర ఐటీ, విద్యా మంత్రి లోకేశ్ చెప్పారు. సజ్జల రామకృష్ణారెడ్డి అటవీ భూముల ఆక్రమణ, మద్యం సహా మొత్తం అక్రమాలపై విచారణ పూర్తయ్యాక త్వరలోనే 'యాక్షన్' మొదలవుతుందని తను భావిస్తున్నట్లు తెలిపారు. బుధవారం (8న) విశాఖలో ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లపై ఆదివారమిక్కడి కలెక్టరేట్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రుషికొండలో నిర్మించిన ప్యాలెస్‌ను ఏంచేయాలో అర్థం కావడం లేదని, రూ.700 కోట్లు దుర్వినియోగం చేశారని అన్నారు. గతంలో అక్కడున్న కాటేజీల కూల్చివేత వల్ల రూ.300 కోట్లు నష్టం వెరసి రూ.1000 కోట్లు వృథా అయ్యాయని ధ్వజమెత్తారు. ఒక ముఖ్యమంత్రి భార్య కోసం సీఎం క్యాంప్ ఆఫీసు నిర్మించడం దేశంలో ఎక్కడా లేదన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం జగన్ ప్రభుత్వం ఏంచేసిందో చెప్పాలని నిలదీశారు.



విశాఖపట్నంలో ప్రధాని పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రి లోకేశ్

ఒక్క పరిశ్రమనైనా తీసుకురాకపోగా.. ఉన్నవాటిని తరిమేశారన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి ఆర్థిక ఇబ్బందులున్న మాట వాస్తవమేనని.. అయితే ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాయం అందిస్తున్నాయని చెప్పారు. ఈ కర్మాగారం ప్రైవేటీకరణ జరగదని తేల్చిచెప్పారు. 'మేం ఉత్తరాంధ్రకు ఐటీ కంపెనీలను రప్పించి విశాఖను ఐటీ కేంద్రంగా తీర్చిదిద్దుతాం. టీసీఎస్ సెంటర్ విలీనియం టవర్స్‌లోకి వస్తోంది. శాశ్వత సెంటర్‌కు రెండు, మూడేళ్లు పడుతుంది. ఐటీ కంపెనీలకు పెద్ద సెంటర్ నిర్మిస్తాం' అని వివరించారు. అరకు కాఫీ వ్యాపారాన్ని రూ.300 కోట్ల నుంచి రూ.3 వేల కోట్లకు పెంచుతామన్నారు. ఏజెన్సీలో గంజాయి నిర్మూలనకు ఈగిల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలకు 8న ప్రధాని విశాఖ వస్తున్నారని తెలిపారు. నగరంలో ఆయన రోడ్‌షో ఉంటుందన్నారు. బహిరంగ సభకు ప్రజలంతా స్వచ్ఛందంగా హాజరుకావాలని పిలుపిచ్చారు.



ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు రచించిన పుస్తకాలను యూటీఎఫ్ మహాసభల్లో ఆవిష్కరిస్తున్న అతిథులు

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది

- ఎన్‌టీఆర్ వర్సిటీ మాజీ వీసీ డాక్టర్ ఐవీ రావు ప్రశంస
- యూటీఎఫ్ స్వర్ణోత్సవ విద్యావైజ్ఞానిక మహాసభలు ప్రారంభం

కలెక్టరేట్ (కాకినాడ), జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని, విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో వారి పాత్ర కీలకమైనదని ఎన్‌టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి డాక్టర్ ఐవీ రావు కొనియాడారు. కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఆదివారం యూటీఎఫ్ స్వర్ణోత్సవ విద్యావైజ్ఞానిక మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథి ఐవీ రావు మాట్లాడుతూ.. నేటితరం విద్యార్థుల్లో క్రమశిక్షణ లోపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని సన్మార్గంలో పెట్టాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులదేనన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ నేటి పాలకుల ఉదాసీన వైఖరి వల్ల రాజ్యాంగ లక్షణాలు మరుగున పడ్డాయని, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత యూటీఎఫ్ ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. ప్రభుత్వ విధానాలతో విద్య నానాటికీ కుంటుపడుతోందని, ఇప్పటికే దేశంలో సగం వరకు విద్యారంగం ప్రైవేటీకరణ జరిగిందని చెప్పారు. ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు దేశ భవిష్యత్తును నిర్దేశిస్తారన్నారు. ప్రభుత్వ రంగ పాఠశాలలను పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి మాట్లాడుతూ 1974 ఆగస్టు 10న యూటీఎఫ్ ఏర్పడిందని, యాభై ఏళ్లుగా పోరాటాల ద్వారా ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించిందని తెలిపారు. అఖిలభారత ఉపాధ్యాయ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి సీఎన్ భారతి మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు రాసిన నాలుగు పుస్తకాలను సభలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, మాజీ అధ్యక్షుడు జోజయ్య, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కె.సత్తిరాజు, బీవీ రాఘవులు, జి.చిట్టిబాబు పాల్గొన్నారు.

తురకా కిశోర్ అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

అజ్ఞాతంలోకి వెళ్లిపోయి.. అప్పటి నుంచి పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయవాడ నుంచి మాచర్లకు బయలుదేరిన టీడీపీ నేతలు బొండా ఉమామహేశ్వరరావు, బుద్దా వెంకన్నలపై దాడి చేసిన కేసులో కిశోర్ ప్రధాన నిందితుడు. 2022 డిసెంబరు 16న మాచర్ల పట్టణంలో తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 'ఇదేం కర్మ రాష్ట్రానికి' కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మానందరెడ్డిపై దాడి చేసిన అనంతరం కిశోర్ వైసీపీ నాయకులను వెంటబెట్టుకొని టీడీపీ ఆస్తులను, పార్టీ కార్యాలయంతోపాటు వాహనాలను ధ్వంసం చేసిన ఘటనల్లో ప్రధాన నిందితుడిగా ఉన్నారు. 2024 మేలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మాచర్ల నియోజకవర్గంలో పోలింగ్ రోజున హింసాకాండకు పాల్పడ్డారు. రెంటచింతల మండలం పాలువాయిగేటులో పోలింగ్ రోజు అక్కడ ఏజెంట్‌గా ఉన్న నంబూరి శేషగిరిరావుపై దాడిచేసి గాయపరిచారు. మాచర్ల పట్టణంలోని పీడబ్ల్యూడీ కాలనీలో టీడీపీ నేత యెనుముల కేశవరెడ్డి ఇంటిపై విధ్వంసానికి పాల్పడి పలువురిని గాయపరిచారు. పోలింగ్ మరుసటి రోజు కారంపూడి పట్టణంలో సీఐ నారాయణస్వామిపై దాడి చేసి విధ్వంసానికి పాల్పడ్డారు. టీడీపీ కార్యాలయంపై దాడిచేయడంతోపాటు టీడీపీ నేతల వాహనాలు ధ్వంసం చేసి వారి గృహాల్లో లూటీ చేసిన కేసుల్లోనూ కిశోర్ ప్రధాన నిందితుడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కిశోర్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. నెలలు గడుస్తున్నా నిందితుడిని పట్టుకోకపోవడంతో పోలీసుల తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో విజయపురిసౌత్ ఎస్ఐ షేక్ మహ్మద్ షఫీ.. కిశోర్‌పై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి హైదరాబాద్‌లో పట్టుకున్నారు.

టీడీపీ ఏజెంట్‌పై కర్రలతో దాడి..

గతేడాది సార్వత్రిక ఎన్నికల రోజు(మే 13న) పాలువాయిగేట్ గ్రామంలోని 202 పోలింగ్ బూత్‌లో అప్పటి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎంలను ధ్వంసం చేస్తున్న సమయంలో టీడీపీ ఏజెంట్ నంబూరి శేషగిరిరావు అడ్డుకోడానికి ప్రయత్నించారు. దీంతో పోలింగ్ బూత్ నుంచి బయటకు రాగానే తురకా కిశోర్‌తోపాటు సర్పంచ్ చింతా సుబ్బయ్య కర్రలతో దాడిచేసి శేషగిరిరావును విచక్షణా రహితంగా కొట్టారు. ఆ ఘటనలో కిశోర్‌పై రెంటచింతల పోలీసుస్టేషన్‌లో 147, 148, 307, 324, 149 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఆ కేసులో 8వ నిందితుడిగా ఉన్న కిశోర్ అప్పటి నుంచి పరారీలో ఉన్నారు. పీటీ వారెంట్ ద్వారా కిశోర్‌ను అదుపులోకి తీసుకుని విచారించడానికి పోలీసు యంత్రాంగం సమాయత్తమవుతోంది.

ఎన్‌కౌంటర్ చేసినా తప్పులేదు!: బుద్దా

విజయవాడ (వన్‌టౌన్), జనవరి 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో తాము ప్రయాణిస్తున్న కారుపై తురకా కిశోర్ పెద్దపెద్ద బాదులతో దాడి చేశారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న తెలిపారు. చంపాలన్న ఉద్దేశంతోనే ఆ దాడి చేశారని, ఆ రోజు తానూ, బొండా ఉమా త్రుటిలో తప్పించుకున్నామని గుర్తుచేసుకున్నారు. ఈ మేరకు నాటి ఫొటోను బుద్దా వెంకన్న ఆదివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఇటువంటి ఆకురౌడీలు సమాజానికి హానికరమని, వారిని ఎన్‌కౌంటర్ చేసినా తప్పులేదని పేర్కొన్నారు. నాడు చైర్మన్ పదవి ఆశ చూపి తమపైకి తురకా కిశోర్‌ను వదిలారన్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.